
RNI No. APTEL/2006/17880 www.bharathasakthi.com



# భారత శక్తి ®

తెలుగు దినపత్రిక
VOICE OF INDIAN



Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి: 19 సంచిక:304 హైదరాబాద్, శుక్రవారం, 30 మే 2025 పేజీలు: 12 వెల: 1.00

## దేశ భద్రత విషయంలో రాజకీయాలకు తావులేదు: రేవంత్



మేడ్చల్: దేశ భద్రత విషయంలో రాజకీయాలకు తావులేదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. భారత్ సైన్యం విజయవంతంగా ఆపరేషన్ సిందూర్ నిర్వహించిందన్నారు. రాజకీయాలకు అతీతంగా ఆపరేషన్ సిందూర్‌కు మద్దతిచ్చినట్లు తెలిపారు. ఏఐసీసీ ఆదేశం మేరకు మేడ్చల్‌లోని బాచుపల్లిలో కాంగ్రెస్ 'జైహింద్ ర్యాలీ' నిర్వహించింది. వీఎన్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల నుంచి కేజీఆర్ కన్వెన్షన్ వరకు సాగిన ర్యాలీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో రేవంత్ మాట్లాడారు.

" ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా నెక్లెస్ రోడ్డులో ర్యాలీ చేశాం. పాకిస్థాన్‌కు గుణపాఠం చెప్పాలని మోదీకి మద్దతు తెలిపాం. 4 రోజుల యుద్ధం తర్వాత ఏం జరిగిందో తెలియదు. కానీ, యుద్ధం ఆపేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మీడియా ముందుకు వచ్చి యుద్ధం తానే ఆపానని ప్రకటించారు. యుద్ధానికి మద్దతివ్వాలని అఖిలపక్షం నిర్వహించిన ప్రధాని మోదీ.. యుద్ధం ఆపే విషయంలో ఎందుకు చర్చించలేదు. గుండెల్లో ధైర్యం ఉన్న నాయకుడే యుద్ధాన్ని గెలిపిస్తాడు. గతంలో ఇందిరాగాంధీ చైనాను మోకాళ్లపై కూర్చోబెట్టారు. గల్వాన్ ఘటనలో మన కర్నల్ సంతోష్‌ను పొట్టన పెట్టుకుంటే ఏమీ చేయలేకపోయాం. 1971లో అమెరికా అండతో పాకిస్థాన్ మనపై యుద్ధానికి వచ్చింది. యుద్ధం ఆపాలని అప్పటి అమెరికా అధ్యక్షుడు... ఇందిరాగాంధీని బెదిరించారు. కానీ, ఆమె బెదిరింపులకు లొంగలేదు. పాక్‌ను ఓడించి.. ఆ దేశాన్నే రెండు ముక్కలు చేశారు" అని రేవంత్ అన్నారు.

## బెంగాల్‌లో 'నిర్మమత సర్కార్': మోదీ మండిపాటు

పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీని ఉద్దేశించి ప్రధాని నరేంద్రమోదీతీవ్ర విమర్శలు చేశారు. ప్రస్తుతం రాష్ట్రం వరుస సంక్షోభాలతో సతమతమవుతోందని అన్నారు. ముర్షిదాబాద్, మాల్దాలో చోటుచేసుకున్న ఘర్షణలు ఆమె ప్రభుత్వ క్రూరత్వం, ఉదాసీనతకు నిదర్శనమని ధ్వజమెత్తారు. ప్రస్తుతం రాష్ట్రంలో 'నిర్మమత (దయలేని) ప్రభుత్వం ఉందని మండిపడ్డారు. ఆ రాష్ట్రంలో నిర్వహించిన ర్యాలీలో ఈ వ్యాఖ్యలు చేశారు.



కేంద్రం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఇటీవల మాల్దా, ముర్షిదాబాద్, సౌత్ 24 పరగణాలు, హుగ్లీ జిల్లాల్లో నిరసనకారులు పెద్దఎత్తున ఆందోళనకు దిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పలు ప్రధాన రహదారులు, రైల్వే ట్రాక్‌లను దిగ్బంధించారు. ఈ క్రమంలోనే పోలీసులపైనా ఆందోళనకారులు రాళ్లు రువ్వడంతో లాఠీఛార్జీకి దారితీసింది. ముర్షిదాబాద్ ప్రాంతంలో పోలీసు వాహనాలకు నిప్పు పెట్టడం వంటి ఘటనలతో అక్కడ విధ్వంసానికి దారితీసింది.

ఈ ఘర్షణలపై కలకత్తా హైకోర్టు నియమించిన నిజనిర్ధారణ కమిటీ ఇచ్చిన నివేదికతో ఇప్పటికే తృణమూల్ కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వక్ఫ్‌చట్ట వ్యతిరేక నిరసనల ఫలితంగా చెలరేగిన మతపరమైన ఘర్షణలకు స్థానిక ఎమ్మెల్యే, నాయకులు కారణమని నివేదిక ప్రస్తావించింది. ఆ సమయంలో పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడాన్ని ఎత్తిచూపింది. ఈ వ్యవహారం భాజపా చేతిలో అస్త్రంగా మారింది. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికల జరగనున్న నేపథ్యంలో తాజా ర్యాలీలో మమత ప్రభుత్వాన్ని మోదీ ఎండగట్టారు.

"రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీ వ్యక్తులు కొన్ని ఇళ్లను గుర్తించి తగులబెడుతుంటే, పోలీసులు దానిని అడ్డుకోకుండా చూస్తూ ఉంటే.. అది ఎంతటి భయానక పరిస్థితో అర్థంచేసుకోండి. ఇక్కడి ప్రభుత్వంపై ప్రజలకు విశ్వాసం లేదు. ప్రభుత్వాన్ని నడిపేది ఇలాగేనా..? బుజ్జగింపు రాజకీయాల పేరిట గూండాలకు స్వేచ్ఛనిచ్చారు. ఇక్కడ ప్రతి సమస్యకు కోర్టు జోక్యం చేసుకోవాల్సి వస్తుంది. లేకపోతే ఏదీ పరిష్కారం కాదు'' అని మోదీ (దుయ్యబట్టారు.

పాక్ గడ్డపై మూడుసార్లు దాడులు..

ఈ ర్యాలీలో ఆపరేషన్ సిందూర్ గురించి ప్రస్తావించారు. "ఆ ఆపరేషన్ ఇంకా పూర్తికాలేదని బెంగాల్ గడ్డ మీద నిలబడి, 140 కోట్ల మంది భారతీయుల తరఫున ప్రకటిస్తున్నాను. ఏప్రిల్ 22 జరిగిన పహల్గాం ఉగ్రదాడిపై బెంగాల్‌లో కూడా తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. సిందూరం శక్తి ఏంటో మన ఆర్మీ ఉగ్రవాదులకు రుచి చూపించింది. మనం వారి ఇంట్లోకి ప్రవేశించి, మూడుసార్లు దాడులు చేశామని పాకిస్థాన్ అర్థం చేసుకోవాలి" అని అన్నారు. 2016లో జరిగిన సర్జికల్ స్ట్రైక్స్, 2019లో జరిగిన బాలాకోట్ దాడులు, ఇప్పటి ఆపరేషన్ సిందూర్‌ను ఉద్దేశించి మోదీ పరోక్షంగా ప్రస్తావించారు.

## సొంత పార్టీ వాళ్లే ఓడించారు..

## భారాస ఎమ్మెల్సీ కవిత సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్: భారాస ( అధినేత, మాజీ సీఎం కేసీఆంకు తాను అంతర్గతంగా ఇచ్చిన ఫీడ్‌బ్యాక్ ఎలా లీక్ అయిందని ఆయన కుమార్తె, ఎమ్మెల్సీ కవిత (ప్రశ్నించారు. కట్టడి చేయమంటే పెయిడ్ సోషల్ మీడియాలో విమర్శిస్తున్నారని ఆరోపించారు. మీడియాతో చిట్‌చాట్‌లో ఆమె సంచలన వ్యాఖ్యలు చేశారు.

లీకు వీరులను ఎండగట్టమంటే నాపై ప్రతాపమా?

"కేసీఆర్‌కు నోటీసులు ఇస్తే నేతలెవరూ స్పందించకపోతే ఎలా? నాకు నీతులు చెబుతూ కోవర్టులు ఉన్నారంటున్నారు. నా మీద పడి ఏడిస్తే ఎలా?ఇంటి ఆడబిడ్డ గురించి ఎలా పడితే అలా మాట్లాడిస్తే అది మర్యాదేనా? లిక్కర్ కేసు సమయంలో రాజీనామా చేస్తానంటే కేసీఆర్ వద్దని వారించారు. ఎంపీగా పోటీ చేస్తే సొంత పార్టీ వాళ్లే కుట్రపూరితంగా ఓడించారు. అదే జిల్లాలో ప్రొటోకాల్ ఉండాలని కేసీఆర్ ఎమ్మెల్సీ ఇచ్చారు. లీకు వీరులను ఎండగట్టమంటే నాపై ప్రతాపం చూపుతున్నారు. కాంగ్రెస్, భాజపాపై మాట్లాడాలి కానీ.. నాపై దాడి చేస్తే ఎలా?

జైలులో ఉన్నప్పుడే ఆ ప్రతిపాదన వస్తే వ్యతిరేకించా

భారాసను గంపగుత్తగా భాజపాకు అప్పగించాలన్న ప్రయత్నం జరుగుతోంది. జైలులో ఉన్నప్పుడే ఆ ప్రతిపాదన వస్తే నేను వ్యతిరేకించాను. భాజపాలో భారాస విలీనం కాకుండా స్వతంత్రంగా ఉండాలన్నదే నా అభిమతం. నాపై దుష్ప్రచారం చేస్తున్నా పార్టీ స్పందించలేదు. నన్ను పార్టీ నుంచి ఎవరు బయటకు పంపుతారు?.. అంత సీన్ లేదు. కాంగ్రెస్‌తో సంప్రదింపులు జరిపినట్లు జరుగుతున్న ప్రచారం శుద్ధ అబద్ధం. భారాసలో కేసీఆర్ మాత్రమే నాకు నాయకుడు.. ఆయన నాయకత్వంలోనే పనిచేస్తాను. వెన్నుపోటు పొడవడం నా లక్షణం కాదు... నేరుగానే పోరాడతాను. కొత్త పార్టీ అవసరం లేదు.. ఉన్న పార్టీని బాగా చూసుకుంటే చాలు. లేఖలో నేను చేసిన సూచనల్లో ఒక్కటైనా తప్పుందా? కేసీఆర్‌ను నడిపించేంత పెద్దవాళ్లు అయ్యారా? కడుపులో విషం పెట్టుకుని బయటకు నవ్వుతూ ఉండలేను. నా తండ్రికి వందల లేఖలు రాశాను.. తప్పేంటి?సాధారణంగా కేసీఆర్ లేఖను చదివాక చింపుతారు. ఈసారి అలా చింపలేదు. కుట్ర ఎవరు చేశారో నాకు తెలియదు... బయటపెట్టాలని అంటున్నాను. లీకు వీరుడా.. లీకు వీరులా? అనేది తెలియాలి.

కడుపులో బిడ్డను పెట్టుకుని ఉద్యమంలో పనిచేశా

దేశం వెలుపల ఐటీ సెల్‌లు పెట్టి నాపై పోరాడుతామంటే ఎలా?దొంగల్ని పట్టుకోమంటే చేతగాక నాపై ప్రతాపం చూపితే ఎలా? పార్టీ నాది అని ప్రతి ఒక్కరూ పోరాడితేనే ఫలితం ఉంటుంది. కేసీఆర్‌కు నోటీసులు ఇస్తే.. కేవలం 'ఎక్స్'లో పోస్టు పెట్టి వదిలేస్తే ఎలా? నేను ఏనాడూ పదవుల కోసం పోరాడలేదు. కడుపులో బిడ్డను పెట్టుకుని తెలంగాణ ఉద్యమంలో సైనికురాలిగా పనిచేశాను. నన్ను విమర్శిస్తున్న నేతలు కేసీఆర్ నీడన ఉన్నారు తప్ప.. చేసిన కార్యక్రమాలు ఏమున్నాయి? వర్కింగ్ ప్రెసిడెంట్‌కు ఇవ్వాల్సిన ప్రొటోకాల్.. గౌరవం ఉంటుంది. తెలంగాణ జాగృతి ఉద్యమ సంస్థ.. అది ఇవాళ పుట్టింది కాదు. పార్టీ చేయని కార్యక్రమాలను జాగృతి తరఫున చేస్తున్నాను. సాంస్కృతిక, సమకాలీన అంశాలపై బలంగా పోరాడాం.

నన్ను, కేసీఆర్‌ను విడదీసే కుట్ర..

నా తండ్రిని, నా కుటుంబాన్ని వదిలి నేనెందుకు వెళ్తాను?నా




కుటుంబానికి నన్ను దూరం చేసే ప్రయత్నం జరుగుతోంది. దూరం చేస్తే ఎవరికి లాభం జరుగుతుందో ఆలోచించుకోవాలి. నన్ను, కేసీఆర్‌ను విడదీసే కుట్ర చేస్తున్నారు. నేను ఎవరి నాయకత్వం కింద పనిచేయను.. కేసీఆర్ మాత్రమే నాకు నాయకుడు. దామోదర్‌రావు, గండ్ర మోహన్‌రావును ఎవరు పంపారో నాకు తెలియదు. వాళ్లిద్దరూ ఎవరికి దగ్గరో తెలుసు కదా! వేరే నేత అంశంలో స్పందించిన పార్టీ.. నా విషయంలో ఎందుకు స్పందించడం లేదు? భారాస బలహీనమైతే కాంగ్రెస్, భాజపాలకు లాభం చేకూరుతుంది. కేసీఆర్ ఎలాంటి తప్పు చేయలేదు. ఆయన మళ్లీ ముఖ్యమంత్రి అవుతారు.. అందులో ఎలాంటి అనుమానం లేదు. లోక్‌సభ ఎన్నికల్లో ఓటమికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలి కానీ.. 'ఎక్స్'లో పోస్టులకు పరిమితమైతే ఎలా?" అని కవిత ఘాటుగా వ్యాఖ్యానించారు.

## శెభాష్.. స్మార్ట్‌ఫోన్ ముట్టుకోకుండా సివిల్స్ కొట్టావమ్మా: సజ్జనార్ ప్రశంస

హైదరాబాద్: ఇటీవల యూపీఎస్సీ సివిల్స్ ఫలితాల్లో 11వ ర్యాంకుతో అదరగొట్టిన ఇట్టబోయిన సాయి శివానిని తెలంగాణ ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ అభినందించారు. సాధారణ కుటుంబానికి చెందిన సాయి శివాని.. సివిల్స్‌లో చిన్న వయసులోనే అత్యుత్తమ ర్యాంకు సాధించి యువతకు స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. నేటి డిజిటల్ యుగంలో స్మార్ట్ ఫోన్ ముట్టుకోకుండా, సోషల్ మీడియా జోలికి వెళ్లకుండా అనుకున్న లక్ష్యాన్ని సాధించారంటూ ప్రశంసలు కురిపించారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి ఉన్నతంగా రాణించాలని ఆమెకు సూచించారు.

సివిల్స్ ర్యాంకర్ సాయి శివాని మేనమామ ప్రకాశ్ రావు ఆర్టీసీలో డీఎం హోదాలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని బస్ భవన్‌లో గురువారం ఆమె తన కుటుంబ సభ్యులతో వచ్చి సజ్జనార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె తల్లిదండ్రులు రాజు, రజితతో పాటు సాయి శివానిని సజ్జనార్ సత్కరించారు. అనంతరం ఈ ఫొటోలను సజ్జనార్ తన ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు.



## పేదల ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇస్తున్న రాష్ట్రం మరొకటి లేదు: భట్టి విక్రమార్క

ఖమ్మం: అన్ని సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క (అన్నారు. ఖమ్మంలో ప్రభుత్వ పథకాల అమలుతీరుపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈసారి ధాన్యం దిగుబడి రికార్డు స్థాయిలో వచ్చిందని చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో కూడా రానంత ధాన్యం దిగుబడి వచ్చిందని తెలిపారు.

"రికార్డు స్థాయిలో వస్తే.. అంతే స్థాయిలో సేకరిస్తున్నాం. సన్న వడ్లకు బోనస్ ఇవ్వడంలో ఎలాంటి లోపాలు జరగవద్దు. పేదల ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇస్తున్న రాష్ట్రం మరొకటి లేదు. పేదల ఇంటి నిర్మాణానికి గత భారాస ప్రభుత్వం కూడా రూ.5 లక్షలు ప్రకటించింది. కానీ పదేళ్లలో ఒక్కరికి కూడా ఇవ్వలేదు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరగాలి. పూర్తిస్థాయిలో భూభారతి అమలుకు సిద్ధం అవుతున్నాం. ధరణిని రద్దు చేస్తామని ఎన్నికల అజెండాలోనే పెట్టాం" అని భట్టి విక్రమార్క తెలిపారు. కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.



## మంత్రులకు డిన్నర్ పార్టీ...

హైదరాబాద్, మే 29,

తెలంగాణ కేబినెట్ విస్తరణ మళ్లీ ముహూర్తం వాయిదా పడింది. ఈ నేపథ్యంలోనే ఇప్పుడు మరో ఆసక్తికర పరిణామం జరిగింది. సీఎం రేవంత్‌రెడ్డి మంత్రులందరికి తన ఇంట్లో డిన్నర్ పార్టీ ఇవ్వడంతో మళ్లీ కేబినెట్ అంశం తెరపైకొచ్చింది.సీఎం పిలుపుతో మంత్రివర్గం కదిలింది..! మా ఇంటికొచ్చి విందు ఆరగించి పోండి అన్న ఆహ్వానంతో దాదాపుగా మంత్రివర్గం మొత్తం సీఎం ఇంట్లో వాలిపోయింది. ముఖ్యమంత్రి ఇచ్చిన విందును ఆరగించింది..! అంతా ఓకే కానీ.. ఇప్పుడే ఈ డిన్నర్ ఎందుకు..? సీఎం ఢిల్లీ వెళ్లనుండటంతో సడెన్‌గా ఈ విందు ఏర్పాటేంటి..? విందు పేరుతో మంత్రులంతా ఏం చర్చించారు..? సీఎం వాళ్లకు ఏం చెప్పారు..? ఇప్పుడీ అంశాలే ఆసక్తిని పెంచుతున్నాయి. కేబినెట్ బెర్త్ కోసం వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్న నేతల్లో మరింత ఉత్కంఠ రేపుతున్నాయి.మొన్ననే మంత్రివర్గ విస్తరణ దాదాపుగా పూర్తౌందని.. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే అందుబాటులో లేకపోవడంతో ప్రకటన వాయిదా పడిందని పార్టీ నేతలు చెప్పుకొచ్చారు. ఖర్గే ఈనెల 30న అంటే రేపు ఢిల్లీలో ల్యాండ్ అవుతారు. అలాగే ఇట్నుంచి సీఎం రేవంత్ రెడ్డి కూడా రేపే హస్తినకు వెళ్తారు. దీంతో ఇన్నాళ్ల నిరీక్షణకు రేపు ఎండ్ కార్డ్ పడబోతోందన్న ప్రచారం గట్టిగా నడుస్తోంది. ఆ కేబినెట్ విస్తరణ ఊహాగానాల నేపథ్యంలోనే ఈ ప్రైవేట్ డిన్నర్‌పై తెలంగాణ కాంగ్రెస్‌లో ఆసక్తికర చర్చ నడుస్తోంది. విస్తరణకు ముందు సీఎం ఆనవాయితీగా ఇస్తున్న డిన్నర్ అంటూ కూడా బయట టాక్ వినిపిస్తోంది. నేను మంత్రినవుతా.. నేను మంత్రినవుతా ఇప్పటికే ఎంతోమంది బడా నేతలు ఉవ్విళ్లూరుతున్నారు. గల్లీ నుంచి ఢిల్లీ దాకా ఎన్నో ప్రయత్నాలు చేశారు. మంత్రిపదవి కోసం పార్టీకే అల్టిమేటం జారీ చేసిన నేతలూ ఉన్నారు. వాళ్లంతా ఈ డిన్నర్ మీటింగ్‌ని ఆసక్తిగా తిలకించారు. మంత్రివర్గ విస్తరణపైనే మాట్లాడారంటూ చర్చించుకుంటున్నారు. ఆ లిస్ట్‌లో తమ పేరు ఉందో లేదోనన్న టెన్షన్‌లో పడ్డారు నేతలు. మొత్తంగా.. సీఎం డిన్నర్ పార్టీపై ఓవైపు ఆసక్తి.. మరోవైపు నేతల్లో ఉత్కంఠ నెలకొంది.



భారత శక్తి
VOICE OF INDIAN

# భారీగా పెరుగుతున్న డిఫెన్స్ ఆర్డర్లు

ఆపరేషన్ సిందూర్ తర్వాత భారతదేశంపై ప్రపంచ దేశాల వైఖరి ఒక్కసారిగా మారిపోయింది.. అమెరికా లాంటి దేశం కూడా మన గురించి ప్రత్యేకంగా ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడింది.. ఇక ఇతర దేశాల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు.

ఆపరేషన్ సిందూర్ ద్వారా మన సాయుధ సంపత్తి.. ఆయుధ సామర్థ్యం ప్రపంచానికి సరికొత్తగా తెలిసింది. ఇక ఉగ్రవాద దేశం పాక్ కు ఐతే ఎన్నో విధాలుగా నష్టం జరిగింది. ఉగ్రవాద స్థావరాలు నేలకూలిపోయాయి. విలువైన జలాలు ఆగిపోయాయి. పంట పొలాలు ఎండిపోతున్నాయి. తినడానికి తిండి గింజలు కరువయ్యాయి. మొత్తంగా చెప్పాలంటే తాగడానికి కూడా ఇప్పుడు అక్కడ నీరు లేదు. దేహీ అంటూ చివరికి మన పాదాల మీద పడాల్సిన పరిస్థితి అక్కడి ప్రజలకు ఏర్పడింది. ఇప్పటికే నీటి కోసం మన దేశానికి ఉగ్రవాద దేశం అనేకసార్లు లేఖలు రాసింది. అయినప్పటికీ భారత్ ఏ మాత్రం పట్టించుకోవడం లేదు.ఆపరేషన్ సిందూర్ మనకు అనేక ప్రయోజనాలను అందించింది. ఇందులో ఒకటి శత్రుదేశంలో దాక్కుని ఉన్న ముష్కరులను సర్వనాశనం చేయగా.. మరపక మన ఆయుధాల పనితీరు ఎంత కచ్చితంగా ఉన్నాయో ప్రపంచానికి తెలిసాయి. కేవలం ఫారిన్ కంట్రీస్ వెపన్స్ మీద ఆధారపడకుండా.. వాటికి ఇండియన్ టెక్నాలజీ జత చేయడం వల్ల ఊహించిన దానికంటే ఎక్కువ ఫలితాలు వచ్చాయని డిఫెన్స్ నిపుణులు చెబుతున్నారు. ఇజ్రాయిల్ నుంచి ఇండియన్ డిఫెన్స్ సంస్థ అయినటువంటి నైబీ లిమిటెడ్ కు భారీ ఆర్డర్ ఇచ్చింది. యూనివర్సల్ రాకెట్ లాంచర్లను సరఫరా చేయాలని కోరింది. ఈ ఆర్డర్ విలువ 150 కోట్లుగా ఉంటుందని తెలుస్తోంది. గడచిన కొన్ని వారాలుగా నేషనల్ డిఫెన్స్ స్టాక్ పై ఇన్వెస్టర్లు ఫోకస్ చేస్తున్నారు. ఈ క్రమంలో తాజా డీల్ వల్ల నైబ్ కంపెనీ షేర్ల ధర ఏకంగా 5% గ్రోత్ రిజిస్టర్ చేసింది. స్మాల్ క్యాప్ డిఫెన్స్ కంపెనీ స్టాక్ ధర ప్రస్తుతం ఒక్కొక్కటి 1602 రూపాయల వద్ద ట్రేడింగ్ సాగింది. గడిచిన 52 వారాల గరిష్ట ధర 2045 గా ఉన్న విషయం విధితమే. నైబీ సంస్థ పూణే కేంద్రంగా కార్యకలాపాల సాగిస్తోంది. 300 కిలోమీటర్ల రేడియస్ లో పనిచేయగలగే రాకెట్ లాంచర్లను తయారు చేయడం ఈ సంస్థకున్న ప్రత్యేకత. ఈ కంపెనీ ఇజ్రాయిల్ దేశానికి రాకెట్ లాంచర్లను 2027 నవంబర్ మూడు నాటికి అందజేయాల్సి ఉంటుంది. అయితే ఈ లాంచర్లను ఏ సంస్థ డెలివరీ అందుకుంటున్నదో.. ఆ వివరాలను నైబీ సంస్థ గోప్యంగా ఉంచింది. ఇక కంపెనీ రిసీవ్ చేసుకున్న ఆర్డర్ ప్రపంచ స్థాయిలో అతెంటిఫికేషన్ ఇస్తుందని.. బిజినెస్ గ్రోత్ కు ఉపయోగపడుతుందని డిఫెన్స్ వర్గాలు అంటున్నాయి. ఇక దేశంలోని మొట్టమొదటిసారిగా నైబి సంస్థ వరల్డ్ మార్కెట్లో పాగా వెయ్యడానికి హైటెక్ యూనివర్సల్ రాకెట్ లాంచర్ లు తయారు చేస్తోంది. గడచిన ఐదు సంవత్సరాలలో నైబీ సంస్థ 16వేల శాతం రాబడిని ఇన్వెస్టర్లకు అందించింది. జూన్ 2020లో ఈ సంస్థ స్టాక్ ధర ఒక్కొక్కటి 9.93 గా ఉండటం విశేషం. కానీ ప్రస్తుతం అది 1600 పెరిగిపోయింది. ఇక గడిచిన నెలల కాలంలో స్టాక్ గ్రోత్ 18% పెరిగింది.భారత్ రక్షణ రంగంలో స్వావలంబన సాధించడానికి కావేరి ఇంజిన్ ప్రాజెక్ట్ ఒక కీలకమైన ప్రయత్నం. 1980లలో ప్రారంభమైన ఈ ప్రాజెక్ట్, స్వదేశీ ఫైటర్ జెట్ ఇంజిన్‌ను అభివృద్ధి చేసి, విదేశీ దేశాలపై ఆధారపడటాన్ని తగ్గించాలనే లక్ష్యంతో ముందుకు సాగింది. సోషల్ మీడియాలో హ్యాష్‌ట్యాగ్ ద్వారా రక్షణ నిపుణులు, ఔత్సాహికులు, సామాన్య పౌరులు ఈ ప్రాజెక్ట్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈ ఉద్యమం భారత వాయుసేన సాంకేతికతలో ఆత్మనిర్భరత సాధించే దిశగా ఒక బలమైన పిలుపునిస్తోంది.కావేరి ఇంజిన్‌ను రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలోని గ్యాస్ టర్బైన్ రీసెర్చ్ ఎస్టాబ్లిష్మెంట్ అభివృద్ధి చేసింది. ఈ లో?బైపాస్, ట్విన్?స్పూల్ టర్బోఫ్యాన్ ఇంజిన్‌ను 80 కిలో న్యూటన్ల థ్రస్ట్ ఉత్పత్తి చేసేలా రూపొందించారు, ప్రధానంగా లైట్ కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ తేజస్‌కు శక్తినిచ్చేందుకు. అయితే, థ్రస్ట్ లోపాలు, బరువు సమస్యలు, అణ్వస్త్ర పరీక్షల వల్ల విధించిన అంతర్జాతీయ ఆంక్షలు ఈ ప్రాజెక్ట్‌ను ఆలస్యం చేశాయి. ఫలితంగా, తేజస్ విమానాలు అమెరికా జనరల్ ఎలక్ట్రిక్ ఈ404 ఇంజిన్లను ఉపయోగించాయి.కావేరి ఇంజిన్ ప్రాజెక్ట్ అనేక సాంకేతిక సవాళ్లను ఎదుర్కొంది. ఏరోథర్మల్ డైనమిక్స్, సింగిల్ క్రిస్టల్ బ్లేడ్ తయారీ, స్క్రాచ్ కంట్రోల్ సిస్టమ్ వంటి అధునాతన సాంకేతికతల అభివృద్ధిలో భారత్‌కు అనుభవం తక్కువగా ఉంది. నైపుణ్యం కలిగిన మానవ వనరుల కొరత, పశ్చిమ దేశాల సాంకేతిక ఆధిపత్యం కూడా ప్రధాన అడ్డంకులుగా నిలిచాయి. అయినప్పటికీ, ఇటీవలి సంవత్సరాల్లో ఈ ప్రాజెక్ట్‌లో గణనీయమైన పురోగతి సాధించారు. కావేరి డెరివేటివ్ ఇంజిన్ కిలో న్యూటన్ల డ్రై థ్రస్ట్‌ను సాధించి, 2024లో ఫ్లైట్ టెస్టింగ్‌కు అనుమతి పొందింది. ఈ ఇంజిన్‌ను మానవ రహిత యుద్ధ విమానం 'ఘాతక్'లో ఉపయోగించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో హ్యాష్‌ట్యాగ్ ట్రెండింగ్‌లో నిలిచింది, ఇది భారత పౌరులు, రక్షణ నిపుణులు, ఔత్సాహికుల ఏకగ్రీవ ఆకాంక్షను ప్రతిబింబిస్తోంది. ఈ ఉద్యమం భారత్‌ను విదేశీ ఇంజిన్లపై ఆధారపడకుండా చేయడం, జాతీయ భద్రతను బలోపేతం చేయడం లక్ష్యంగా పెట్టుకుంది. రక్షణ మంత్రి రాజనాథ్ సింగ్ ఏప్రిల్ 30, 2025న కావేరి ప్రాజెక్ట్‌కు అదనపు నిధులను ప్రకటించడంతో ఈ ఉద్యమం మరింత ఊపందుకుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ట్యాగ్ చేస్తూ, ఈ ప్రాజెక్ట్‌కు మరింత నిధులు, వనరులు కేటాయించాలని నెటిజన్లు కోరుతున్నారు.

# టీడీపీలో కోవర్టులు ఎవరు...

విజయవాడ, మే 29,

టీడీపీ. అది కరుడుగట్టిన పసుపు కార్యకర్తల సమూహం. ఎన్టీఆర్ నుంచి ఇప్పుడు చంద్రబాబు, లోకేశ్ వరకు అందరి అభిమానులు, పార్టీ కార్యకర్తలు ఉంటారు. అదంతా కరుడు గట్టిన బ్యాచ్. పవర్‌లో ఉన్నా లేకున్నా పార్టీ కోసమే పని చేసే వాళ్లుంటారు. అలాంటప్పుడు టీడీపీలో కోవర్టులు ఎవరు అన్నది హాట్ టాపిక్ అవుతోంది. టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు చేసిన కామెంట్స్ పొలిటికల్ సెన్సేషన్ అవుతున్నాయి. టీడీపీలో వైసీపీ కోవర్టులు ఉన్నారన్న బాబు..తమతో ఉంటూ వాళ్ల శత్రువులను ఎలిమినేట్ చేస్తున్నారని ఫైరవుతున్నారు చంద్రబాబు. కోవర్టులను టీడీపీలోకి పంపి ఆ కోవర్టుల ద్వారా మీ ఎజెండా అమలు చేయాలనుకుంటే అది సాధ్యం కాదంటూ స్ట్రేయిట్ ఫార్మార్డ్‌గా వార్నింగ్ ఇచ్చారు.మహానాడు వేదికగా సీఎం చంద్రబాబు చేసిన సంచలన వ్యాఖ్యలపై అటు టీడీపీలో, ఇటు వైసీపీలో చర్చనీయాంశం అయ్యాయి. ఎవరైనా పదవి కోసం వస్తారు. ఆస్తులు కాపాడుకోవడం వస్తారు. అధికార పార్టీలో ఉండాలన్న ఆశతో జంపింగ్ చేస్తారు. కానీ పగ కోసం పార్టీ మారడం కొత్త ట్రెండా అన్న డిస్కస్ జరుగుతోంది. చంద్రబాబు చెప్పింది కాస్త పొలిటికల్ క్రైమ్ థ్రిల్లర్ మూవీలాగే అనిపించినా.. ఏపీలో ఇప్పుడేది సీన్ నడుస్తోందట. అందుకే కోవర్టుల విషయంలో సీఎం చంద్రబాబు చాలా సీరియస్‌గానే రియాక్ట్ అయ్యారని చర్చించుకుంటున్నారు తెలుగు తమ్ముళ్లు. రాష్ట్రంలో ఈ మధ్యకాలంలో జరిగిన కొన్ని ఘటనలే చంద్రబాబు వ్యాఖ్యలకు కారణమట.ఒంగోలు, మాచర్లలలో జరిగిన హత్యలు కోవర్టుల ప్రమేయంతో జరిగాయని భావిస్తోందట టీడీపీ హైకమాండ్. వైసీపీ కుట్ర రాజకీయాల్లో భాగంగా కోవర్టులను టీడీపీలోకి పంపిస్తుందని అనుమానమంటున్నారు. కొందరు వైసీపీ నేతలు ఆయా నియోజకవర్గాల్లో తమ ప్రత్యర్థులను టార్గెట్ చేసేందుకు.. ప్రభుత్వం మారగానే టీడీపీలోకి జంప్ అయ్యారని ఆలస్యంగా పసిగట్టారట. రాజకీయ రక్షణ కోసం టీడీపీలో చేరినట్లుగా నటిస్తూ పాతకక్షలు తీర్చుకోవడానికి..అధికార పార్టీగా ఉన్న టీడీపీని అస్త్రంగా వాడుకుంటున్నారనే సమాచారం చంద్రబాబుకు చేరిందంటున్నారు. పైగా టీడీపీ వర్గపోరుతో చంపుకుంటున్నారని వైసీపీ ప్రచారం చేస్తుండటం చంద్రబాబుకు ఆగ్రహం తెప్పించిందట.ఇంటర్నల్ రిపోర్ట్ ఆధారంగానే మహానాడు వేదికగా చంద్రబాబు అలా స్టేట్‌మెంట్ ఇచ్చారని..క్యాడర్‌ను కూడా అలర్ట్ చేశారని అంటున్నారు తెలుగు తమ్ముళ్లు. పల్నాడు జంట హత్యల ఘటన వెనుక వైసీపీ నేత పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ప్రమేయం ఉందనేది టీడీపీ హైకమాండ్ అనుమానమట. పిన్నెల్లి మద్దతుతోనే గుండ్లపాడు హత్యలు జరిగాయని..అధికారం పోవడంతోనే పిన్నెల్లికి సన్నిహితంగా ఉన్న కొందరు వైసీపీని వీడుతున్నట్లు ప్రకటించి..టీడీపీలో చేరి తమ నేతలను హతమార్చారని మండిపడుతున్నారు తెలుగు తమ్ముళ్లుఅయితే పొద్దుతిరుగుడు పువ్వులతో జాగ్రత్తగా ఉండాలంటూ వైసీపీని వీడి కూటమి పార్టీల్లోకి వస్తున్న నేతల గురించి ఈ మధ్య మంత్రి పయ్యావుల కేశవ్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు పార్టీలో చర్చనీయాంశంగా మారాయి. రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో వైసీపీ నేతలకు పోలీసు అధికారులు సహకరిస్తున్నట్టు టీడీపీలో చర్చ జరుగుతోంది. పల్నాడు జిల్లా ఎస్పీ వ్యవహారశైలిపైనా టీడీపీ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొందరు పోలీసు అధికారులు కోవర్టులకు సహకరిస్తున్నట్టు అనుమానిస్తున్నారు. ఫ్యాక్షన్ ప్రభావం ఉన్న నియోజకవర్గాల్లో కోవర్టు రాజకీయాలు ఎక్కువగా జరుగుతున్నట్టు టీడీపీ నేతలు చెబుతున్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పలు హత్య జరిగాయి. ఆ హత్యలు చేసుకుంది టీడీపీలోని రెండు వర్గాలేనని పోలీస్ అధికారులు ప్రెస్‌మీట్లు పెట్టి మరీ స్టేట్‌మెంట్లు ఇచ్చుకున్నారు. దీన్ని అస్త్రంగా మార్చుకుని..కూటమి ప్రభుత్వంలో లా ఆర్డర్ దెబ్బతిందని..టీడీపీ హత్యలను ప్రోత్సహిస్తుందని వాయిస్ రైజ్ చేస్తూ వచ్చింది వైసీపీ.అయితే హత్యల విషయంలో డిటేయిల్డ్ రిపోర్ట్ తెప్పిస్తే..హత్యకు పాల్పడ్డ వారంతా టీడీపీలో కొత్తగా చేరిన వారేనని గుర్తించారట. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిరాగానే.. టీడీపీ కండువా కప్పుకుని సేఫ్‌గా షెల్టర్ పొందడమే కాకుండా..టీడీపీలో ఉన్న తమ నేతలను వైసీపీ వలస నేతలు చంపారని ఆలస్యంగా గ్రహించారట. అందుకే చంద్రబాబు ఓపెన్ స్టేట్‌మెంట్ ఇచ్చారని..కోవర్టుల విషయంలో పార్టీలో ఇంటర్నల్‌గా పకడ్బందీ చర్యలు తీసుకునేందుకు మాస్టర్ ప్లాన్ రెడీ చేసిందట టీడీపీ హైకమాండ్.

==================

# లోకేష్ టీమ్ లో అంతా యువతరమే

కడప, మే 29,

నారా లోకేష్ కు పార్టీ పగ్గాలు అప్పగించాల్సిన సమయం ఇది అని సన్నిహితులు చెబుతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో నారా లోకేష్ కు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా పదవి ఇస్తారని ప్రచారం జరుగుతోంది. అయితే లోకేష్ టీం లో ఎవరు అనేది ఇప్పుడు ప్రశ్న. చంద్రబాబు మాదిరిగానే నమ్మకస్తులైన బృందాన్ని లోకేష్ ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉంది. తెలుగుదేశం పార్టీలో లోకేష్ కు ప్రమోషన్ ఖాయమా? వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి ఇస్తారా? టిడిపిలో సీనియర్లంతా ఇప్పుడు ముక్తకంఠంతో కోరుకుంటున్నది అదే. మహానాడు వేదికగా ప్రసంగిస్తున్న నేతలంతా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇదే మంచి సమయం అని చంద్రబాబుకు సూచిస్తున్నారు. తెలుగుదేశం పార్టీకి నాయకత్వ పరంగా ఎటువంటి లోటు లేదు. అపర చాణిక్యుడిగా పేరొందిన చంద్రబాబు ఉన్నారు. కానీ చంద్రబాబు వయసు 75 సంవత్సరాలు దృష్ట్యా.. నారా లోకేష్ కు పార్టీ పగ్గాలు అప్పగించాల్సిన సమయం ఇది అని సన్నిహితులు చెబుతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో నారా లోకేష్ కు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా పదవి ఇస్తారని ప్రచారం జరుగుతోంది. అయితే లోకేష్ టీం లో ఎవరు అనేది ఇప్పుడు ప్రశ్న. చంద్రబాబు మాదిరిగానే నమ్మకస్తులైన బృందాన్ని లోకేష్ ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉంది.వాస్తవానికి టిడిపి ఆవిర్భావ సమయంలో పార్టీలో చంద్రబాబు లేరు. 1983 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన చంద్రబాబు టిడిపి అభ్యర్థి చేతిలో ఓడిపోయారు. అక్కడకు కొద్ది రోజులకే తెలుగుదేశం పార్టీలో చేరారు. 1985 మధ్యంతర ఎన్నికల్లో టిడిపి తరపున చంద్రబాబు పోటీ చేయలేదు. కానీ పార్టీలో చేరిన నాటి నుంచి తనదైన ముద్ర వేసుకున్నారు. పార్టీ వ్యవహారాలను చూసుకున్నారు. అదే చంద్రబాబు రాజకీయానికి ప్లస్ గా మారింది. చంద్రబాబు టీం లోకి పూసపాటి అశోక్ గజపతిరాజు, అయ్యన్నపాత్రుడు, కళా వెంకట్రావు, కింజరాపు ఎర్రం నాయుడు, యనమల రామకృష్ణుడు, కేఈ కృష్ణమూర్తి, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, నిమ్మకాయల చినరాజప్ప.. ఇలాంటి నేతలంతా చంద్రబాబు సన్నిహితులుగా ముద్రపడ్డారు. చంద్రబాబుతో పార్టీ వీరు రాజకీయంగా ఎదిగారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన ప్రతిసారి వీరికి ప్రాధాన్యత దక్కుతూనే ఉంది. మీరు కూడా చంద్రబాబు నాయకత్వాన్ని మరింత పెంచుకునేలా చేశారు.అయితే ఇప్పుడు లోకేష్ అటువంటి టీం ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉంది. మరో నాలుగు దశాబ్దాల పాటు టిడిపి ఉనికి చాటుకునేలా ప్రణాళికలు వేస్తున్నారు. అందులో భాగంగానే నారా లోకేష్ కు నాయకత్వ బాధ్యతలు అప్పగించాలన్న డిమాండ్ తెరపైకి వచ్చింది. అయితే చంద్రబాబుకు మాదిరిగా లోకేష్ కు సైతం వలయంగా ఉండే నాయకత్వం ఇప్పుడు అవసరం. ఇప్పటికే లోకేష్ టీం పటిష్ట దిశగా ఉంది. మొన్నటి ఎన్నికల్లో ఆ టీం పనిచేసింది. ఆ టీం కు చెందిన కొంతమంది ఎన్నికల్లో పోటీ చేసి చట్టసభలకు ఎన్నికయ్యారు కూడా. అయితే చంద్రబాబు సన్నిహిత నేతల వారసులు కూడా.. లోకేష్ టీంలో ఉండడం విశేషం.వాస్తవానికి శ్రీకాకుళం నుంచి చిత్తూరు జిల్లా వరకు తెలుగుదేశం పార్టీకి పటిష్ట నాయకత్వం ఉంది. అయితే రాష్ట్రస్థాయిలో పార్టీని నడపడం, సంక్షోభాలను ఎదుర్కోవడం, చిక్కుముడులను తప్పించడం, కార్యకర్తలకు మార్గదర్శక నిలవడం, అధినేతకు నమ్మకస్తులుగా ఉండేవారే ఈ టీంలో తప్పకుండా ఉంటారు. అయితే అలాంటివారు ఎవరు అన్నది ఇప్పుడు ప్రధానంగా చర్చ జరుగుతోంది. శ్రీకాకుళం నుంచి కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, గౌతు శిరీష, విజయనగరం నుంచి సుజయకృష్ణ రంగారావు, అదితి గజపతిరాజు? విశాఖ జిల్లా నుంచి గంటా శ్రీనివాస్,



చింతకాయల విజయ్, వంగలపూడి అనిత? గోదావరి జిల్లా నుంచి జ్యోతుల నవీన్, సానా సతీష్, పుట్ట మహేష్ కుమార్ యాదవ్.. కృష్ణాజిల్లా నుంచి దేవినేని ఉమామహేశ్వరరావు, బుద్ద వెంకన్న పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. గుంటూరు జిల్లా నుంచి కోడెల శివరాం, కోవెలమూడి రవీంద్ర, పెమ్మసాని చంద్రశేఖర్, లావు శ్రీకృష్ణదేవరాయలు.. ప్రకాశం జిల్లా నుంచి దామచర్ల సత్య.. నెల్లూరు జిల్లా నుంచి కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి.. రాయలసీమ జిల్లాల నుంచి బైరెడ్డి శబరి, రెడ్డప్ప గారి మాధవి రెడ్డి, పరిటాల శ్రీరామ్, జెసి పవన్ రెడ్డి, అస్మిత్ రెడ్డి వంటి వారు లోకేష్ టీం అని ప్రచారం జరుగుతోంది. మరి అందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి.

# బెజవాడ నుంచి లూప్ లైన్ లోకి ట్రైన్లు

విజయవాడ, మే 29,

భారతదేశంలోని అతిపెద్ద రైల్వే జంక్షన్ లలో ఒకటి. హౌరా- చెన్నై, న్యూ ఢిల్లీ -చెన్నై, విజయవాడ -నిడదవోలు (లూప్ ) వంటి కీలక మైన రైల్వే లైను ఈ స్టేషన్ గుండా వెళ్తాయి. 10 ప్లాట్ ఫామ్ లు,24 ట్రాకులు తో రద్దీగా ఉండే ఈ రైల్వే స్టేషన్ నుండి ప్రారంభమయ్యే రైళ్లన్నీ ఇతర స్టేషనులకు తరలి వెళ్ళిపోతున్నాయి. ప్రస్తుతం కేవలం 6 ఎక్స్ప్రెస్ రైళ్లు మాత్రమే విజయవాడ నుంచి (అంటే ఆరిజన్ స్టేషన్ విజయవాడ గా) నడుస్తున్నాయి. ప్రస్తుతం విజయవాడ స్టేషన్ నుంచి బయలుదేరే ఎక్స్ప్రెస్ రైళ్లు 6 మాత్రమే ఉన్నాయి. అవి 3 సిస్టర్స్ గా పిలుచుకునే

1) ట్రైన్ నెంబర్ 12713- విజయవాడ- కాచిగూడ- శాతవాహన ఎక్స్ ప్రెస్

2) ట్రైన్ నెంబర్ 12711- విజయవాడ- చెన్నై - పినాకిని ఎక్స్ ప్రెస్

3) ట్రైన్ నెంబర్ 12718- విజయవాడ- విశాఖపట్నం- రత్నాచల్ ఎక్స్ ప్రెస్

ఈ మూడు సూపర్ ఫాస్ట్ రైళ్లను త్రీ సిస్టర్స్ గా పిలుస్తారు. ఈ మూడూ ఉదయం 6 గంటల ప్రాంతంలో విజయవాడ స్టేషన్ నుండి బయలుదేరి మళ్లీ సాయంత్రానికి విజయవాడ చేరుకుంటాయి.అవి ట్రైన్ నెంబర్ 12707/12708 చెన్నై- విజయవాడ- చెన్నై జన శతాబ్ది ఎక్స్ప్రెస్. ఇది మంగళవారం మినహా మిగిలిన 6 రోజులూ ప్రయాణిస్తుంది. విజయవాడలో మధ్యాహ్నం 3:30 గంటలకు ఈ ట్రైన్ బయలుదేరుతుంది.2) 12743/12744- గూడూరు- విజయవాడ- గూడూరు- విక్రమసింహపురి అమరావతి ఎక్స్ ప్రెస్. ఈ ట్రైన్ ప్రతిరోజు విజయవాడలో 6 గంటలకు బయలుదేరుతుంది. 3) 12796/12795 లింగంపల్లి- విజయవాడ- లింగంపల్లి ఎంప్లాయిస్ స్పెషల్. ఈరైలు ప్రతిరోజు సాయంత్రం 5:30 కి విజయవాడలో బయలుదేరి లింగంపల్లి వెళుతుంది.

ఓవరాల్ గా విజయవాడకు ప్రస్తుతం మిగిలిన ఆరు ఇంటర్సిటీ రైళ్లు ఇవి మాత్రమే. ఇంతకుముందు విజయవాడ నుంచి బయలుదేరి వెళ్లే ధర్మవరం రైళ్లను ఇప్పుడు మచిలీపట్నం నుంచి ఒకటి, నరసాపురం మరొకటి గా మార్చేశారు. అలాగే విజయవాడ హౌరా మధ్య తిరిగే హమ్ సఫర్ ఎక్స్ ప్రెస్ ను తిరుపతి కి తీసుకుపోయారు. ఉత్తరాంధ్ర ప్రజలకు అందుబాటులో ఉండే ముఖ్యమైన విజయవాడ రాయగడ ప్యాసింజర్ ను ఎక్స్ప్రెస్ గా ప్రమోట్ చేసి దానిని గుంటూరు రాయగడగా మార్చేశారు. ప్రస్తుతం విజయవాడ నుంచి చెన్నై వెళుతున్న వందేభారత్ ను కూడా నరసాపురం నుంచి నడిపేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి అన్న ప్రచారం బలంగా వినిపిస్తోంది. అదే కనుక జరిగితే అతి ముఖ్యమైన విజయవాడ రైల్వే స్టేషన్ ఆరిజన్ స్టేషన్గా ఉండే ఆరు ఇంటర్సిటీ ఎక్స్ప్రెస్ లు కొన్ని ప్యాసింజర్ రైళ్లు మాత్రవే మిగులుతాయి.విజయవాడ స్టేషన్ కి అతి ముఖ్యమైన సమస్య స్థలం లేకపోవడం. ఎప్పుడో 1888లో కట్టిన ఈ రైల్వే స్టేషన్ కు గతంలో ఏడు ప్లాట్ ఫామ్ లు ఉండేవి. ప్రస్తుతం వన్ టౌన్ సైడు మరో మూడు ప్లాట్ ఫామ్ లు పెంచి మొత్తానికి 10 చేశారు. ప్రస్తుతం ఈ స్టేషన్ ఔఉ 1 క్యాటగిరి లో ఉంది. అంటే కనీసం లక్ష మంది ప్రయాణికులు రోజు ఈ స్టేషన్ నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. 190 ట్రైన్స్,170 గూడ్స్ రైళ్లు విజయవాడ స్టేషన్ మీదుగా ప్రతిరోజు ప్రయాణిస్తుంటాయి. దానితో స్టేషన్ నుండి కొత్తగా బయలుదేరే రైళ్లను వేయలేకపోతోంది రైల్వే శాఖ. హాలో కొత్తగా వేసే రైళ్లకి ఇక్కడ ప్లేస్ ఉండటం లేదు. ఏదన్నా కొత్త రైలు విజయవాడ నుంచి బయలుదేరేలా దానిని ప్లాట్ ఫామ్ పై ఎక్కువసేపు నిలిపి ఉంచాలి. దానివల్ల వేరే రైళ్లకు అడ్డంకిగా మారుతుంది. అందుకే ప్రస్తుతం కొత్త రైళ్లను విజయవాడ నుంచి బయలుదేరేలా వేయడం లేదు. పోనీ ప్లాట్ఫామ్ లు పెంచుదామా అంటే విజయవాడ రైల్వే స్టేషన్ సరిగ్గా నగరం నడిబొడ్డున ఉంది. అక్కడ కొత్తగా ప్లాట్ ఫామ్ లు కట్టే అవకాశం లేదు. ప్రస్తుతం ఈ సమస్యకు విజయవాడకి చుట్టుపక్కల శాటిలైట్ స్టేషన్లు కట్టడం ఒక్కటే మార్గంగా కనిపిస్తోంది రైల్వే శాఖకు. అందుకే విజయవాడ నిడదవోలు మార్గంలో రామవరప్పాడు, విజయవాడ హౌరా మార్గంలో గుణదల, విజయవాడ న్యూఢిల్లీ మార్గంలో రాయనపాడు స్టేషన్లను సాటిలైట్ స్టేషన్లుగా ఆధునికంగా మార్చుతున్నారు. మరొక మూడు నాలుగు నెలల్లో ఇవి రెడీ అయిపోతే చాలా ట్రైన్లను విజయవాడ మెయిన్ స్టేషన్కు రాకుండా డైవర్ట్ చేయొచ్చు. అప్పుడు విజయవాడ నుంచి బయలుదేరి వెళ్లేలా సరికొత్త రైళ్లను కేటాయించే అవకాశం కేంద్రానికి ఉంటుంది. అందుకే రైల్వే డిపార్ట్మెంట్ ఈ సాటిలైట్ స్టేషన్ల నిర్మాణాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుంది.

## పోలీసుల ఎదుట సజ్జల భార్గవ్ రెడ్డి హాజరు

మంగళగిరి

మంగళగిరి రూరల్ పోలీసుల ఎదుట విచారణకు సజ్జల భార్గవ్ రెడ్డి హాజరయ్యారు. సజ్జల భార్గవ్ రెడ్డి విచారణ నేపథ్యంలో మంగళగిరి పట్టణ, రూరల్ పోలీస్ స్టేషన్ల వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసారు. మంగళగిరి పట్టణ, రూరల్ పోలీస్ స్టేషన్లకు వెళ్లే మెయిన్ గేటును మూసివేసారు. సజ్జల భార్గవ్ రెడ్డికి మంగళగిరి పోలీసులు నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే.

## ఏనుగుల దాడిలో ఇద్దరికి గాయాలు

తిరుపతితిరుపతి జిల్లా లో ఏనుగుల మరోసారి బీభత్సం సృష్టించాయి. ఎలిఫెంట్ టాస్క్ ఫోర్స్ సిబ్బందిపై ఏనుగులు దాడి చేసాయి. ఏనుగుల దాడిలో ఇద్దరు సిబ్బందికి మునస్వామి, లక్ష్మీ ప్రసాద్ కు గాయాలు అయ్యాయి. దాంతో సిబ్బంది అధికారులకు సమాచారం ఇచ్చారు. తిరుపతి సమీపంలోని, చంద్రగిరి యర్రావారిపాలెం మండలంలో ఘటన జరిగింది. యలమంద పంచాయతీ బోయపల్లి అటవీ ప్రాంత సమీపంలో ఏనుగులు దాడులు చేస్తున్నాయి.

# కవిత పార్టీ లెక్కంటో..

నిజామాబాద్, మే 29,

ఇప్పటి సోషల్ మీడియా కాలంలో నిజాలు ఎవరికీ అక్కరలేదు. ప్రచారంలో ఉంటే సరిపోతుంది. అది నిజమా? అబద్ధమా? అనేది తర్వాత సంగతి.. కాకపోతే కాస్తలో పొగ వస్తే చాలు మంట పెట్టడానికి చాలామంది ఉంటారు. పార్లమెంట్ ఎన్నికల్లో కల్వకుంట్ల కవిత ఓడిపోయారు అనేది వాస్తవం. ఆ తర్వాత కుమార్తెకు గులాబీ సుప్రీం ఎమ్మెల్సీ స్థానాన్ని కట్టబెట్టారు అనేది కూడా నిజమే. కానీ ఎప్పుడైతే పార్టీలో ఆమె ప్రభావం తగ్గిందో అప్పటినుంచి ఏదో జరిగిపోతోంది అన్నట్టుగా వార్తలు రావడం మొదలైంది. కాకపోతే ఎప్పటికప్పుడు వీటికి గులాబీ బాస్ చెక్ పెట్టుకుంటూ వస్తున్నారు. హరీష్ రావు పార్టీకి దూరంగా ఉన్నారని.. పార్టీ నుంచి వెళ్ళిపోతున్నారని.. కొద్దిరోజులు ప్రచారం జరిగింది. ఆ తర్వాత గులాబీ సుప్రీం దగ్గర నుంచి పిలుపు రావడంతో ఒకసారి గా ఆ పుకార్లకు ఫుల్ స్టాప్ పడింది. మళ్లీ కొద్ది రోజుల తర్వాత కల్వకుంట్ల తారక రామారావు కాబోయే ముఖ్యమంత్రి అని.. మరికొద్ది రోజుల్లోనే పట్టాభిషేకమని వార్తలు వచ్చాయి. ఆ తర్వాత అది కూడా ఆ వాస్తవమని తేలిపోయింది. ఇక ఇప్పుడు కల్వకుంట్ల కవిత కొత్త రాజకీయ పార్టీకి సంబంధించి



రోజుకో తీరుగా వార్తలు వస్తున్నాయి.గులాబీ సుప్రీంకు కల్వకుంట్ల కవిత లేఖలు రాశారు అనేది వాస్తవం. అందులో కొన్ని విషయాలను ప్రస్తావించారనేది కూడా నిజం. కాకపోతే ఈ లేఖల వ్యవహారం గతంలో ఎప్పుడు బయటికి రాలేదు. అంతర్గత వ్యవహారం బయటికి రావడం.. కల్వకుంట్ల కవిత తన తండ్రిని దేవుడిగా.. చుట్టూ ఉన్నవారిని దయ్యాలుగా అభివర్ణించడం కాస్త చర్చకి దారి తీసింది. మరుసటి రోజు ఆమె సోదరుడు.. కారు పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడి హోదాలో విలేకరుల సమావేశం నిర్వహించడం.. పార్టీలోని అంతగత విషయాలు బయటకు చెప్పడం కరెక్ట్ కాదని హెచ్చరించడం వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఇక ఈ పరిణామాలకు తగ్గట్టుగానే రకరకాల వార్తలను కొన్ని పత్రికలు రాయటం.. సోషల్ మీడియాలో కొన్ని యూట్యూబ్ ఛానల్స్ రకరకాల ప్రచారం చేయడంతో తెలంగాణ రాజకీయాలలో రకరకాల చర్చలు జరుగుతున్నాయి. కవిత సొంత పార్టీ ఏర్పాటు సంబంధించిన విషయం కొద్దిరోజులుగా తెలంగాణ రాజకీయాలలో సంచలనం సృష్టిస్తోంది. దీంతో అసలు విషయాలు పక్కదారి పడుతున్నాయి. కవిత ఇంటికి పార్టీ ఎంపీ ఒకరు వెళ్ళటం.. తన తండ్రి దూతగా అతడు కల్వకుంట్ల కవితతో చర్చలు జరపడం.. వంటి పరిణామల తర్వాత కవిత కొత్త పార్టీ ఏర్పాటు చేయబోరని.. తండ్రి చాటున రాజకీయాలు చేస్తారని ఓ వర్గం మీడియా రాసింది.. ఇవి ఇలా ఉండగానే ఆమె కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని మరో బాంబులాంటి వార్త తెలుగు మీడియాలో సంచలనం సృష్టించింది. అయితే దీనిని కవిత ఖండించారు. అయితే ఇలాంటి వార్తలు లీకులు ఇస్తే తప్ప రాసే అవకాశం లేదని.. ఇలానే లీకులు ఇచ్చుకుంటూ పోతే రాజకీయ మనగడే ప్రమాదంలో పడుతుందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.. కల్వకుంట్ల కవితకు రాజకీయ పార్టీ పెట్టుకునే అధికారం ఉందని.. కాకపోతే ఇలా లీకులు ఇచ్చుకుంటూ వెళ్తే ప్రమాదం ఏర్పడుతుందని.. అది అంతిమంగా గులాబీ సుప్రీం కుమార్తెకు నష్టం చేకూర్చుతుందని కొంతమంది వాదిస్తున్నారు.

# ఇసుక లారీలను నియంత్రించడంలో అధికారులు విఫలం -సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బూడిద గణేష్

మంథని

ఇసుక లారీలను నియంత్రించడంలో అధికారులు విఫలం చెందారని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బూడిద గణేష్ అన్నారు.

మంథని మండలం గద్దలపల్లి గ్రామంలో బుధవారం రాత్రి ఇసుక లారీ ప్రమాదానికి గురి కాగా గురువారం సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు ప్రమాద సంఘటన స్థలం వద్ద గ్రామస్తులతో కలిసి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బూడిద గణేష్ మాట్లాడుతూ అడవి సోమనపల్లి క్వారీకి వెళ్లే ఇసుక లారీ దారితప్పి ఖమ్మం పల్లి ఇసుక క్వారీకి వెళ్లడం జరిగిందని అక్కడ ఇసుక లోడ్ చేయకపోవడంతో తిరుగు ప్రయాణంలో డ్రైవర్ మద్యం మత్తులో ఉండి అధిక స్పీడుతో వెళ్లడం వల్ల ఈ ప్రమాదం జరిగిందని అన్నారు. ప్రమాదం రాత్రి ఎనిమిది గంటల ప్రాంతంలో జరిగిందని ఆ సమయంలో జన సంచారం లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని లేకపోతే పెద్ద మొత్తంలో ప్రాణ నష్టం జరిగేదని అన్నారు. రాత్రి సమయంలో ఇసుక లారీలు నడపరాదని నిబంధనలు ఉన్నప్పటికీ మంథని నియోజకవర్గంలో రాత్రి సమయంలో విచ్చలవిడిగా ఇసుక రవాణా జరుగుతుందని అన్నారు. డ్రైవర్లు మద్యం సేవించి అధిక లోడుతో అధిక వేగంతో నడపడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని ఇసుక లారీలను నియంత్రించడంలో సంబంధిత అధికారులు విఫలం చెందారని మంథని నియోజకవర్గం లో విచ్చలవిడిగా ఇసుక మాఫియా కొనసాగుతుందని అన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆర్ల సందీప్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గొర్రెంకల సురేష్ తో పాటు గ్రామస్తులు అడ్డూరి రాజయ్య, అడ్డూరి సంపత్, ముత్యాల దుర్గయ్య, రాజేష్ తోపాటు తదితరులు పాల్గొన్నారు.

# తూర్పు నుంచే ప్రారంభమైన సినిమా వివాదం

కాకినాడ, మే 29,

జూన్ 1వ తేదీ నుంచి సినిమా థియేటర్ల బంద్‌కు ఎగ్జిబిటర్స్ అండ్ డిస్ట్రిబ్యూటర్స్‌లోని ఓ వర్గం పిలుపునిచ్చింది. దీనిని తెలుగు ఫిల్మ్ చాంబర్ ఖండించింది. థియేటర్ల బంద్‌కు ఎలాంటి అవకాశం లేదని ప్రకటించడం జరిగింది. ఈ క్రమంలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు ఈ విషయం చేరింది. జూన్ 12వ తేదీన 'హర హర వీర మల్లు' సినిమా రిలీజ్‌కు ముందు ఇలాంటి ప్రకటనలు రావడం, దానిపై ఏపీ సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేశ్ పోలీసు విచారణకు ఆదేశించడంతో ఇది సంచలనంగా మారింది. ఆ నలుగురు ఇండస్ట్రీ వ్యక్తుల వల్లే ఇదంతా అన్న చర్చ తీవ్రంగా సాగింది. దీనిపై దిల్ రాజు, అల్లు అరవింద్ వంటి సినిమా ప్రముఖులు మాట్లాడారు. అయితే, దీనిపై దిల్ రాజు మాట్లాడుతూ ఈ బంద్‌తో తమకు సంబంధం లేదని, తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఓ జనసేన పార్టీ నేతే కారణమని ప్రెస్‌మీట్‌లో ప్రకటించడం మరింత సంచలనంగా మారింది.జనసేన పార్టీ నుంచి సస్పెన్షన్‌కు గురైన అత్తి సత్యనారాయణ ఎగ్జిబిటర్ కమ్ డిస్ట్రిబ్యూటర్. 'అను శ్రీ ఫిల్మ్స్' పేరుతో సినిమా డిస్ట్రిబ్యూటర్‌గా అత్తి సత్యనారాయణకు పేరుంది. అంతేకాకుండా, తెలుగు సినీ చాంబర్ ఆఫ్ కామర్స్‌లో కార్యవర్గ సభ్యుడిగా ఉన్నారు. తూర్పు గోదావరి జిల్లా డిస్ట్రిబ్యూటర్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కూడాను. రాజమండ్రిలో జేకే క్లాసిక్‌లో జరిగిన సమావేశంలో ఆయన సినిమా బంద్ పిలుపునకు భాగస్వామి అయ్యారన్న వార్తలు బయటకు వచ్చాయి.సినిమా థియేటర్ల బంద్ పిలుపు అనేది ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్ల మధ్య జరిగిన చర్చలు విఫలం కావడం వల్ల వచ్చింది. ఈ పిలుపు వెనుక అత్తి సత్యనారాయణ ఉండటం వల్ల తూర్పుగోదావరి జిల్లా పేరును దిల్ రాజు ప్రస్తావించారు. అయితే, ఉభయ గోదావరి జిల్లా విషయానికి వస్తే, ఇక్కడ పెద్ద సంఖ్యలో సింగిల్ స్క్రీన్ థియేటర్లు ఉన్నాయి. ఏపీలో దాదాపు వెయ్యి సింగిల్ స్క్రీన్ థియేటర్లు, మల్టీప్లెక్స్‌లు ఉంటే, అందులో ఉభయ గోదావరి జిల్లాల్లో 50 నుంచి 60 వరకు థియేటర్లు ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. ఈ సింగిల్ స్క్రీన్ థియేటర్లు ఆర్థికంగా చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. టికెట్ల ధరల నియంత్రణ, థియేటర్ల అద్దె విధానం కాకుండా రెవెన్యూ షేరింగ్ విధానం అమలు చేయాలని, కొత్త సినిమాలను ఓటీటీలలో కొంత ఆలస్యంగా విడుదల చేయాలని లేకపోతే థియేటర్ల మనుగడ ప్రశ్నార్థకమని ఇక్కడి ఎగ్జిబిటర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో తూర్పుగోదావరి జిల్లా నుంచి ఈ డిమాండ్ మొదలై సినిమా హాళ్ల బంద్ వరకు వెళ్లింది. సినిమా రంగానికి సంబంధించి కూడా ఉభయ గోదావరి జిల్లాల ప్రాముఖ్యత అంతా ఇంతా కాదు. అలా థియేటర్ల బంద్ సమస్య రెండు తెలుగు రాష్ట్రాల్లో చర్చనీయాంశమైంది. చివరకు ఈ పిలుపుకు వెనుక ఉన్నారన్న కారణంతో జనసేన నాయకుడు అత్తి సత్యనారాయణపై వేటు పడింది.

# ఆపరేషన్ వైసీపీ స్టార్ట్...

విజయవాడ, మే 29,

ఆపరేషన్ వైసీపీ.. అంటే.. వైసీపీని కాపాడుకునే ప్రయత్నం. ఆది నుంచి అన్ని విషయాల్లోనూ పార్టీని అన్ని విధాలా కాపాడుకునే ప్రయత్నం ప్రారంభమైందా? అంటే.. వైసీపీ వర్గాల నుంచి ఔననే సమాధానం వస్తోంది. మద్యం కుంభకోణం కేసు తీవ్రతరం కావడం.. ఇటీవల సీఎం చంద్రబాబు కూడా.. కేంద్రం చెవిలో వేయడం.. ముఖ్యంగాకేంద్ర హోం మంత్రి అమిత్ షా వంటివారు.. కూడా చంద్రబాబుకు ఈవిషయంలో గ్రీన్ సిగ్నల్ ఇచ్చారన్న చర్చ సాగుతుండడంతో జగన్ అలెర్టయ్యారన్న సంకేతాలు వస్తున్నాయి.ఒకవేళ ఆయన జైలుకు వెళ్లాల్సి వస్తే.. వెళ్లేందుకు సిద్ధమని ఆయనే స్వయంగా చెప్పారు. "రండి. విజ యవాడలోనే ఉన్నా.. జైలు కొత్తకాదు.. కేసులు కూడా కొత్తకాదు. రాజకీయాలలో ఉన్నప్పుడు వాటికి భయ పడతామా!" అని తేల్చి చెప్పారు. ఈ మాట ఆయన నోటి నుంచే వచ్చిందంటే.. 'విషయం' ఆయన వర కు చేరిందన్నది పరిశీలకులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో గతంలో మాదిరిగా ఆయన జైలుకు వెళ్తే... పార్టీని కాపాడేందుకు ఎవరూ లేరు. అమ్మ, చెల్లి కూడా రివర్స్ అయ్యారు.ఈ క్రమంలోనే ముందుగానే పార్టీ విషయంపై అప్రమత్తంగా ఉన్నట్టు తెలుస్తోంది. అదే.. ఆపరేషన్ వైసీపీ అంటున్నారు. పార్టీ పగ్గాలను ఒక 'కీలక వ్యక్తి'కి అప్పగించడంతోపాటు.. పార్టీ తరఫున ప్రచారం చేసేందుకు.. ప్రజల్లోకి వెళ్లేందుకు కూడా.. ఒక 'టీం'ను కూడా జగన్ రెడీచేసుకున్నట్టు సమాచారం. అంతేకాదు.. ఇప్పటికే ఆయనకు దూరమైన ఐప్యాక్‌ను కూడా చేరువ చేసుకుంటున్నట్టు తెలిసింది. గతంలో కొందరు ఆయనకు దూరమైనా.. ఇప్పుడు చేరువ చేసుకునేందుకు జగన్ ప్రయత్నాలు చేస్తున్నారు. పార్టీని బలోపేతం చేసుకునే 'మంత్రదండం' సంక్షేమ, పథకాల తాలూకు ఎసెన్స్ తగ్గకుండా.. ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లేందుకు కూడా జగన్ రెడీ అయ్యారని సమాచా రం. ప్రస్తుతం ఆపరేషన్ వైసీపీపై గత రెండు రోజులుగా జగన్ అంతర్గతంగా చర్చించుకుంటున్నారని.. దీనిలో ఒకరిద్దరు ఢిల్లీకి చెందిన నాయకులు(ఓ కీలక పార్టీ అని ప్రచారం జరుగుతోంది.) కూడా ఉన్నార ని.. సమాచారం. అయితే.. అరెస్టు కాకుండా చర్యలు తీసుకునే ప్రయత్నం మంచిదని.. కొందరు చెబుతున్నారు. సో.. మొత్తానికి ఆపరేషన్ వైసీపీ అయితే.. స్టార్ట్ అయింది. ఇది ఎలాంటి మలుపు తీసుకుంటుంది. ఏమేరకు వైసీపీకి మేలు చేస్తుంది? అనేది చూడాలి.

# హస్తినతో బంధాలు తెగినట్టేనా

విజయవాడ, మే 29

వైసీపీ అధినేత వైఎస్ జగన్ కు ఢిల్లీలో పట్టు పోయినట్లు పైకి మాత్రం కనిపిస్తుంది. నిన్న మొన్నటి వరకూ అధికారంలో ఉన్నప్పుడు వైఎస్ జగన్ తరచూ ఢిల్లీ వెళ్లేవారు. రాష్ట్రానికి సంబంధించిన పలు అభివృద్ధి పనుల గురించి ప్రధాని నరేంద్ర మోదీతో పాటు కేంద్ర మంత్రులు అమిత్ షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లు కలసి వచ్చేవారు. ఢిల్లీ పెద్దలు కూడా జగన్ ను ఆదరించేవారు. నాడు అధికారంలో ఉన్నప్పుడు అందరితో పరిచయాలు పెంచుకుని కొన్ని ప్రాజెక్టులను కూడా ఏపీకి తేగలిగారు. దీంతో పాటు తనకు నాడు మిథున్ రెడ్డి, విజయసాయిరెడ్డి ఢిల్లీలో ఉండి అన్ని రకాలుగా కొంత సహకారం అందించేవారు. జగన్ ఐదేళ్లలో అనేక సార్లు ఢిల్లీకి వెళ్లి మోదీని కలిసి వచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ కూడా జగన్ ను ఆప్యాయంగా పలకరించేవారు. దగ్గరకు తీసుకునే వారు. అలాంటి జగన్ గత ఎన్నికల్లో ఓటమి పాలయిన తర్వాత ఢిల్లీ గడప తొక్కలేదు. ఢిల్లీతో కనెక్షన్ కట్ అయింది. ఎన్నికలకు ముందే బీజేపీతో చంద్రబాబు, పవన్ కల్యాణ్ పొత్తు పెట్టుకోవడంతో ఢిల్లీకి ఉన్న సంబంధాలు దాదాపు తెగిపోయాయి. జగన్ ను ఢిల్లీలో పట్టించుకునే వారే లేరు. అదే సమయంలో ఢిల్లీలో తన పార్టీ తరుపున లాబీయింగ్ చేసే వారు కూడా లేరు. విజయసాయిరెడ్డి కూడా పార్టీని వీడి వెళ్లిపోవడంతో ఇక ఢిల్లీలో పెద్దలను కలసి మాట్లాడే వారే లేరు. జగన్ నేరుగా వెళ్లి కలిసే పరిస్థితి లేదు. అదే సమయంలో ఢిల్లీ పెద్దలు ఇంకా జగన్ పట్ల కొంత సాఫ్ట్ కార్నర్ తోనే ఉన్నారన్న ప్రచారం జరుగుతుంది. జగన్ మళ్లీ పుంజుకునే అవకాశాలున్నాయన్న సమాచారంతో ఢిల్లీ పెద్దలు పెద్దగా జగన్ ను టార్గెట్ చేయడం లేదన్న అభిప్రాయం అందరిలోనూ వ్యక్తమవుతుంది. జగన్ కు ప్రజల్లో ఉన్న అభిమానం, గత ఎన్నికల్లో నలభై శాతం ఓట్లు రావడంతో జగన్ ను సులువుగా వదులుకునేందుకు సిద్ధంగా లేరు. అందుకే ప్రధాని నరేంద్ర మోదీ నుంచి కేంద్ర మంత్రుల వరకూ చంద్రబాబు నాయుడును, పవన్ కల్యాణ్ ను పొగుడుతున్నారు తప్పించి, జగన్ ను మాత్రం పన్నెత్తుమాట అనడం లేదన్న కామెంట్స్ హస్తినలో వినిపిస్తున్నాయి. జగన్ తమకు బయట నుంచి మద్దతు ఇస్తుండటంతో పరోక్షంగా కొంత మేలు చేసే ఉద్దేశ్యంతోనే ఢిల్లీ పెద్దలున్నారని, హాని మాత్రం తలపెట్టరన్న వ్యాఖ్యలు రాజకీయంగా వినిపిస్తున్నాయి. జగన్ కూడా అదే ధైర్యంతో ఉన్నారని తెలిసింది. .. అయితే ఆంధ్రప్రదేశ్ మద్యం స్కామ్ కేసులో ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ అధికారులు విచారణ చేస్తున్నప్పటికీ అది తూతూ మంత్రమేనంటున్నారు. ఇందులో జగన్ పార్టీని పెద్దగా ఇబ్బందులు పెట్టే అవకాశం లేకపోవచ్చు. కూటమిలోని మిత్ర పక్షాలైన టీడీపీ, జనసేన పార్టీలను సంతృప్తి పర్చడానికే ఈడీ మద్యం కేసులో విచారణను ఈడీ ప్రారంభించిందని, అంతే తప్ప ఈ విషయంలోనూ జగన్ కు పెద్దగా నష్టం జరిగే అవకాశం లేదని అంటున్నారు. ఎందుకంటే జగన్ తో భవిష్యత్ అవసరాల దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం వేగంగా అడుగులు వేసే ఛాన్స్ కూడా లేదన్నది విశ్లేషకుల అంచనా. మొత్తం మీద హస్తిన జగన్ పక్కనే ఉందన్న కామెంట్స్ సోషల్ మీడియాలో ఎక్కువగా వినిపిస్తున్నాయి.

# విత్తనాల పంపిణీ మంచిగా జరగాలి పెద్ద ఎత్తున రాష్ట అవతరణ దినోత్సవం: ఉపముఖ్యమంత్రి భట్టి

ఖమ్మం అధికారులతో సమీక్ష సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడారు. ఈ సమావేశం చాలా ప్రత్యేకత సంతరించుకున్న సమావేశం. అన్ని జిల్లాలకు సంబంధించిన ఇంచార్జి మంత్రులు సమావేశాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. 65 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని, ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఖమ్మం జిల్లా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ముందజలో ఉంది. వారం రోజుల్లో నగదు కూడా వారి అకౌంట్ కి వేశాం, గతంలో 2,3 నెలలు అయిన నగదు వేసేవారు కాదు. దీనికి అధికారులకు అభినందనలు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి, దేశంలో ఎక్కడ లేని విధంగా, 5 లక్షల రూపాయలతో ఇళ్లు శాంక్షన్ చేశాం. నియోజకవర్గానికి 3500 ఇల్లు కేటాయించడం గొప్ప విషయం. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి హౌసింగ్ మంత్రి కసరత్తు చేస్తున్నారు. 4 లక్షల 56 వేల ఇళ్లకు నిర్మాణాలు చేపడుతున్నామని అన్నారు.

ఒకటి రెండు చోట్ల చిన్న పొరబాట్లు జరిగి, ఇంత మంచి కార్యక్రమానికి చెడ్డపేరు తీసుకుని రావద్దు. సీజన్ మొదలైంది కాబట్టి విత్తనాల పంపిణీ మంచిగా జరగాలి, నకిలీ విత్తనాలు అమ్మవారికి జిల్లాలో పుట్టగతులు ఉండవు. నకిలీ విత్తనాలు అమ్మేవారీ పై చాలా తీవ్రమైన పరిణామాలు ఉంటాయి. భూ భారతి అనేది 10 ఏళ్లు చూసాం, ధరణిలో బంధించిన వాటిని బయటకు తీసుకుని వచ్చేది, ప్రజలకు సరళమైన, న్యాయమైన హక్కులన్నింటినీ కాల రాసిన చట్టం ధరణి. ధరణి నీ తొలగిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చాం, దానికి తగ్గట్టుగానే మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కసరత్తు చేశారని అన్నారు.

రాష్ట అవతరణ దినోత్సవం జూన్ రెండు పెద్ద ఎత్తున నిర్వహిస్తాం. జిల్లా కలెక్టర్ లు జాగ్రత్తగా రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు నిర్వహించాలి. వేడుకలలో సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టాలి. రాజీవ్ యువ వికాసానికి సంబంధించి లిస్ట్ మొత్తం ఇంచార్జి మంత్రి కి అప్పగించాలి. అధికారులు ఎక్కడ కూడా ఉదాసీనత వ్యక్త పరచొద్దని అన్నారు.

గతంలో ఉన్న ప్రభుత్వం అన్ని విభాగాలను గాలికి వదిలి వేసింది. బడ్జెట్ పరంగా ఏ ఇబ్బంది లేదు, పూర్తి స్థాయి గా నిధులు విడుదల చేస్తాం. సీజన్ వ్యాధులకు సంబంధించి కలెక్టర్ లు సీరియస్ గా పని చేయాలి. తాగు నీరు కి సంబంధించి లీకేజి లు జరగకుండా అధికారులు పని చేయాలి. ఆసుపత్రులకు సంబంధించి అన్ని ఆసుపత్రులు పిహెచ్సీ నుండి జిల్లా ఆసుపత్రుల వరకు మంచిగా పని చేయాలి. ఉదాసీనత లేకుండా ఉండాలని చెప్పాను, అధికారులు పరుగులు పెట్టాలి, 10 ఏళ్లు వెనుకపడ్డాం. పరుగు పెడితే తప్పించి లక్ష్యాలను అందుకోలేము. జూన్ రెండవ తేదీన ఘనముగా నిర్వహించండని అన్నారు.

# సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్త తీసుకోవాలి. మంథని డి ఎల్ పి ఓ కొమ్మెర సతీష్.

కమాన్ పూర్ ఈ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందాసు జాగ్రత్తలు తీసుకోవాలి అని మందని డివిజనల్ పంచాయతీ అధికారి కొమ్మెర సతీష్ అన్నారు.కమాన్ పూర్ మండలంలోని జూలపల్లి గ్రామంలో గురువారం మంథని డివిజనల్ పంచాయతీ అధికారి కొమ్మర సతీష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామ పంచాయతీ రికార్డులను, పారిశుద్ధ్య పనులను పరిశీలించి, గ్రామ పంచాయతీ అనుమతి లేకుండా ఎటువంటి నిర్మాణ పనులు చేయరాదు అని హెచ్చరించడం జరిగింది. వర్షాకాల దృష్ట్యా సీషనల్ వ్యాదుల ప్రబలకుండా పారిశుద్ధ్య పనులను నిరంతరం సక్రమంగా చేయవలెనని, గ్రామ పంచాయతీ మల్టిపర్పస్ సిబ్బందికి ఆదేశించనైనది. గ్రామంలో నిరంతరం గ్రామ పంచాయతీ ట్రాక్టర్ ద్వారా ఇంటింటా చెత్త సేకరణ జరిపి సెగ్రిగేషన్ షెడ్ లో తడి చెత్తను పొడి చెత్తను వేరు చేసి నాణ్యమైన సేంద్రియ ఎరువు తయారు చేయాలని పంచాయతీ కార్యదర్శికి మల్టిపర్పస్ సిబ్బందికి తగు సూచనలు జారీ చేసినారు. వైకుంఠధామం, నర్సరీని సందర్శించి వాటరింగ్ సక్రమంగా చేయుట, నీటి ఎద్దడి లేకుండా చూడవలసిందిగా ఆదేశించారు. జూలపల్లి పంచాయతీ సమీపంలోని మంచి నీటి వాటర్ ట్యాంకును పరిశీలించి, ట్యాంకును ఎప్పటికప్పుడూ శుభ్రపరచి క్లోరినేషన్ చేయవలసినదిగా ఆదేశించినారు. ఎస్ బి ఎం లో బాగంగా జూలపల్లి గ్రామంలో ప్రతి రోజు 20 మందికి తగ్గకుండా గ్రామ వాసులు ఎస్ బి ఎం – అకడమిక్ ట్రేనింగ్ ద్వారా సర్టిఫికెట్ పోందవలెనని పంచయాతీ కార్యదర్శి కి ఆదేశించనైనది.

# యాక్షన్... డైరక్షన్...

కడప మే 29, (

ఆంధ్రప్రదేశ్ లో తెలుగుదేశం పార్టీలో సమూల మార్పులు జరగనున్నాయి. పార్టీ జాతీయ అధ్యక్షుడిగా చంద్రబాబు నాయుడు తిరిగి ఎన్నికయ్యారు ముప్పయి ఏళ్లుగా చంద్రబాబు నాయుడు పార్టీ అధ్యక్ష బాధ్యతలను నిర్వహిస్తున్నారు. ప్రతి రెండేళ్లకు ఒకసారి ఈ ఎన్నికను నిర్వహిస్తుంటారు. 1995లో మొదటి సారి చంద్రబాబు పార్టీ అధినేతగా ఎన్నికయ్యారు. అప్పటి నుంచి ఆయన ఇప్పటి వరకూ ఏకగ్రీవంగా ఎన్నికవుతూ వస్తున్నారు. జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికయిన చంద్రబాబుకు పార్టీ నేతలు, మంత్రులు ఎమ్మెల్యేలు శుభాకాంక్షలు తెలిపారు.అదే సమయంలో కడపలో జరిగే మహానాడు నుంచి జాతీయ ప్రధాన కార్యదర్శి పదవి నుంచి లోకేశ్ కు ప్రమోషన్ దక్కనుంది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా నియమించారు. ఇక పార్టీలో తీసుకునే నిర్ణయాలన్నీ లోకేశ్ తీసుకునే అవకాశముంది. చంద్రబాబు డైరెక్షన్ లో పార్టీ నడిచినప్పటికీ ఆయన సూచనలు, సలహాలు తీసుకుంటూ పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా అడుగులు వేయనున్నారు లోకేశ్. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా బాధ్యతలను చేపట్టి రాష్ట్ర వ్యాప్త పర్యటనలు చేస్తూ లోకేశ్ వచ్చే ఎన్నికలకు శ్రేణులను సిద్ధం చేస్తారని కూడా తెలిసింది. ఇప్పుడు కాకపోయినా.. మరొకసమయంలోనైనా పార్టీ పగ్గాలు లోకేశ్ కు అప్పగించాల్సిందే. టీడీపీకి తర్వాత వారసుడు లోకేశ్ మాత్రమే. ఆ క్లారిటీ పదేళ్ల ముందే పార్టీలో వినిపించినా కనిపించలేదు. కానీ మొన్నటి ఎన్నికల్లో సూపర్ విక్టరీ తర్వాత లోకేశ్ కు పార్టీ పగ్గాలు అప్పగించాలన్న నినాదం ఊపందుకుంది. సీనియర్ నేతల నుంచి యువనేతల వరకూ ఒకటే స్లోగన్. లోకేశ్ కు పార్టీలో పూర్తి స్థాయి బాధ్యతలను అప్పగించాలంటూ నేరుగా ప్రకటనలుచేయడం వెనక కూడా చంద్రబాబు ఉన్నారు. పార్టీ అధికారంలో ఉన్నప్పుడే లోకేశ్ కు పగ్గాలు అప్పగించడం మంచిదన్న అభిప్రాయానికి చంద్రబాబు కూడా వచ్చారు. అందులో భాగంగానే వర్కింగ్ ప్రెసిడెంట్ గా చేయనున్నారు.. రానున్న నాలుగేళ్లలో లోకేశ్ క్యాడర్ కు, నేతలకు మరింత దగ్గరయ్యే అవకాశాలను చంద్రబాబు కల్పించనున్నారు. అది పార్టీకి, లోకేశ్ కు కూడా మంచిదే. ఆయన వారితో ఎక్కువ సమయం గడిపే అవకాశం ఉండటంతో పాటు ఆయన టీంతో పార్టీని మరొకసారి అధికారంలోకి తీసుకురాగలిగితే అంతకంటే తండ్రికి కావాల్సింది ఏముంటుంది? అని చంద్రబాబు ఆలోచనగా ఉంది. చంద్రబాబు ప్రస్తుతం ముఖ్యమంత్రిగా ఎక్కువ సమయం పార్టీ కోసం కేటాయించలేకపోతున్నారు. అధికారులతో సమీక్షలు, సమావేశాలతో పాటు ఢిల్లీ చుట్టూ తిరగడంతో పాటు అనేక ముఖ్యమైన సమస్యలను అమరావతి, పోలవరం వంటివి పరిష్కరించాల్సిన సమయంలో పార్టీ పూర్తి బాధ్యతలను లోకేశ్ కు అప్పగించడం మేలన్న నిర్ణయానికి వచ్చారు. నారా లోకేశ్ ఇప్పటికే క్యాడర్ కు, నేతలకు అందుబాటులో ఉంటున్నారు. వారి సమస్యలను పరిష్కరిస్తున్నారు. ప్రత్యేకంగా వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి లేకపోయినా పార్టీ కార్యక్రమాలను గత కొంత కాలంగా ఆయనే చూస్తున్నారు. నిర్ణయాలు కూడా లోకేశ్ తీసుకుంటున్నారు. పదవుల ఎంపికలోనూ లోకేశ్ పాత్ర కీలకమనే చెప్పాలి. క్యాడర్ తో మరింత కనెక్ట్ అయ్యేందుకు కేవలం పేరు వెనక ట్యాగ్ మాత్రమే కానీ లోకేశ్ ఆల్రెడీ క్యాడర్ లోనూ, లీడర్లలోనూ పార్టీ అధినేతగా ముద్ర పడిపోయారు. కాకుంటే శంఖంలో పోస్తే కాని తీర్థం కాదు అన్నట్లుగా లోకేశ్ కు వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి ఇచ్చినట్లయితే ఇక భవిష్యత్ లో పార్టీ చినబాబు చేతుల మీదుగానే నడుస్తుంది. దానికి మహానాడులో స్టాంప్ పడబోతుంది.

================

# కవిత పార్టీ... ఎవరికి ప్లస్... ఎవరికి మైనస్

హైదరాబాద్, మే 29,

ఎప్పుడైతే గులాబీ సుప్రీమ్ ను ఉద్దేశించి కల్వకుంట్ల కవిత లేఖలు రాసిందో.. అప్పటినుంచి కారు పార్టీలో కుతకుతలు మొదలవుతున్నాయి. బయటికి పెద్దగా తెలియడం లేదు గాని.. లోపల మాత్రం ఊహించని పరిణామాలు వీటన్నింటినీ గులాబీ శ్రేణులు అత్యంత సులభంగా కొట్టిపారేస్తున్నాయి కానీ.. అంతకుమించి అనేలాగా ఏదో విస్ఫోటనం జరుగుతోంది. మీడియాలో వస్తున్నట్టుగానే.. సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతున్నట్టుగానే కవిత ఒకవేళ సొంతంగా పార్టీ పెడితే పరిస్థితి ఎలా ఉంటుంది? కెసిఆర్ కు అది ఎలాంటి ఇబ్బందికరంగా మారుతుంది? కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి లాభం చేకూర్చుతుంది? అనే ప్రశ్నలు తెలంగాణలో హాట్ హాట్ చర్చకు కారణం అవుతున్నాయి. ఒకవేళ కవిత కనక పార్టీ నుంచి వెళ్ళిపోతే.. ఢిల్లీ మద్యం కుంభకోణం ముద్ర ఆమె రాజకీయ భవిష్యత్తుకు ఇబ్బందికరంగా మారుతుందని కొందరు అంటున్నారు. అంతేకాదు కుటుంబ పార్టీ అనే ట్యాగ్ లైన్ కూడా దూరమవుతుందని.. పార్టీ ప్రయోజనాల కోసం కేసీఆర్ కుమార్తెను కూడా వదులుకున్నాడని.. బూస్ట్ పార్టీకి లభిస్తుందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.ఒకవేళ భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్సీ ఢిల్లీ మద్యం కుంభకోణం తాలూకు విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తే.. దానికి కెసిఆర్ కూడా సిద్ధంగా ఉండాల్సి ఉంటుంది. ఎందుకంటే కవిత పార్టీ నుంచి బయటికి వస్తే కచ్చితంగా కొన్ని నిజాలు బయటికి తెలుస్తాయి. అవి కేసీఆర్ ను ఏదో చేస్తాయని కాదు.. కాకపోతే ఇప్పటికే ఇబ్బందికరమైన పరిస్థితుల్లో ఉన్న పార్టీని మరింత గందరగోళంలోకి నెడతాయి. అప్పుడు కెసిఆర్ కు మరింత ఇబ్బందులు ఎదురవుతాయి. ఇక కేటీఆర్ కు కనుక పార్టీ సర్వ పగ్గాలు అప్పగిస్తే.. అప్పుడు ఆయన నాయకత్వం నచ్చని మరో కీలక వ్యక్తి బయటికి వచ్చి.. కవితతో కలిసి తిరుగుజెండా ఎగరవేస్తే మాత్రం అప్పుడు మరింత డోలాయమానం పార్టీకి ఎదురవుతుంది. ఇవన్నీ కెసిఆర్ చూస్తూ ఉంటారా.. ఊరకనే ఉంటారా.. ఈ ప్రశ్నకు కాలమే సమాధానం చెప్పాలి. మనదేశంలో పీవీ నరసింహారావు వంటి వ్యక్తి కోర్టుకు హాజరయ్యారు. కమిషన్ ముందు నిలబడ్డారు. ఆ లెక్కలోకి వస్తే కేసీఆర్ కమిషన్ ఎదుట హాజరు కావడం పెద్ద విషయం కాదు. కాకపోతే రేవంత్ రెడ్డి కాళేశ్వరం ఇష్యూ ను జనంలోకి ఎలా తీసుకుపోతాడు అనేది చాలా ముఖ్యం. ఇప్పటికే కాళేశ్వరం జలాలు లేకుండా యాసంగిలో రికార్డు స్థాయిలో వరి పంట పండించామని కాంగ్రెస్ చెబుతోంది. మరోవైపు కాళేశ్వరం అలా కుంగిపోవడానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు బాంబులు వేసి ఉండొచ్చని కేటీఆర్ ఆరోపిస్తున్నారు. ఇన్ని పరిణామాల మధ్య భవిష్యత్తు కాలంలో బిజెపితో కనుక కారు పార్టీ సయోధ్య కుదుర్చుకుంటే.. అప్పుడు తెలంగాణలో కాంగ్రెస్ పార్టీతో కెసిఆర్ ముఖాముఖి పోరాడాల్సి ఉంటుంది..ఇన్ని పరిణామాలు జరుగుతుంటే గులాబీ నాయకులు సైలెంట్ గా ఉన్నారు. కొంతమంది సోషల్ మీడియా యాక్టివిస్టులు నిశ్శబ్దాన్ని ఆశ్రయిస్తున్నారు. ఎందుకంటే ఇటీవల కల్వకుంట్ల కవిత రాసిన లేఖల వ్యవహారాన్ని రేవంత్ రెడ్డి ఆడిస్తున్న డ్రామాగా వారు ఆరోపించారు. కానీ స్వయంగా ఆ లేఖలను తానే రాశానని కల్వకుంట్ల కవిత ఒప్పుకోవడంతో వారంతా ఒక్కసారిగా సైలెంట్ అయిపోయారు. దీనికి తోడు అధిష్టానం నుంచి కూడా ఆదేశాలు రావడంతో ఎవరూ ఎటువంటి మాటలు మాట్లాడటం లేదు. అంతటి కేటీఆర్ కూడా ఏదో పరోక్షంగా వ్యాఖ్యానించాడు గాని.. నేరుగా మాట్లాడటానికి.. నేరుగా విమర్శలు చేయడానికి సాహసించలేదు. భారత రాష్ట్ర సమితిలో భవిష్యత్తు కాలంలో జరుగుతున్న మార్పులు ఎలాంటి ప్రభావం చూపిస్తోందో మరి చూడాలి

# వర్షాలతో రైతులు ఆగమాగం...

నిజామాబాద్, మే 29,

వారం రోజులు గా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో రైతన్నలు తీవ్ర నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరి మొక్కజొన్న పంటలు చేతికొచ్చిన తర్వాత రోడ్ సైడ్ కు ఆరబోసేందుకు వంచదా వారం రోజుల నుంచి వర్షం వదలడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.కొన్ని వరి సంచులు నింపి ఉంచిన తర్వాత కాంటాక్ట్ చేయకపోవడం వల్ల కూడా కుప్పలుగా రోడ్‌సైడ్‌కే ఉన్నాయని వాపోతు న్నారు. మరికొన్ని వరి గొప్పులు తడిసిపోయి ముద్దాయ్యయని చెబుతున్నారు. ఒక రోజు కూడా గ్యాప్ లేకుండా కురుస్తున్న వర్షంతో రైతులు తీవ్ర నష్టపోతున్నామని పేర్కొంటున్నారు.తడిసిపోయిన వారి మొక్కజొన్న పంటలు కొనుగోలు కేంద్రాల్లో కొంటారా లేదా అని సమస్య కూడా వెంటాడుతుందని చెబుతున్నారు. ఈ విషయంపై అధికారులు స్పష్టత ఇవ్వడం లేదని పేర్కొంటున్నారు. కొన్నిసార్లు మైయ్చర్ లేదని మరి కొన్నిసార్లు సంచులు దొరకడం లేదంటూ సాకులు చెబుతున్నారని అంటున్నారు.వారం రోజులు కురిసిన వర్షంతో పంటలు మొత్తం పరిస్థితులు ఘోరంగా తయారయ్యాయని వాపోతున్నారు. దీంతో రైతులు ఏమి చేయని దిక్కుతోచని పరిస్థితిలో లబోదిబో అంటూ వరుణుడు కరుణించాలని వారు ఆకాశం వైపు చూస్తున్నారు. తమ కష్టం ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడంలేదని ఆవేదన చెందుతున్నారు.సంబంధిత అగ్రికల్చర్ అధికారులు పంట నష్టం జరిగిన రైతులకు సర్వే చేసి పంట నష్టపరిహారం అందే విధం గా చూడాలని రైతులకు కోరుతున్నారు. ఈ విషయంపై జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత రావు గాని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ గాని స్పందించాలని వేడుకుంటున్నారు.తడిసిన ధాన్యాన్ని వెంటనే ప్రభుత్వం కొనడం లేదు. దీంతోతీవ్రంగా రైతులు నష్టపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి ధాన్యానికి డబ్బులు చెల్లించాలి.

# అన్నదాత సుఖీభవ పై ఫుల్ క్లారిటీ

నెల్లూరు, మే 29,

అన్నదాత సుఖీభవ పై ఫుల్ క్లారిటీ వచ్చింది. రైతులకు ఏటా పెట్టుబడి సాయంగా 20 వేల రూపాయలు అందించే అన్నదాత సుఖీభవ పథకం అమలుపై స్పష్టత ఇచ్చింది ఏపీ ప్రభుత్వం. కడప మహానాడు వేదికగా అన్నదాత సుఖీభవ పథకం ఎప్పుడు అమలు చేస్తామనే విషయాన్ని సీఎం చంద్రబాబు ప్రకటించారు. పిఎం కిసాన్ యోజన తొలి విడత నగదు పడిన సమయంలోనే అన్నదాత సుఖీభవ తొలి విడత సాయం అందిస్తామని చంద్రబాబు క్లారిటీ ఇచ్చారు. అదే సమయంలో మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం ఆగస్టు 15 నుంచి ప్రారంభిస్తామని కూడా వెల్లడించారు. సీఎం ప్రకటనతో రైతుల్లో హర్షం వ్యక్తం అవుతోంది. ఖరీఫ్ ప్రారంభం నాటికి తమకు తొలి విడత అన్నదాత సుఖీభవ నిధులు అందుతాయని వారు నమ్మకం పెట్టుకున్నారువైయస్ జగన్మోహన్ రెడ్డి 2019లో నవరత్నాల పథకంలో భాగంగా రైతు భరోసా పథకానికి హామీ ఇచ్చారు. అధికారంలోకి వస్తే ఏడాదికి 15000 రూపాయలు పెట్టుబడి ప్రోత్సాహంగా అందిస్తామని హామీ ఇచ్చారు. అయితే తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వపరంగా 7500 కు మాత్రమే పరిమితం అయ్యారు. కేంద్రం అందించే పీఎం కిసాన్ 6000 రూపాయల నగదు తో పాటు 13,500 అందించారు. అయితే తాము అధికారంలోకి వస్తే సాగు సాయం కింద ఏటా 20వేల రూపాయల సాయం అందిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆ హామీని అమలు చేసేందుకు ఇప్పుడు పూర్తిస్థాయిలో దృష్టి పెట్టారు. అయితే కేంద్రం అందించే 6000 రూపాయల మొత్తానికి.. మరో 14 వేల రూపాయలను జతచేస్తూ.. 20000 అందించేందుకు నిర్ణయించడం విశేషం జూన్ నెలలో అన్నదాత సుఖీభవ తో పాటు తల్లికి వందనం పథకం అమలు చేస్తామని ఇదివరకే సీఎం చంద్రబాబు ప్రకటించారు. అయితే ఇప్పుడు తల్లికి వందనం నగదును జమ చేసేందుకు అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయి. మరోవైపు అన్నదాత సుఖీభవ పథకం తొలి విడత సొమ్ము విడుదలకు సైతం సన్నాహాలు ప్రారంభించినట్లు తెలుస్తోంది. మహానాడు వేదికగా సీఎం చంద్రబాబు దీనిపై ప్రకటన చేశారు. కేంద్రం అందించే పీఎం కిసాన్ తొలి విడత రెండు వేల రూపాయలతో పాటు రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించి ఐదువేల రూపాయల మొత్తాన్ని కలిపి అందిస్తామని చెప్పుకొచ్చారు. అయితే సాధారణంగా కేంద్ర ప్రభుత్వం ప్రతి నాలుగు నెలలకు ఒకసారి పిఎం కిసాన్ నిధులను విడుదల చేస్తోంది. ఈ లెక్కన జూన్ మూడో వారంలో పిఎం కిసాన్ అందించేందుకు సన్నాహాలు ప్రారంభించింది. రాష్ట్ర ప్రభుత్వ వాటా సైతం అప్పుడే అందించేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోందిమరోవైపు రాష్ట్ర వ్యాప్తంగా అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ జరుగుతుంది. అధికార యంత్రాంగం అర్హులను గుర్తించే పనిలో పడింది. అర్హుల జాబితా సిద్ధమయ్యాక పీఎం కిసాన్ యోజన నిధులు విడుదల సమయంలోనే అన్నదాత సుఖీభవ నిధులు కూడా విడుదల కానున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా దరఖాస్తుల నమోదు ప్రక్రియలు అధికారులు బిజీగా ఉన్నారు. అర్హుల జాబితా కొలిక్కి వచ్చిన తర్వాత ప్రభుత్వానికి నివేదించనున్నారు. అదే సమయంలో పీఎం కిసాన్ నిధులు జమ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. తద్వారా జూన్ మూడో వారంలో అన్నదాత సుఖీభవ నిధులు జమ అయ్యే పరిస్థితి కనిపిస్తోంది. మరి ఏం జరుగుతుందో చూడాలి.

నిబంధనలు

ఏపీకి చెందిన రైతులు మాత్రమే అర్హులు. ఐదు ఎకరాల్లోపు చిన్న సన్న కారు రైతులు అర్హులు. లబ్ధిదారు వయసు విధిగా 18 సంవత్సరాలు నిండి ఉండాలి. భూమికి సంబంధించి పక్కా పత్రాలు, పట్టాదారు పాసుబుక్ తప్పనిసరి. రైతు పేరుతో ఆధార్తో అనుసంధానమై ఉండాలి. రైతు పండించే పంటల వివరాలను నమోదు చేయాలి. భూమిని లీజుకు తీసుకున్న కౌలు రైతులకు కూడా ఈ పథకానికి అర్హులు. తప్పనిసరిగా కౌలు రైతు ధ్రువీకరణ పత్రం ఉండాలి. పిఎం కిసాన్ పథకానికి అర్హులైన వారంతా అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులే.కేవలం సొంత భూమి కలిగిన వారికే కాకుండా కౌలు తీసుకుని వ్యవసాయం చేసుకున్న వారికి సైతం ఈ పథకం వర్తిస్తుంది. అన్నదాత సుఖీభవ పథకాన్ని వర్తించేలా ఏపీ ప్రభుత్వం మార్గదర్శకాలను సైతం విడుదల చేసింది. అయితే కౌలు రైతు ధ్రువీకరణ పత్రం కలిగి ఉండాలని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. ఆదాయ పన్ను చెల్లించిన వారికి అన్నదాత సుఖీభవ పథకం వర్తించదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు ఈ పథకానికి అనర్హులు. ప్రజా ప్రతినిధులకు సైతం ఈ పథకం వర్తించదు. పదివేల రూపాయల కంటే ఎక్కువ పింఛను పొందే వారికి అన్నదాత సుఖీభవ వర్తించదు. కేవలం కుటుంబాన్ని యూనిట్గా తీసుకుని అమలు చేయనున్నారు. అందుబాటులోకి వెబ్సైట్.. ట్ర్భిబిజూబ:// జీనినిజీటజీబిఫ్ట్రజీబబీనెఫ్ట్రతిఎఫ్ట్రజీలజీ ప్రత్యేక వెబ్సైట్ ఉంటుంది. అందులో మన స్టేటస్ కూడా చెక్ చేసుకోవచ్చు. రైతు ఆధార్ కార్డు, పట్టాదార్ పాస్ బుక్ వంటి భూమి పత్రాలు, బ్యాంక్ పాస్ బుక్, మొబైల్ నెంబర్, భూమి వివరాలు, రైతుల పాస్పోర్ట్ సైజ్ ఫోటో, ఆధార్ కార్డు నెంబర్ను బ్యాంకు ఖాతాలో అనుసంధానం చేసుకొని ఉండాలి. అర్హులైన రైతులు తమ ఆధార్ కార్డు, భూమి పాసుబుక్, బ్యాంక్ పాస్ బుక్ తదితర పత్రాలతో రైతు సేవా కేంద్రంలో అధికారులను సంప్రదించాలి. అక్కడ సిబ్బందికి వివరాలను అందించాలి. అధికారులు రైతులు సమర్పించిన పత్రాలను పరిశీలించి, వివరాలను ధృవీకరించుకొని సదరు రైతు పేరును లబ్ధిదారుల జాబితాలో చేర్చేందుకు సిఫారసు చేస్తారు. రైతు సేవా కేంద్రాల వారిగా నమోదైన వ్యాపిల్యాండ్ డాటాను ఉన్నతాధికారులు పరిశీలించి.. అర్హులైన వారికి అన్నదాత సుఖీభవ లబ్ధిదారుల జాబితాలో చేరుస్తారు.

# ఈ నెల్లో 3 నెలల రేషన్

వరంగల్, మే 29, (

పేదలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతీనెల రేషన్ షాపుల ద్వారా సరుకులు పంపిణీ చేస్తున్నాయి. తెలంగాణలో రెండు నెలలుగా రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నారు. దీంతో చాలా మంది బియ్యం తీసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ తరుణంలో కేంద్రం కీలక ఆదేశాలు జారీ చేసింది. మూడు నెలలకు సంబంధించిన రేషన్ ఒకేసారి పంపిణీ చేయాలని రాష్ట్రాలను ఆదేశించింది.వర్షాకాలంలో ఆహార ధాన్యాల సరఫరాలో అంతరాయాలు తలెత్తకుండా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జూన్, జులై, ఆగస్టు నెలలకు సంబంధించిన రేషన్ కోటాను ఒకేసారి పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు జూన్ నెల 1 నుంచి 30 వరకు రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీకి ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ కార్యక్రమం సజావుగా సాగేందుకు అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు.రేషన్ పంపిణీలో పారదర్శకత, జవాబుదారీతనం నిర్ధారించేందుకు బయోమెట్రిక్ ధ్రువీకరణ విధానాన్ని కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించింది. ప్రతీనెల కోటాకు వేర్వేరుగా బయోమెట్రిక్ ద్వారా గుర్తింపు చేయాలని ఆదేశించింది. ఈ విధానం ద్వారా రేషన్ లబ్ధిదారుల గుర్తింపు ఖచ్చితంగా జరుగుతుంది, దుర్వినియోగాన్ని నివారించవచ్చు. అధికారులు రేషన్ దుకాణాల్లో సరైన నిల్వలు, పంపిణీ వ్యవస్థలను సిద్ధం చేయాలని సూచనలు వచ్చాయి.వర్షాకాలంలో రవాణా, నిల్వ సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. గతంలో వర్షాల కారణంగా రేషన్ సరఫరాలో జాప్యం జరిగిన సందర్భాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో, మూడు నెలల రేషన్‌ను ఒకేసారి అందించడం ద్వారా లబ్ధిదారులకు ఆహార భద్రతను నిర్ధారించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. తెలంగాణలో 2024లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదైన నేపథ్యంలో, ఈ నిర్ణయం సమయోచితమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.తెలంగాణలో దాదాపు 90 లక్షల రేషన్ కార్డు దారులు ఉన్నారు, వీరికి నెలకు 6 కిలోల సన్న బియ్యం అందించబడుతుంది. ఈ కొత్త నిర్ణయం ద్వారా ఒక్కో లబ్ధిదారుకు 18 కిలోల బియ్యం మూడు నెలల కోసం ఒకేసారి అందుబాటులో ఉంటుంది. రాష్ట్రంలో 35,000 రేషన్ దుకాణాలు ఈ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తాయి. గతంలో ఇలాంటి ఒకేసారి పంపిణీ కోవిడ్?19 సంక్షోభ సమయంలో చేపట్టబడింది, అది విజయవంతంగా అమలైంది.

నిల్వ సమస్యలు: మూడు నెలల రేషన్‌ను ఒకేసారి నిల్వ చేయడానికి రేషన్ దుకాణాల వద్ద తగిన గిడ్డంగులు, సౌకర్యాలు అవసరం. ప్రభుత్వం ఈ దిశగా అధికారులను ఆదేశించింది.

రవాణా సమస్యలను అధిగమించేందుకు రాష్ట్రవ్యాప్తంగా సమన్వయ వ్యవస్థను బలోపేతం చేయాలి.

అవగాహన: లబ్ధిదారులకు ఈ కొత్త విధానం గురించి సమాచారం అందించేందుకు ాటూ, స్థానిక మీడియా, గ్రామ సభల ద్వారా ప్రచారం చేయాలి.ఈ నిర్ణయం వర్షాకాలంలో ఆహార భద్రతను నిర్ధారించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. బయోమెట్రిక్ ధ్రువీకరణ విధానం దుర్వినియోగాన్ని తగ్గించి, సమర్థవంతమైన పంపిణీని సాధ్యం చేస్తుంది. అయితే, రేషన్ దుకాణాల వద్ద సరైన నిల్వ సౌకర్యాలు, రవాణా వ్యవస్థలు లేకపోతే ఈ కార్యక్రమం అమలులో సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. ప్రభుత్వం ఈ సవాళ్లను పరిష్కరించడానికి సమగ్ర ప్రణాళిక, అధికారులతో సమన్వయం చేయాలి. గత కోవిడ్ సమయంలో ఇలాంటి విధానం విజయవంతం కావడం ఈ కార్యక్రమం సాఫల్యానికి సానుకూల సంకేతం.ఈ చర్య రాష్ట్ర ప్రభుత్వం దూరదృష్టి, లబ్ధిదారుల శ్రేయస్సు పట్ల దాని నిబద్ధతను ప్రతిబింబిస్తుంది. అదే సమయంలో ఆహార సరఫరా వ్యవస్థలో సాంకేతికత వినియోగాన్ని బలోపేతం చేస్తుంది.

# తీగ దొరికింది..డొంక కదిలింది

## అక్రమ శిశు విక్రయాలలో అంతర్రాష్ట్ర నెట్ వర్క్

సూర్యాపేట

సూర్యాపేటలో సంచలనం సృష్టించిన పిల్లల అక్రమ రవాణా ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. ఈ ముఠాకు చెందిన 13 మంది సభ్యులను అదుపులోకి తీసుకున్నామని, ఇప్పటివరకు 28 మంది చిన్నారులను అక్రమంగా రవాణా చేసినట్లు గుర్తించామని సూర్యాపేట ఎస్పీ నరసింహ మీడియా కు వెల్లడించారు.

ఈ కేసులో పది మంది చిన్నారులను పోలీసులు సురక్షితంగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ఏడుగురు బాలురు, ముగ్గురు బాలికలు ఉన్నారు. టేకుమట్ల గ్రామంలో అక్రమ దత్తతకు సంబంధించిన విశ్వసనీయ సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు..పోలీసుల దర్యాప్తులో అబ్బుర పరిచే విషయాలు వెలుగు చూశాయి. సూర్యాపేట పట్టణానికి చెందిన యాదగిరి, ఉమారాణి అనే వ్యక్తులు ఈ ముఠాకు ప్రధాన సూత్రధారులుగా గుర్తించారు. వీరు తమ కోడిగుడ్ల పంపిణీ వృత్తిని అడ్డుపెట్టుకొని, పిల్లలు లేని తల్లిదండ్రుల గురించి తెలుసుకునేవారు. ఆడ, మగ శిశువులను బట్టి రూ. 10 వేల నుంచి రూ. 2 లక్షల వరకు కమిషన్ తీసుకుని, మొత్తం రూ. 5 లక్షల నుండి రూ. 10 లక్షల వరకు బేరం కుదుర్చుకొని అక్రమంగా దత్తత తీసుకున్న పిల్లలను వారికి అందించేవారు. ఈ ముఠాకు మహారాష్ట్ర, గుజరాత్, ముంబయి వంటి రాష్ట్రాలతో కూడా సంబంధాలున్నట్లు ప్రాథమిక దర్యాప్తులో గుర్తించారు.

ముఠాలోని ఏ6, ఏ8, ఏ9, ఏ10, ఏ11 నిందితులపై గతంలో మేడిపల్లి, మునగాల, మంగళగిరి, జనగాం సీఐడీ, ముంబైలలో కూడా ఇలాంటి కేసులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఇది వారి నేర చరిత్రను, ఈ దందా ఎంత పెద్ద ఎత్తున సాగుతోందో వెల్లడిస్తోంది. బుధవారం ఉదయం అక్రమ దత్తతలకు సంబంధించిన విశ్వసనీయ సమాచారం మేరకు, అక్రమంగా దత్తత తీసుకున్న ఇద్దరిని అదుపులోకి తీసుకొని, వారి ఒప్పుకోలు ఆధారంగా ఏ1, ఏ2 లను అరెస్ట్ చేశారు. అదే సమయంలో, శిశువుల అక్రమ రవాణా గురించి చర్చించడానికి ముఠా సభ్యులు సూర్యాపేట హైటెక్ బస్టాండ్ వద్ద ఉన్నారని తెలియడంతో, పోలీసులు అక్కడికి చేరుకుని ఏ3 నుండి ఏ13 వరకు ఉన్న నిందితులను అరెస్ట్ చేశారు.

ఈ శిశు విక్రయాల ముఠా గుట్టు రట్టయిన తర్వాత, తీగ లాగితే డొంక కదిలిన చందంగా ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా పదుల సంఖ్యలో బాధితులు సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్కు చేరుకొని ఆందోళన వ్యక్తం చేశారు. పిల్లలు లేక బాధపడుతున్న తల్లిదండ్రుల ఆశను ఆసరాగా చేసుకొని లక్షల రూపాయలు దండుకొని పసికందులను అప్పజెప్పి సొమ్ము చేసుకున్న ఈ ముఠా నిర్వాకం ఇప్పుడు వేలాది మందిని షాక్కు గురిచేసింది.

జువెనైల్ జస్టిస్ (కేర్ అండ్ ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్) యాక్ట్, 2015 ప్రకారం, పిల్లలను అక్రమంగా విక్రయించడం లేదా కొనుగోలు చేయడం తీవ్రమైన నేరంగా పరిగణించబడుతుంది.ఈ చట్టం పిల్లల ఉత్తమ ప్రయోజనాలను పరిరక్షించడంపై దృష్టి పెడుతుంది. అలాగే, సరోగసీ (నియంత్రణ) చట్టం, 2021 వంటివి అక్రమ సరోగసీని నిరోధిస్తాయి.

ఈ కేసు అనేక సామాజిక, నైతిక ప్రశ్నలను లేవనెత్తుతోంది. పిల్లల అక్రమ రవాణాను అడ్డుకోవడానికి, సరైన దత్తత ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించడానికి ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు మరింత కృషి చేయాల్సిన అవసరం ఉంది. నాలుగు సంవత్సరాలుగా కంటికి రెప్పలా పెంచుకున్న పిల్లలను దూరం చేసుకోవాల్సిన తల్లిదండ్రుల బాధ, అక్రమ రవాణాకు పాల్పడిన వారికి చట్టం విధించే శిక్ష.. ఈ కథలో చివరికి ఎవరు విజేత గా నిలుస్తారు..? ఎవరు బాధితులు? చిన్నారుల భవిష్యత్తు ఏంటి? ఈ దర్యాప్తులో ఇంకెన్ని నిజాలు వెలుగులోకి వస్తాయో.

# సరస్వతి పుష్కర ఆదాయం రెండు కోట్ల 83 లక్షలు.

జయశంకర్ భూపాలపల్లి

సరస్వతి నది పుష్కరాల సందర్బంగా శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి ఆలయానికి పుష్కరాలు 12 రోజులలో హుండీ ద్వారా రు.1,36,28,099 ఆదాయం వచ్చినట్లు హుండీల పర్యవేక్షణాధికారి నందనం కవిత తెలిపారు. లెక్కింపు కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి ఎస్ మహేష్, సహాయ కమిషనర్ ఆర్ సునిత పాల్గొన్నారు. గదుల అద్దె ద్వారా రు. 1,71,000, హోమముల ద్వారా రు.1,23,000, శీఘ్రదర్శనం ద్వారా రు. 5,60,000, ప్రసాదముల ద్వారా రు.138,36,552, హుండీల ఆదాయం రు. 1,36,28,099, మొత్తం రు. 2,83,18,651,మిశ్రమ బంగారు 15 గ్రాములు, మిశ్రమ వెండి 1-750 గ్రాములు వచ్చినట్లు పర్యవేక్షణాధికారి నందనం కవితవెల్లడించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం సూపరింటెండెంట్ బుర్రి శ్రీనివాస్, పుష్కరాల ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. కాళేశ్వరం ఎస్సై తమాషా రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది బందోబస్తు ఏర్పాటు చేశారు.

==================================

# జవహర్ నగర్ కాలనీలో పర్యటించిన ఎమ్మెల్యే గండ్ర

జయశంకర్ భూపాలపల్లి

భూపాలపల్లి పట్టణంలోని 8, 27 వార్డులైన జవహర్ నగర్ కాలనీ లో కాంగ్రెస్ పార్టీ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ పిప్పాల రాజేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన జై భీమ్, జై బాపూ, జై సంవిధాన్ రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రలో గురువారం ముఖ్య అతిథిగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొన్నారు. ముందుగా ఎమ్మెల్యేకు కాలనీ వాసులు, నాయకులు శాలువాలు కప్పి స్వాగతం పలికారు. అనంతరం బాపూ, అంబేద్కర్, రాజ్యాంగ పీఠిక చిత్రపటాలకు పూల మాల వేసి, అక్కడున్న నాయకులు, ప్రజలతో రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలని ఎమ్మెల్యే ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం యాత్రనుద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ... మన దేశ రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రాజ్యాంగ విలువలపై ప్రజల్లో అవగాహన పెంచడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. నేడు పేద, బలహీన వర్గాల ప్రజల ఆకాంక్షలు నెరవేరటం లేదని, ప్రధానికి పేద ప్రజల కంటే బడా బాబులు ముఖ్యమన్నారు. రాజ్యాంగం కేవలం ఒక పుస్తకం కాదని, అంబేడ్కర్, గాంధీ, పూలే లాంటి గొప్ప వాళ్ళ ఆలోచనలతో కూడిన ఒక పవిత్ర గ్రంథమన్నారు. పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగాన్ని బీజేపీ పార్టీ అనగదొక్కాలని చూస్తుందన్నారు. అమిత్ షా అంబేడ్కర్ ను పార్లమెంట్ సాక్షిగా అవమానించారన్నారు. కాలనీలో యాత్ర మధ్యలో పలువురు కాలనీవాసులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే ఆ సమస్యలను పరిష్కరించాలని అక్కడున్న మున్సిపల్ అధికారులకు ఎమ్మెల్యే సూచించారు.

జవహర్ కాలనీలో కొత్తగా ఏర్పాటు చేసిన రేషన్ షాపును ప్రారంభించిన ఎమ్మెల్యే..జవహర్ నగర్ కాలనీలో పాదయాత్ర మధ్యలో కాలనీలో కొత్తగా ఏర్పాటు చేసిన రేషన్ షాపును ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన వేదికపై నుండి ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దొడ్డు బియ్యం పంపిణీలో జరుగుతున్న అక్రమాలను అరికట్టడంతో పాటు పేదలకు సన్న బియ్యం అందించాలనే కృతనిశ్చయంతో ప్రజా ప్రభుత్వం ఉందని ఎమ్మెల్యే తెలిపారు. సన్న బియ్యం పంపిణీ దేశంలోని ఆదర్శ పథకం అని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందిగా ఉన్నా, సంక్షేమ పథకాలు అమలు చేస్తూ పారదర్శక పాలన అందిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రజల ఆలోచన విధానంలో మార్పు వచ్చినప్పుడు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యమని అన్నారు.పోచమ్మ ఆలయంలో మంచి నీటి బోరు మోటారును స్విచ్ఛాన్ చేసి ప్రారంభించిన ఎమ్మెల్యే జవహర్ నగర్ కాలనీలో పాదయాత్రలో భాగంగా కాలనీలోని పోచమ్మ దేవాలయంలో ఎమ్మెల్యే పోచమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

# మిర్యాలగూడ పట్టణంలో పోలీసులు కార్డెన్ అండ్ సెర్చ్

నల్గొండ , మే 29,

మిర్యాలగూడ పట్టణంలోని ప్రకాష్ నగర్ లో పోలీసులు కార్డేన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. ఎస్పీ శరత్ చంద్ర పవర్ ఆదేశాల మేరకు డి.ఎస్.పి రాజశేఖర్ రాజ్ ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ జరిగింది. ప్రతి ఇంటిని క్షుణ్ణంగా పరిశీలించిన పోలీసులు సరైన పత్రాలు లేని పలు వాహనాలు సీజ్ చేసారు.

# తిరుపతి శ్రీ వెంకటేశ్వర జూలాజికల్ పార్కు నందు పెద్ద ఎత్తున యోగ కార్యక్రమం నిర్వహణ

**యోగా మన దైనందిన జీవితంలో ఒక భాగం కావాలి... యోగాతో సంపూర్ణ ఆరోగ్యం... : జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఎస్**

**యోగాంధ్ర లో అందరూ భాగస్వాములు కావాలి. - ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు**

తిరుపతి, మే29:

యోగా మన దైనందిన జీవితంలో ఒక భాగం కావాలి... యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, ఎంఎల్ఏ ఆరని శ్రీనివాసులు సంయుక్తంగా పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా తిరుపతి శ్రీ వెంకటేశ్వర జూలాజికల్ పార్కు నందు యోగ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఉదయం నిర్వహించిన యోగాంధ్ర- 2025 శిక్షణా కార్యక్రమాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, జూ క్యూరేటర్ సెల్వం, డి ఎఫ్ ఓ వివేక్, యోగాంధ్ర శిక్షణ కార్యక్రమంలో పాల్గొని యోగాసనాలు చేసారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నెల రోజుల పాటు నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. జూన్ 21న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విశాఖపట్నం లో నిర్వహిస్తున్నారని, ఈ కార్యక్రమానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హాజరవుతారని అన్నారు. నెలరోజులు పాటు యోగాపై ప్రజలకు అవగాహన, ప్రయోజనాలు వివరించేందుకు



ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొంచామని అన్నారు. ఈ నెల 21 న మహిళా వర్సిటీలో యోగా దినోత్సవాన్ని ప్రారంభించామని, అప్పటి నుండి ప్రతి రోజు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. ప్రతి ఒక్కరికి యోగా పై అవగాహన వచ్చేలా రానున్న రోజుల్లో మన జిల్లాలో అత్యంత ప్రాముఖ్యత, విశిష్టత కలిగిన 5 ప్రదేశాల్లో భాగంగా నేడు ఎస్.వి జూ పార్క్ నందు యోగ శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. తిరుమల, శ్రీహరి కోట, చంద్రగిరి కోట, శ్రీకాళహస్తి, యోగా పై పలు అవగాన కార్యక్రమాలు నిర్వహించబోతున్నామని అన్నారు.

యోగ అనేది ప్రతి ఒక్కరి జీవితంలో ఒక భాగం కావాలని తెలిపారు అలాగే ప్రతి ఒక్కరు ఇంకో నలుగురికి యోగ చేయడం వల్ల ప్రయోజనాలను వివరించి వారి చేత కూడా యోగాను చేయించే బాధ్యత ప్రతి ఒక్కరు తీసుకోవాలని తెలిపారు. ప్రతి మండలానికి నలుగురు మాస్టర్ ట్రైనర్ లను ఏర్పాటు చేశామని వారు ఒక్కొక్కరు 200 మందికి ట్రైనింగ్ ఇచ్చి ప్రతి మండలంలో, గ్రామంలోని ప్రతి పౌరుడికి యోగా పై అవగాహన కలిగేలా చూస్తున్నామని. సుమారు జిల్లాలో 10 లక్షల మంది యోగా లో ప్రావీణ్యం పొందేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విశాఖ పట్టణంలో గౌ.ప్రధానమంత్రి హాజరు కానున్న కార్యక్రమానికి కూడా జిల్లా నుండి యోగా లో శిక్షణ తీసుకున్న వారిని పాల్గొనేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ప్రతి ఒక్కరికి యోగ పై అవగాహన కలిగేలా అవగాహన కార్యక్రమాలు జిల్లా అంతట చేపడుతామని తెలిపారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్రను అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని అందరూ పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. 11 వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నెల రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. జూన్ 21న విశాఖపట్నం లో సుమారు ఐదు లక్షల మంది తో యోగా దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోందని అన్నారు. యోగా అనేది ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలని అన్నారు. మునిసిపల్, మండల, గ్రామ స్థాయిలో జరిగే యోగాంధ్ర కార్యక్రమాల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ అధికారి రామ్మోహన్, సాఘిక సంక్షేమ సాధికారతాధికారి మరియు నోడల్ అధికారి విక్రమ్ కుమార్ రెడ్డి, డిఎంహెచ్ఓ బాలకృష్ణ నాయక్, టూరిజం శాఖ అధికారి జనార్దన్ రెడ్డి, అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, అటవీశాఖ అధికారులు మరియు సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, ఆయుష్ సిబ్బంది, స్థానిక ప్రజలు,యువత విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

# ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులందరూ త్వరగా ఇండ్లు నిర్మించుకోవాలి : మంత్రి జూపల్లి కృష్ణా రావు

(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, మే 29: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులందరూ త్వరగా ఇండ్లు నిర్మించుకోవాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖా మంత్రి జూపల్లి కృష్ణా రావు అన్నారు. శుక్రవారం బాన్సువాడ లో బీర్కూర్, నసురుల్లాబాద్ మండలాల మహిళా లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల అవగాహన సదస్సు, ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పేద వాళ్లకు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి స్వంత ఇంటి స్థలం ఉంటే 5 లక్షల రూపాయలు ప్రభుత్వం మంజూరు











చేస్తున్నదని తెలిపారు. ప్రభుత్వం మంజూరు చేసిన ఇండ్ల నిర్మాణాలను త్వరగా నిర్మించుకోవాలని తెలిపారు. రాష్ట్రం లోని మహిళల సంక్షేమం కోసం ఆర్టీసీ లో ఉచిత రవాణా సౌకర్యం కల్పించిందన్నారు. పేద ప్రజల సంక్షేమం కోసం 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, 500 రూ. లకే వంట గ్యాస్ సిలెండర్, సన్న బియ్యం, రుణ మాఫీ పథకాలను ప్రవేశపెట్టి అమలు పరుస్తున్నదని తెలిపారు. 8 లక్షల కోట్ల అప్పు ఉన్నప్పటికీ ప్రతీ నెల 6500 కోట్ల వడ్డీ చెల్లిస్తూ ప్రభుత్వం పేద వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదని తెలిపారు. మహిళలను కోటీశ్వరులుగా చేయాలనే కార్యక్రమంలో భాగంగా మహిళలకు ఆర్టీసీ బస్సులను కొనుగోలు చేసి అద్దె చెల్లిస్తున్నారని, పెట్రోల్ బంక్ లను, సోలార్ పవర్ యూనిట్లను మంజూరు చేయడం జరుగుతున్నదని తెలిపారు. రాజీవ్ యువ వికాసం పథకానికి 8 వేల కోట్లతో పథకాన్ని ప్రారంభించడం జరుగుతున్నదని తెలిపారు. రాష్ట్రంలో పిల్లలు పక్కదారి పట్టకుండా భద్రంగా చూసుకోవాలని, గంజాయి వంటి మత్తు పదార్థాల వైపు వెళ్లకుండా చూడాలని మహిళలకు తెలిపారు. బాన్సువాడ శాసన సభ్యులు , ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలపై అవగాహన కల్పించామని, ప్రతీ నియోజక వర్గానికి 3500 ఇండ్లు మంజూరు చేయడం జరుగుతున్నదని తెలిపారు. మంజూరు అయిన లబ్ధిదారులు త్వరగా ఇల్లు నిర్మించుకోవాలని తెలిపారు. బీర్కూర్ మండలంలో 370, నసురుల్లాబాద్ మండలంలో 374 మందికి ఇండ్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మాట్లాడుతూ, ప్రభుత్వ ప్రతిష్టాత్మక పథకం ఇందిరమ్మ ఇండ్లను లబ్ధిదారులు వెంటనే నిర్మించుకొని దశల వారీగా 5 లక్షలు పొందాలని తెలిపారు. నిరుపేద మహిళలకు ఇండ్లను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఇండ్ల నిర్మాణానికి కావలసిన స్టీల్, సిమెంట్ ముడిసరుకు మండల ధరల నియంత్రణ కమిటీలను వేయడం జరిగిందని, ఇసుక ఉచితంగా పొందవచ్చని కాని రవాణా, లేబర్ ఖర్చులు లబ్ధిదారుడు చెల్లించాలని అన్నారు. అనంతరం లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం మంజూరు పత్రాలను మంత్రి అందజేశారు. ఈ సమావేశంలో ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజ్, సబ్ కలెక్టర్ కిరణ్మయి, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# పోలీస్ యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి

విజయవాడ

యోగాంధ్ర మాసోత్సవాల సందర్భంగా విజయవాడ, బీఆర్టీఎస్ యోగా స్ట్రీట్లో గురువారం జరిగిన పోలీస్ యోగాంధ్ర కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులతో కలిసి పాల్గొని, యోగాసనాలు అభ్యసించారు విజయానంద్ మాట్లాడుతూ తనువు, మనసును ఏకం చేసి.. శరీరం మొత్తాన్ని స్వచ్ఛతతో నింపే దివ్య ఔషధం యోగా. ప్రతిఒక్కరూ తమ జీవన మార్గంలో యోగా అభ్యసనాన్ని భాగం చేసుకోవాలన్నదే గౌరవ ముఖ్యమంత్రి ఆకాంక్ష. 26 జిల్లాల్లోనూ ప్రతిరోజూ ఒక ఇతివృత్తంతో ఉత్సాహంగా పండగ వాతావరణంలో యోగా కార్యక్రమాలు సాగుతున్నాయి. రైతులు, విద్యార్థులు, కార్మికులు.. ఇలా ప్రతి వర్గాన్ని యోగాంధ్రలో భాగం చేసే లక్ష్యంతోనే థీమ్ యోగా నిర్వహిస్తున్నాం. రాష్ట్రంలో కనీసం రెండు కోట్ల మంది యోగాలో ప్రవేశించేలా అవగాహన, శిక్షణ కార్యక్రమాలు వుంటాయి. నిపుణులు రూపొందించిన 45 నిమిషాల సరళమైన యోగా కామన్ ప్రోటోకాల్ ప్రకారం కార్యక్రమాలు వుంటాయి. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 100 పర్యాటక ప్రాంతాల్లోనూ ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. రాష్ట్రంలో ప్రతిగ్రామంలోనూ ప్రతి పట్టణంలోనూ యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. జిల్లాకు నాలుగు చొప్పున పర్యాటక ప్రాంతాల్లో యోగా ఔన్నత్యాన్ని చాటిచెప్పే కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. జూన్ 21న విశాఖలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు జరగనున్నాయి. విజయవాడ బీఆర్టీఎస్ యోగా స్ట్రీట్లో విజయవంతంగా ముగిసిన పోలీస్ థీమ్ యోగా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో దాదాపు అయిదువేల మంది పోలీస్ అధికారులు, సిబ్బంది, యోగా ఔత్సాహికులు పాల్గొన్నారు. కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (ఆరోగ్యం, వైద్యం, కుటుంబ సంక్షేమం) ఎంటీ కృష్ణబాబు, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం కమిషనర్ వీరపాండ్యన్; సీసీఎల్ఏ, ఎన్టీఆర్ జల్లా ప్రత్యేక అధికారి జి.జయలక్ష్మి, ఆయుష్ డైరెక్టర్ కె.దినేష్ కుమార్. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు, బ్రహ్మకుమారీలు, అమరావతి యోగా కేంద్ర యోగా ఔత్సాహికులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు హజరయ్యారు.

# కేసీఆర్ తప్ప ఇంకెవరీ నాయకత్వం అంగీకరించను

## బిఆర్ ఎస్ ను బీజెపిలో విలీనం చేసే కుట్ర జరుగుతోంది: ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్

ఎమ్మెల్సీ కవిత మీడియాతో మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేసారు. ఇంటి ఆడబిడ్డపై పెయిడ్ ఆర్టిస్టులతో మాట్లడిస్తున్నారు. నా జోలికొస్తే బాగోదు.. కేసీఆర్ ను మేమే నడిపిస్తున్నామని కొందరు చెప్పుకుంటున్నారు. నా లేఖ లీక్ చేసిందెవరో చెప్పాలని అన్నారు. కేసీఆర్ కు నోటీసులు ఇస్తే ఎందుకు నిరసనలు తెలపలేదు. ఇంకో నేతకు నోటీసులు ఇస్తే ఎందుకు హంగామా చేశారు. పార్టీ చేయాల్సిన పనులు జాగృతి తరుపున నేనే చేస్తున్నా. బిఆర్ ఎస్ ను బీజెపిలో విలీనం చేసే కుట్ర జరుగుతోంది. నామీద పడి ఏడిస్తే ఏమోస్తుంది. కాంగ్రెస్ మునిగిపోయే నావ. ఆ పార్టీతో రాయబారాలు నాకెందుకు. నాపై తప్పుడు వార్తలను పార్టీ ఎందుకు ఖండించడంలేదు. బీఆర్ ఎస్ లో కేసీఆర్ తప్ప ఇంకెవరీ నాయకత్వం అంగీకరించను. నాది బిఆర్ ఎస్ పార్టీ. నేను జైలులో ఉన్నప్పుడే నాపై కుట్ర జరిగింది. జైలుకు వెళ్లేటప్పుడు పార్టీకి రాజీనామా చేస్తానని చెప్పా. పార్టీ సోషల్ మీడియాలో నన్ను టార్గెట్ చేశారని అన్నారు.

# లారీ బోల్తా? డ్రైవర్, క్లీనర్లకు గాయాలు

రంగారెడ్డిశంషాబాద్ పరిధిలోని రాల్లగూడ ఔటర్ రింగ్ రోడ్డు పై నుండి అదుపుతప్పి లారీ బోల్తా పడింది. ఔటర్ పై నుండి జారిపడి సర్వీస్ రోడ్డుపై లారీ పడింది. ఘటనలో డ్రైవర్, క్లీనర్ కు తీవ్ర గాయాలు అయ్యాయి. వారిని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. డ్రైవర్ నిద్ర మత్తులో ఉన్నట్లుగా పోలీసులు భావిస్తున్నారు. లారీ శంషాబాద్ నుండి గచ్చిబౌలి వైపు వెళ్తుండగా ప్రమాదం జరిగింది.

# ద్రవిడ రాజకీయాల్లో కొత్త కూటమి

చెన్నై, మే 29

తమిళనాడు రాజకీయాలంటే గుర్తుకు వచ్చేది రెండే రెండు పార్టీలు. అవి డీఎంకే, ఏఐడీఎంకే ఆరెండు పార్టీల అధిపత్యమే దశాబ్దాలుగా కొనసాగుతోంది. మరో పార్టీ పుట్టినా?దానికంత స్కోపు.. స్పేసు.. ఇవ్వడంలేదీ రెండు పార్టీలు. అంతలా తమిళుల నరనరాన ఇంకిపోయాయా రెండు పార్టీలు. అయితే 2026లో సరికొత్త రాజకీయం చోటు చేసుకోబోతోందన్న చర్చ తమిళనాడులో జోరుగా సాగుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో 2024 ఎన్నికల్లోటీడీపీ, బీజేపీ, జనసేన జట్టు కట్టి వైసీపీని ఓడించాయి. ఇప్పుడు తమిళనాడులో కూడా ఈతరహా కూటమికి రంగం సిద్ధమవుతోందన్న సంకేతాలు వస్తున్నాయి. ఇప్పటికే బీజేపీ, ఏఐడీఎంకే2026 ఎన్నికల కోసం కూటమి కట్టాయి. అయితే హీరో విజయ్ పార్టీ టీవీకే కూడా తమ కూటమిలోకి రానుంద నేతలు సంకేతాల ఇచ్చారు. ఎందుకంటే రెండు పార్టీలూ అధికారాన్ని అంతం చేయాలనే లక్ష్యంతో సాగుతున్నవే కాబట్టి జట్టు కట్టినా ఆశ్చర్యంలేదన్నది విశ్లేషకుల మాట.అయితే ఏపీలో కూటమి విజయానికి సామాజిక సమీకరణలు కీలక పాత్ర పోషించాయి. తమిళనాడులోనూ సామాజిక సమీకరణలే కీరోల్ పోషిస్తాయి. వన్నియార్, తేవర్, ముక్కులతోర్, దళిత వర్గాలు రాజకీయంగా కీలకపాత్ర పోషిస్తున్నాయి.ఏఐడీఎంకే తేవర్, ముక్కులతోర్ వర్గాల్లో బలంగా ఉంది. విజయ్‌పార్టీ యువ ఓటర్లు, దళిత వర్గాలను ఆకర్షిస్తోంది. బీజేపీ పట్టణ మధ్యతరగతి ఓట్లపై ఆధారపడుతోంది. ఈ మూడు పార్టీలు జట్టుకడితే సామాజిక వర్గాల ఓట్లను సమీకరించి ఓటు బ్యాంకును చీల్చవచ్చు.2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ, ఏఐడీఎంకే విడివిడిగా పోటీ చేసిన 20 నియోజకవర్గాల్లో రెండు పార్టీల ఓటు షేర్ కలిపితే గణనీయమైన ప్రభావం చూపిస్తోంది. అయితే, విజయ్ పార్టీకి కమలం పార్టీపై వ్యతిరేకతతో ఉంది. మరి ఈ పరిస్థితుల్లో జట్టు కట్టే అవకాశం ఉందా అన్న చర్చ కూడా వస్తోంది. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లోబీజేపీ, ఏఐడీఎంకే కూటమి 2026 ఎన్నికల కోసం బలమైన ప్రతిపక్ష పాత్ర పోషించడం ఖాయం. ఈశక్తి విజయ్ పార్టీ తోడైతేను సులభంగా ఓడించవచ్చని ఏఐడీఎంకే నేతలు భావిస్తున్నారు.ఇప్పటికే బీజేపీ, ఏఐడీఎంకే నేతలు ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకం కావాలని పిలుపునిచ్చారు. అయితే బలం సంక్షేమ పథకాలు. ప్రస్తుతం ఆపార్టీ మహిళలకు నెలవారీ ఆర్థిక సహాయం, ఉచిత బస్సు ప్రయాణం లాంటి పథకాలతో ప్రజల్లో బలంగా కనిపిస్తోంది. అయితే ఏపీలో వైసీపీపై వ్యతిరేకతతో కూటమి విజయం సాధించినట్లు, తమిళనాడులోనూ ప్రతిపక్ష ఓట్లను ఏకం చేసి విజయం సాధించాలని ఏఐడీఎంకే యోచిస్తోంది. కానీ ఇంతవరకు విజయ్ పార్టీ నుంచి అలాంటి సంకేతాలు అయితే రాలేదు. పైగా తమిళనాడులో డీఎంకేకు- టీవీకే పార్టీల మధ్యే పోటీ అని విజయ్ ఇదివరకే ప్రకటించారు. మరి ఈ పరిస్థితుల్లో కూటమి సాధ్యమా.. అన్న చర్చ జరుగుతోంది.తమిళనాడులో ఏపీ తరహా కూటమి ఏర్పాటు అవకాశాలు ఉన్నా.. విజయం సామాజిక రాజకీయ డైనమిక్స్, పార్టీల సమన్వయంపై ఆధారపడి ఉంటుంది. బీజేపీ, ఏఐడీఎంకే కూటమి ఖరారైనప్పటికీ, చేరిక ఇంకా ప్రశ్నార్థకంగానే ఉంది. అయితే కూటమిగా ఎన్నికల్లో పోటీ చేస్తే.. డీఎంకే ఓడిపోయే అవకాశం ఉందంటున్నారు విశ్లేషకులు. ద్రవిడ పార్టీగా డీఎంకేపై ప్రజల్లో ఉన్న క్రేజు, అలాగే సంక్షేమ పథకాలు ఆపార్టీని మరోసారి అధికారంలోకి తెస్తాయన్న విశ్లేషణలూ వస్తున్నాయి. పైగా విజయ్ పార్టీ సింగిల్‌గానే రాణిస్తామన్న దీమాతో ఉంది. మరోవైపు బీజేపీ, ఏఐడీఎంకే మధ్య గత ఎన్నికల నుంచి కొనసాగుతున్న విభేదాలు కూడా సవాళ్లుగా నిలుస్తాయి. మరి చూడాలి.. విభేదాలు పక్కనపెట్టి గెలుపుకోసం బీజేపీ, ఏఐడీఎంకే పార్టీలు టీవీకేను తమవైపు తిప్పుకుంటాయా..లేదా అన్నది..!

# కల్లాల్లోనే ధాన్యం

మహబూబ్ నగర్, మే 29,

ఓవైపు తరముకొస్తున్న రుతుపవనాలు మరోవైపు హమాలీలు, లారీల కొరత అధికారుల అలసత్వం వెరిసి రైతుల కష్టం వర్షార్పణమౌతోంది. పంట చేతికి వచ్చి పక్షం రోజులవుతున్నా ధాన్యాన్ని తూకం వేసి మిల్లర్లకు పంపాల్సిన అధికారులు హమాలీలు, లారీలు కొరత ఉందంటూ సాకులు చెప్తున్నారని రైతులు మండిపడుతు న్నారు.ఆయా కొనుగోలు కేంద్రాల్లో అప్పటికే తూకం వేసి లారీలను ఆయా మిల్లులకు తరలించినప్పటికీ మిల్లర్లు తరుగు, తేమ పేరుతో కొర్రీలు పెట్టి వాహనాల్లోని ధాన్యాన్ని దించుకోకపోవడంతో కొనుగోలు కేంద్రాల వద్ద వాహనాల కొరత ఏర్పడుతోందని కొంతమంది అధికారులు సాకులు చెప్తున్నారు.గతంలోనే సేకరించిన ధాన్యాన్ని ఎఫ్సీఐకి బియ్యం తరలించకపోయినా మిల్లర్లతో కుమ్మక్కై అధికారులు కొందరు అవే మిల్లులకు మళ్లీ ధాన్యాన్ని కేటాయిస్తున్నారని ఇతర మిల్లర్లు ఆరోపిస్తున్నారు. మరికొన్ని అధికారులకు అనుకూలంగా ఉన్న మిల్లర్లకు అత్యధిక ధాన్యాన్ని కేటాయించడంతో రైతుల నుండి అడ్డగోలుగా దోచుకుంటున్నారని ఆరోపణ లు వినిపిస్తున్నాయి.

రైస్ మిల్లర్లతో కొంతమంది అధికారులు ప్రజాప్రతినిధులు లోపాయి కారి ఒప్పందాలు చేసుకొని వారికి అనుకూలంగానే అడుగులు వేస్తూ రైతులను మాత్రం నట్టేట ముంచుతున్నారని ఆయా గ్రామాల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను తీరా అమ్ముకోవడం కోసం కల్లాల వద్ద ధాన్యాన్ని కాపాడుకునేందుకు రక్షణగా కాపలా కాయవలసిన పరిస్థితి ఏర్పడిందని రైతులు మండిపడుతున్నారు.కుటుంబం లోని పిల్లా జెల్లా అంతా కళ్ళల్లోనే ఉంటూ ఎండకు ఎండబెడుతూ వానకు తడవకుండా అనేక ఆపసోపాలకు గురవుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయా కొనుగోలు కేంద్రాల వద్ద సంబంధిత సిబ్బంది అధికారులు అలసత్వం వహించినట్లు జిల్లా కలెక్టర్ పర్యటనలో గుర్తించినప్పటికీ వారిపై చర్యలు తీసుకునేందుకు ఎందుకు జంకుతున్నారో మిలియన్ డాలర్ల ప్రశ్నగా మిగులుతోంది.నిబంధనలను ఉల్లంఘించి రైతులు నష్టపోయే విధంగా వ్యవహరించిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉన్నా నేరుగా కలెక్టర్ పర్యటించిన సందర్భాల్లో అధికారుల అలసత్వం గుర్తించినప్పటికీ పట్టించుకోకపోవడం వెనక ఆంతర్యం ఏంటని ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి. రైతుల నుండి కొనుగోలు చేసిన ధాన్యానికి కూడా డబ్బులు ఆలస్యం అవుతుందని ఇతర పంట సాగు కోసం పనిచేసుకోలేక ఆయా బ్యాంకుల చుట్టూ అధికారుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి దాపురించిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 15 రోజులుగా ఆయా కల్లాల వద్ద వరి ధాన్యం ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ ఉండడంతో ధాన్యం మొలకెత్తుతుందని రైతులు దిగులు పడుతున్న పరిస్థితి.ప్రస్తుతం ఆయా కొనుగోలు కేంద్రాల వద్ద బీహార్ రాష్ట్రానికి చెందిన హమాలీలచే ధాన్యం తరలింపు చేస్తున్నారు ధాన్యం తరలింపు కోసం ఒప్పందం చేసుకున్న లారీ ఓనర్లు కూడా తక్కువ సంఖ్యలో లారీలను ఏర్పాటు చేస్తున్నప్పటికీ వారిపై చర్యలు తీసుకోకపోవడంతో ఈ సమస్య ఉత్పన్నమవుతుందని రైతులు విచారం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 1,04,712 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఆయా కొనుగోలు కేంద్రాల నుంచి సేకరించగా 1,03,617 మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని ఆయా రైస్ మిల్లర్లకు సరఫరా చేసినట్లు అధికారులు చెప్తున్నారు. ఇంకా 1,095 మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కల్లాల్లోనే మగ్గుతోందని అధికారిక లెక్కలే చెప్తున్నాయి .కానీ అనధికారికంగా ఇప్పటికీ ఆయా రైతుల నుంచి కొనుగోలు చేయకుండా కళ్ళాల్లోనే మగ్గుతున్న ధాన్యం ఇంకా 50వేల మెట్రిక్ టన్నుల దాకా ఉంటుందని అంచనా వేస్తున్నారు.

==========================చీచీ

## రత్నాల చెరువులో పోలీసుల కార్డన్ అండ్ సెర్చ్

మంగళగిరి

గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు అడిషనల్ బజా రవికుమార్ పర్యవేక్షణలో నార్త్ జోన్ డిఎస్పి మురళీకృష్ణ మంగళగిరిలోని రత్నాల చెరువులో కార్డన్ సెర్చ్ జరిగింది. 120 మంది పోలీస్ సిబ్బందితో తనిఖీలు చేసారు. ఇద్దరు రౌడీ షీటర్ లను అదుపులోకి తీసుకున్నారు. సరైన పత్రాలు లేని 85 మోటార్ సైకిల్స్ సీజ్ చేసారు. అసాంఘిక కార్యక్రమాలు ఏమైనా జరుగుతున్నాయని ఆరా తీశారు అడిషనల్ ఎస్పి. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పి రవికుమార్ తో పాటు మంగళగిరి డిఎస్పి మురళీకృష్ణ మంగళగిరి టౌన్ సీఐ వినోద్ కుమార్, తాడేపల్లి సిఐ కళ్యాణ్ రాజు , ఎస్ఐ మహేష్, ఎస్ఐ ప్రతాప్ పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

## కాంగ్రెస్ కార్పొరేటర్ వేధింపులకు బీ ఆర్ ఎస్ నేత బలి

బోరబండ

కాంగ్రెస్ కార్పొరేటర్ వేధింపులకు బోరబండ డివిజన్ బీ ఆర్ ఎస్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు సర్దార్(30) ఆత్మహత్య చేసుకున్నాడు. గత కొన్ని నెలలుగా సర్దార్ ని పలురకాలుగా కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ వేధిస్తున్నట్లు, 15రోజుల క్రితం సర్దార్ ఇంటిని సైతం బాబా ఫసియుద్దీన్ కూల్చివేయించినట్లు ఆరోపణ. అన్ని వైపుల నుంచి వేదింపులు ఎక్కువ కావడంతో సర్దార్ ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబికులు అంటున్నారు. ఈ నేపథ్యంలో బోరబండలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. పోలీస్ స్టేషన్ వద్ద కుటుంబసభ్యులు. స్థానికులు ఆందోళనకి దిగారు. సర్దార్ మృతికి కారణమైన బాబా ఫసియుద్దీన్ మీద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేసారు. రెండున్నర ఏళ్ల వయస్సున్న పిల్లలు ఉన్నారంటూ కుటుంబ సభ్యులు కన్నీళ్ల పర్యంతం అయ్యారు.

## భార్యను హతమార్చిన భర్త

ములుగు

ములుగు జిల్లా జంగాలపల్లి క్రాస్ రోడ్ వద్ద రాత్రి వివాహిత సంగారబోయిన సౌందర్య దారుణ హత్యకు గురైంది, భార్య భర్తల మధ్య నెల రోజుల నుండి గొడవలు జరుగుతుండడంతో వారం రోజుల క్రితం సౌందర్య గ్రామంలోని తల్లి గారి ఇంటికి వెళ్లిపోయింది .అయితే కొందరు పెద్దమనుషులు సర్దిచెప్పి లక్ష్మయ్య ఇంటికి తీసుకువచ్చి భార్య భర్తలు ఇద్దరికి నచ్చ చెప్పారు ,డిగ్రీ పరీక్షలు జరుగుతున్న క్రమంలో. సౌందర్య కుమారుడు అజయ్ హనుమకొండకు వెళ్ళాడు, ఈ క్రమంలో సౌందర్య , లక్ష్మయ్యకు మధ్య గొడవ జరిగింది, బుధవారం ఉదయం నుంచి వారి కిరణా షాపు మూసి ఉండడంగా లక్ష్మయ్య సౌందర్య ఇద్దరు కనిపించలేదు, పరీక్షల అనంతరం అజయ్ బుధవారం రాత్రి ఇంటికి చేరుకోగా. ఇంటికి గడియ పెట్టి ఉంది. తలుపు తీసి చూసేసరికి తల్లి సౌందర్య చనిపోయి కనిపించింది, దీంతో చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం అందించారు ,ఘటన స్థలానికి సిఐ,ఎస్ఐలు చేరుకొని మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు, కాగా భార్యపై అనుమానంతో కుమారు ఇంట్లో లేని సమయంలో లక్ష్మీ హత్య చేసి పారిపోయాడని గ్రామస్తులు చెబుతున్నారు

## పోలీసు కస్టడీకి వంశీ అనుచరుడు

విజయవాడ

వైసిపి మాజీ ఎమ్మెల్యే వంశీ ముఖ్య అనుచరుడు ఓలుపల్లి రంగాను రెండు రోజులు పోలీస్ కస్టడీకి విజయవాడ కోర్టు అనుమతించింది. ఇప్పటికే రంగా, బాపులపాడు మండలంలో నకిలీ ఇళ్ల పట్టాల పంపిణీ కేసులో, అక్రమ మైనింగ్ కేసులో ఏ 2 గా విజయవాడ సబ్జైల్లో రిమాండ్ ఉన్నాడు. కోర్టు ఆదేశాల అనుసారం రెండు రోజులు పోలీస్ కస్టడీ నిమిత్తం విజయవాడ సబ్ జైలు నుండి ఓలుపల్లి రంగాను గన్నవరం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం గన్నవరం పోలీస్ స్టేషన్ కు తరలించారు పోలీసులు.

## బ్రహ్మంగారిమఠం మండలం నుండి భారీగా తరలి వెళ్లిన టిడిపి శ్రేణులు

బ్రహ్మంగారిమఠంమహానాడులో భాగంగా కడపలో మూడో రోజు జరుగుతున్న భారీ బహిరంగ సభకు బ్రహ్మంగారి మఠం మండలం లోని అన్ని గ్రామాల నుండి తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు ప్రజలు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు ఈ మహానాడు కార్యక్రమానికి మైదుకూరు నియోజకవర్గం శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ ఇచ్చిన పిలుపునందుకొని బ్రహ్మంగారిమఠం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చెన్నుపల్లి సుబ్బారెడ్డి తెలుగుదేశం పార్టీ నాయకులు ముదుమాల పోల్ రెడ్డి ఎస్ ఆర్ శ్రీనివాసులురెడ్డి మల్లికార్జునరెడ్డి సాంబశివారెడ్డి పూజా శివ యాదవ్ సుధాకర్ యాదవ్ తదితర నాయకుల ఆధ్వర్యంలో గ్రామ గ్రామము నుండి తెదేపా నేతలు బహిరంగ సభకు తరలి వెళ్లారు ఉదయం 8 గంటలకే మండలంలోని అన్ని గ్రామాలకు తెదేపా నేతలు బస్సులను పంపగా బస్సులలో బయలుదేరి తరలి వెళ్లారు వారితోపాటు పచ్చ జెండాలు బ్యానర్లు పెద్ద ఎత్తున ప్రదర్శన చేసుకుంటూ తరలి వెళ్లారు మండలంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు ఎవరికి వారు తమ అధినేత పుట్టా సుధాకర్ యాదవ్ ఇచ్చిన పిలుపునకు స్పందించి వేలాదిమంది కార్యకర్తలను తరలించడంలో సఫలీకృతులయ్యారని చెప్పొచ్చు మండలంలో కందిమల్లాయపల్లె కొత్తూరు నరసన్న పల్లె సోమిరెడ్డి పల్లె గంగిరెడ్డిపల్లి మల్లేపల్లి చెంచయ్య గారి పల్లె ముదమల పంచాయతీ పలువురాలపల్లె పంచాయతీ ఇలా మండలంలోని 11 పంచాయతీలలోని అఅన్ని గ్రామాల నుంచి తెదేపా అభిమానులు కార్యకర్తలు ప్రజలు నందమూరి అభిమానులు కడపకు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు

==============================బీబీబీ

# ఢిల్లీలో లాబీయింగ్ చేస్తున్న మల్ రెడ్డి

హైదరాబాద్, మే 29

రాష్ట్రంలో మంత్రివర్గ విస్తరణకు అధిష్టానం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఆశావావుల్లో మళ్ళీ కదలిక మొదలైంది. రాష్ట్రంలో కేబినెట్ విస్తరణ పై గత మూడు రోజులుగా సీఎం రేవంత్ రెడ్డి, ఏఐసీసీ నేత కేసి వేణుగోపాల్ సుదీర్ఘ మంతనాలు జరిపారు. సామాజిక సమీకరణలు జిల్లాల వారీగా మంత్రి పదవులు ఆశిస్తున్న ఎమ్మెల్యే వివరాలను అధిష్టానం ఇప్పటికే సేకరించింది. ఎస్సీ, ఎస్టీ,బీసీ, మైనార్టీ,రెడ్డి సామాజిక వర్గాల వారిగా మంత్రి పదవులు ఆశిస్తున్న వారి జాబితాను సైతం రూపొందించినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చిన అనంతరం మంత్రి పదవి విస్తరణలో మొదలు తన పేరు తప్పకుండా ఉంటుందని ఎంతో ధీమా పెట్టుకున్న కాంగ్రెస్ సీనియర్ నేత ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి మంత్రి పదవి విషయంలో ఆదిలోనే ఆయనకు చుక్కెదురైంది. మొదటిసారి మంత్రివర్గ విస్తరణలో దక్కని మంత్రి పదవి....రెండోసారి మంత్రివర్గ విస్తరణలో ఎలాగైనా చోటు దక్కించుకునేందుకు విశ్వ ప్రయత్నం చేస్తున్నారు. గత ఏడాది న్నర నుంచి ఆయన మంత్రి పదవి దక్కించుకునేందుకు లాబీయింగ్ సాగిస్తూనే ఉన్నారు. మంత్రి పదవి కోసం తొక్కని గడపలేదు...కలవని మనిషంటూ లేదు. మంత్రి పదవీ పైరవీలో తలమునకైలయినా మల్రెడ్డి రంగారెడ్డి నియోజకవర్గంలో తక్కువ ఢిల్లీలో ఎక్కువ అంటూ ఆయనపై నియోజకవర్గ ప్రతిపక్ష పార్టీల నేతలు సైతం సెటైర్లు వేయడం నియోజకవర్గం లో హాట్ టాఫిక్ గా ఈ అంశం మారింది. దీంతో ఆయన మంత్రి పదవి పై ఆయన ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నాడు దీన్నిబట్టే అర్థమవుతుంది. మంత్రివర్గ విస్తరణ బెర్త్ లో చోటు దక్కించుకునేందుకు ఏ అవకాశం ఉన్న వదలడం లేదు... గల్లి నుంచి మొదలుకొని అగ్రరాజ్యం వరకు తనకున్న పలుకుబడిని వినియోగించుకొని పట్టువదలని విక్రమార్కుడిలా పూర్తి లాబింగ్ నడిపిస్తున్నాడు. మంత్రివర్గ విస్తరణలో రంగారెడ్డి జిల్లాకు కేటాయింపు విషయంలో అధిష్టానం ఏమి ఆలోచన చేస్తుందో పార్టీ నేతలకు ఎవరికి అంతుచికడం లేదు. జిల్లాలో పార్టీ నేతలు కార్యకర్తలు పార్టీ అధిష్టాన నిర్ణయం పై కొంత అసంతృప్తి రగులుతుంది పదవుల పంపకాల్లో పూర్తిగా అన్యాయం జరిగిందని సమయం సందర్భం వచ్చినప్పుడు అల్లా తన మనసులోని మాటను ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్లారెడ్డి రంగారెడ్డి తో పాటు పార్టీ జిల్లా నేతలు బహిరంగనే విమర్శలు గుప్పిస్తున్నారు. ఇటీవల శంషాబాద్ లో జరిగిన జిల్లా ఆ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో సైతం మల్రెడ్డి రంగారెడ్డికి మంత్రి పదవి కేటాయించాలంటూ ఏకవాక్యంగా పార్టీ నేతలు తీర్మానం చేసిన కాపీని పార్టీ అధిష్టానానికి సైతం పంపారు తెలంగాణ రాష్ట్రానికి తలమానికంగా ఉన్న ప్రపంచ స్థాయిలో ప్రభుత్వం చేపడుతున్న పూర్తి సిటి తమ జిల్లాలోనే ఉందని తమ జిల్లాకు మంత్రివర్గ విస్తరణలో ప్రాధమిథ్యం లేకపోతే ఎలా అంటూ వారు పార్టీ అధిష్టానాన్ని ప్రశ్నించినట్లు సమాచారం రంగారెడ్డి జిల్లాకు మంత్రి పదవి ఇవ్వాల్సిందేనా అంటూ కరాకండిగా నేతలు ఒకే మాటగా చెబుతున్నారు. మంత్రి వర్గ విస్తరణలో తనకు అవకాశం దక్కకపోతే ఎమ్మెల్యే పదవికి సైతం తాను రాజీనామా కు సిద్ధమంటూ ఆయన బెదిరింపులు సైతం దిగారు. ఒకవేళ తనకు మంత్రి పదవి ఇచ్చేందుకు సామాజిక సమీకర ణే అడ్డుగా మారితే తాను స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఏమ్మెల్యే పదవికి రాజీనామా చేసి తన ప్లేసులో బీసీ అభ్యర్థిని ఎమ్మెల్యేగా గెలిపించుకుంటానంటూ అతనికి మంత్రి పదవి కేటాయించా లని సైతం ఆయన బహిరంగంగా డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి చేసిన ఈ కామెంట్ జిల్లాలో ఇది హాట్ టాపిక్ చర్చ నియాంశంగా మారింది. మరోపక్క పార్టీ సీనియర్ నేత జానారెడ్డిని సైతం రంగంలోకి దింపి రంగారెడ్డి జిల్లాకు మంత్రివర్గంలో స్థానం కల్పించాలంటూ అధిష్టానా నికి సైతం లేఖను మద్దతుగా పంపించేలా చేశారు. మంత్రివర్గ విస్తరణలో అధిష్టానం మళ్లీ కదలిక మొదలు కావడంతో గత వారం రోజులుగా మల్రెడ్డి రంగారెడ్డి ఢిల్లీలోనే మకాం వేశారు. తన అంచర వర్గం ని ఢిల్లీకి రప్పించుకొని మంతనాలు సాగిస్తున్నాడు. అధిష్టానం తీసుకునే నిర్ణయాల వల్ల తమ భవిష్యత్తు కార్యాచరణ గురించి వారితో చర్చిస్తున్నట్లు సమాచారం దీంతో మల్రెడ్డి రంగారెడ్డి వ్యవహారం అధిష్టానం కు కొంత తలనొప్పిగా మారినట్లు తెలుస్తుంది. వాస్తవానికి సర్పం స్థాయి నుంచి ఎదిగిన సీనియర్ నేత మల్రెడ్డి రంగారెడ్డి జిల్లా పరంగా చూస్తే మంత్రివర్గంలో ఆయనకు ఖచ్చితంగా అవకాశం కల్పించాల్సి ఉంది. కానీ పార్టీ అధిష్టానం మాత్రం ఏమీ ఆలోచన చేస్తుందో ఎవరికి అంతు పట్టడం లేదు. రంగారెడ్డి జిల్లాలో ఎన్ని నియోజకవర్గాలు ఉంటే ఇబ్రహీంపట్నం,షాద్నగర్, కల్వకుర్తి నియోజకవర్గం సింహభాగం( ఆమనగల్, కడ్తాల, తలకొండపల్లి,మాడుగుల ) కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు మల్రెడ్డి రంగారెడ్డి, వీర్లపల్లి శంకర్, కసిరెడ్డి నారాయణరెడ్డి కాంగ్రెస్ నుంచి గెలుపొందగా.... ఎల్బీనగర్ నుంచి సుధీర్ రెడ్డి మహేశ్వరం నుంచి సబితా ఇంద్రారెడ్డి రాజేంద్రనగర్ నుంచి ప్రకాష్ గౌడ్ చేవెళ్ల నుంచి కాలే యాదయ్య శేర్లింగంపల్లి నుంచి అరికెపూడి గాంధీ లు టిఆర్ఎస్



పార్టీ నుంచి గెలుపొందారు. అయితే మారిన రాజకీయ పరిణామాల కారణంగా వారంతా ఇటీవలనే కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. మంత్రివర్గ విస్తరణ విషయంలో అధిష్టానం జాబితాపై కొలికి వచ్చినట్లు సమాచారం. అయితే రెడ్డి సామాజిక వర్గం విషయంలోనే అధిష్టానం ఎటు తేల్చుకోలేకపోతున్నట్టు పార్టీ పెద్దలు చెప్తున్నారు. పార్టీ సీనియర్ నేత ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి, నల్గొండ జిల్లా నుంచి మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి మధ్య మంత్రివర్గ విషయంలో బిగ్ ఫైట్ నడుస్తుంది ఆది నుంచి మంత్రి పదవిని దక్కించుకునేందుకు ఇరువురు నేతలు సైతం విశ్వ ప్రయత్నాలు సైతం చేస్తూ వస్తున్నారు. బహిరంగల వేదికల మీదనే మంత్రి పదల గురించి వారు తమ అభిప్రాయాలను వ్యక్తం చేయడం పార్టీలో ఆ టాపిక్ గా మారింది.... అధిష్టానం మాత్రం రాజగోపాల్ రెడ్డికి మంత్రివర్గంలో చోటు కల్పించి మల్రెడ్డి రంగారెడ్డికి డిప్యూటీ స్పీకర్ పోస్టు ఇవ్వాలని కొంత ఇంటు ఇచ్చినట్లు తెలుస్తుంది.. తనకు డిప్యూటీ స్పీకర్ పోస్ట్ వద్దు అంటూ తన అనుచరు వర్గం వద్ద మల్రెడ్డి రంగారెడ్డి కొంత అసంతృప్తిని వ్యక్తం చేసినట్లు సమాచారం. తన నిర్ణయాన్ని ఇప్పటికే పార్టీ వ్యవ హారాల ఇన్చార్జి మీనాక్షి నటరాజ్ సీఎం రేవంత్ రెడ్డికి విన్నవించినట్లు తెలుస్తుంది. అధిష్టానం మాత్రం మంత్రి పదవులు అవకాశం లేని వారికి పార్టీ మంచి పొజిషన్ కల్పిస్తామంటూ బుజ్జగింపుల పర్వం ఇప్పటికే స్టార్ట్ చేసినట్లు వార్తలు సైతం చెక్కలు కొడుతున్నాయి. మల్ రెడ్డి రంగారెడ్డి అనుచరులు మాత్రం ఎంతో ధీమాగా ఉన్నారు. తమ నేతకే మంత్రి పదవి దక్కుతుందని మా సార్ బుగ్గ కారు తప్పక ఎక్కుతాడంటూ వారంతా ఎంతో ధీమగా ఉన్నారు. చూడాలి మరి మల్రెడ్డి రంగారెడ్డి విషయంలో పార్టీ అధిష్టానం ఏమి నిర్ణయం

# కారుకు కీ దొరికేనా

హైదరాబాద్, మే 29, (న్యూస్ పల్స్)

మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రస్తుతం బీఆర్ఎస్ లో కీలక నేతగా మారారు. బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మించి హరీశ్ దూసుకు పోతున్నారు. ప్రతి అంశంలో హరీశ్ ముందుంటున్నారు. హరీశ్ జిల్లాల పర్యటనకు వెళు తున్నప్పుడు వచ్చే రెస్పాన్స్ మామూలుగా ఉండటం లేదు. అదే ఇప్పుడు గులాబీ పార్టీలో చర్చనీయాంశంగా మారింది. వరసగా అనేక జిల్లాల్లో ఆయన పర్యటించి వచ్చారు. ఇలా రాష్ట్ర వ్యాప్తంగా హరీశ్‌రావు నాయకత్వంపై గులాబీ పార్టీ క్యాడర్‌లో నమ్మకం పెరుగుతుంది. పార్టీ ఓటమి చెందినా ఏ మాత్రం నిర్లక్ష్యం చేయకుండా కార్యకర్తలకు అండగా ఉండే మాస్ లీడర్ గా హరీశ్ రావు గుర్తింపు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తెచ్చుకున్నట్లుంది. ట్రబుల్ షూటర్ గా కూడా మారారు. బీఆర్ఎస్ పార్టీ తొమ్మిదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు ఆయన కేవలం మంత్రిగానే ఉన్నారు. అప్పుడు పాలన అంతా కేసీఆర్, కేటీఆర్ చేతుల్లోనే నడిచేది. ఇక ఎన్నికల సమయంలో టిక్కెట్లను ఖరారు చేసే సమయంలో కూడా మామ కేసీఆర్ మేనల్లుడు హరీశ్ రావు ప్రతిపాదనలను పెద్దగా పట్టించుకోలేదన్నారు. అంతా కేసీఆర్, కేటీఆర్ ఇష్టారాజ్యంగానే టిక్కెట్ల కేటాయింపు జరిగింది. ఇక రాజ్యసభ, ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికలోనూ హరీశ్‌రావు జోక్యం అనేది ఏమాత్రం తొమ్మిదేళ్ల పాటు జరగలేదు. దీంతో హరీశ్‌రావు తనకు అత్యంత సన్నిహితులు, అనుచరులకు కూడా ఆయన నామినేటెడ్ పదవులు కూడా ఇప్పించుకోలేకపోయారంటారు. ఇక బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కేటీఆర్ ను నియమించినప్పుడు కూడా హరీశ్‌రావు ఒకింత అసంతృప్తికి గురయ్యారని చెబుతారు. అందుకే కేటీఆర్ ఆయన ఇంటికి వెళ్లి మరీ కలసి బావతో మాట్లాడి వచ్చారని చెబుతారు. హరీశ్‌రావు గులాబీ పార్టీకి పెద్ద ఎస్సెట్. అందులో ఏమాత్రం సందేహం లేదు. తెలంగాణ ఉద్యమ సమయం నుంచి మామ



కేసీఆర్ వెన్నంటి ఉంటూ ఆయన చెప్పిన పని చేస్తూ వచ్చిన హరీశ్ రావు తర్వాత మంత్రివర్గంలో చేరినా పెద్దగా పాలనలో జోక్యం లేకుండా చేశారన్న ఆరోపణలున్నాయి. అలాగే పార్టీపై ఆయనకు పట్టు పెంచే పరిస్థితి కూడా లేదు. ఎందుకంటే బీఆర్ఎస్ లో ఆయనకు కీలక పదవి ఏమీ లభించకపోవడమే ఇందుకు కారణం. కానీ హరీశ్‌రావు కేసీఆర్ నాయకత్వాన్ని ఎన్నడూ వ్యతిరేకించలేదు. అధికారం కోల్పోయిన తర్వాత హరీశ్‌రావు మరింతగా పాపులర్ అవుతున్నారు. తాజాగా కవిత ఎపిసోడ్ తర్వాత హరీశ్ రావుకు మరింతగా పార్టీ అధినాయకత్వంలో నమ్మకం పెరిగింది. దాదాపు ఎర్రవెల్లి ఫామ్ హౌస్ కు వెళ్లి హరీశ్ రావు సమావేశమవుతున్నారు. కేవలం కాళేశ్వరం కమిషన్ ఎదుట విచారణకు హాజరయ్యే అంశాలు మాత్రమే కాకుండా రాష్ట్ర రాజకీయ పరిస్థితులను గురించి కూడా చర్చిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై నిత్యం విరుచుకుపడుతూ హరీశ్ రావు బీఆర్ఎస్‌లో ఏ ఘటన జరిగినా హరీశ్ ముందుంటున్నారు. ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్ లో కేసీఆర్, కేటీఆర్‌లను మించి మరింత పదునుగా విమర్శలు ప్రభుత్వంపై చేస్తుండటంతో కారు పార్టీలో హరీశ్ కు ఫ్యాన్స్ మరింత పెరుగుతున్నారు.

## శ్రీవారిని దర్శించుకున్న నటి శ్రీయ

తిరుమల

తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని ప్రముఖ సినీ కథానాయకి శ్రీయ శరణ్ దర్శించుకున్నారు. గురువారం ఉదయం శ్రీవారిని సుప్ర భాత సేవలో దర్శించుకొని ముక్కు లు చెల్లించుకున్నారు. దర్శనానం తరం ఆలయ రంగనాయకుల మండపంలో వేద పండితుల వేద ఆశీర్వచనం అందించారు ఆలయ అధికారులు పట్టు వస్త్రంతో సత్క రించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## ఘనంగా వైఎస్ రాజారెడ్డి శత జయంతి

పులివిందుల

పులివెందులలో రాజారెడ్డి ఘాట్ వద్ద ఏపీ సి సి చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి నివాళులర్పించారు. షర్మిల మాట్లాడుతూ రాజారెడ్డికి ఘనంగా నివాళులు అర్పించాం. రాజారెడ్డి అంటేనే ధైర్యం,సాహసం, పట్టుదల. సాహసానికి మారుపేరు రాజారెడ్డి వైయస్సార్ ను ప్రజా నాయకుడిగా రాజారెడ్డి తీర్చి దిద్దారు, వైయస్సార్ లెజెండ్ అయ్యారు అంటే రాజారెడ్డి ఇచ్చిన ప్రోత్సాహమే. రాజారెడ్డి ఒక ప్రజా నాయకుడు. ప్రజా సమస్యలపై రాజారెడ్డి కి ఎంతో చిత్త శుద్ధి ఉండేది. నేను దగ్గర నుంచి రాజారెడ్డి నీ చూశా. గంటల తరబడి ప్రజల సమస్యలు వినే వాడు. వాటిని పరిష్కారం అయ్యే వరకు నిద్ర పోయే వాడు కాదు. ప్రజల కోసం ఎన్నో విద్యాసంస్థలు కట్టించాడు. ప్రజలకు ఆసుపత్రి కూడా కట్టించి ఇచ్చాడు. ప్రజల కోసం ఇంత చేసిన రాజారెడ్డి ప్రజా నాయకుడు. రాజారెడ్డి బిడ్డలను ఎంతో బాగా చూసుకున్నాడు. తన ఆడబిడ్డలను సైతం ఎంతో బాగా చూసుకున్నాడు. రాజారెడ్డి స్ఫూర్తి మాకు ,నేటి తరానికి ఎంతో ఆదర్శం అని షర్మిలా రెడ్డి అన్నారు

# తెలంగాణలో లేఖల లొల్లి...

హైదరాబాద్, మే 29,

తెలంగాణలో లేఖల రాజకీయం నడుస్తోంది. సాధారణంగా అధికార పార్టీలో ఉన్న నేతలకు ప్రతిపక్ష నేతలు బహిరంగ లేఖలు రాస్తుంటారు. ముఖ్యమంత్రికి, మంత్రులకు ప్రతిపక్ష పార్టీలు ఓపెన్ లెటర్స్ రాయడం మీడియా హైలెట్ అవడం కామన్. కానీ తెలంగాణలో ఇప్పుడు నయా ట్రెండ్ నడుస్తోంది. సొంత పార్టీ నేతలే ఆయా పార్టీల అధినేతలకు లేఖలు రాస్తున్నారు. అధికార పార్టీ, ప్రతిపక్ష పార్టీ అనే తేడా లేకుండా అన్ని పార్టీల నేతలు వారి పార్టీలో ఉన్న సుప్రీం నేతలకు లేఖాస్త్రాలు సంధిస్తున్నారు. ఈ లేఖల్లో విమర్శల కంటే ఎక్కువగా ఆవేదన, తమకు జరుగుతోన్న అన్యాయంపైనే గళమెత్తున్నారు నేతలు. తమ తమ పార్టీల్లో లోటుపాట్లు, క్యాడర్ ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరిస్తూ అగ్రనేతలకు బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ నేతలు లేఖలు రాస్తుండటం ఇంట్రెస్టింగ్‌గా మారింది. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత తన తండ్రి, అధినేత కేసీఆర్‌కు రాసిన లేఖ తెలంగాణలో పాలిటిక్స్‌లో కాక రాజేసింది. డియర్ డాడీ అని సంభాషిస్తూ పార్టీలో జరుగుతున్న విషయాలను అంశాల వారిగా కేసీఆర్‌కు వివరిస్తూ లేఖ రాశారు కవిత. బీఆర్ఎస్ రజతోత్సవ సభలో తాను గుర్తించిన విషయాలను పాజిటివ్, నెగెటివ్‌గా క్యాటగరైజ్ చేసి మరీ కేసీఆర్‌కు లేఖ రాశారామె. పార్టీలో లోటుపాట్లు, క్యాడర్ చర్చించుకుంటున్న అంశాలను కవిత తన లేఖ ద్వారా కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ లేఖ ఇప్పుడు తెలంగాణ పాలిటిక్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది. కాంగ్రెస్ నేతలు సైతం ఏఐసీసీ పెద్దలకు తరచూ లేఖలు రాస్తుంటారు. ముఖ్యంగా పార్టీ చీఫ్ ఖర్గే, అగ్రనేతలు సోనియా, రాహుల్, ప్రియాంక గాంధీలకు రాష్ట్ర నేతలు లెటర్లు రాయడం కామనే. లేటెస్ట్‌గా పార్టీ పెద్దలకు తెలంగాణ నుంచి పలువురు నేతలు లేఖలు రాశారట. సీఎం, పీసీసీ చీఫ్‌లను పదే పదే ఢిల్లీకి పిలవడంపై తెలంగాణ కాంగ్రెస్ నేతల అసహనం వ్యక్తం చేస్తూ ఢిల్లీ పెద్దలకు లేసినట్లు తెలుస్తోంది. ఏఐసీసీ తీసుకునే నిర్ణయాలు ఆలస్యమైతే పార్టీ ఎలా నడుస్తుందని ఆవేదన వ్యక్తం చేశారట. రాహుల్ గాంధీ, ఖర్గే, కేసీ వేణుగోపాల్, ప్రియాంక గాంధీ, మీనాక్షీ నటరాజన్‌లకు తెలంగాణకి సంబంధించిన పలు అంశాలను లేఖ రూపంలో రాస్తూ మెయిల్ చేసినట్లు పలువురు తెలంగాణ కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. పార్టీ ఆలస్యంగా నిర్ణయాలు తీసుకోవడం వల్ల పార్టీ నేతలు, ఆశావాహులు నిరాశకు గురవుతున్నారని..ఇప్పటిదాకా పదులసార్లు తెలంగాణ నేతలను ఢిల్లీకి పిలిచి మంత్రివర్గాన్ని విస్తరించకపోవడం ఏంటని ప్రశ్నిస్తూ లేఖ రాశారట. పార్టీ కమిటీలను ఆలస్యం చేస్తే గ్రేటర్, స్థానిక ఎన్నికలపై ఎఫెక్ట్ పడుతుందని, ప్రభుత్వం ఏర్పాటై 17 నెలలు దాటినా కార్పొరేషన్ ఛైర్మన్లను ప్రకటించకపోవడం పట్ల కూడా లేఖలో అసంతృప్తి వెళ్లగక్కారట. ప్రభుత్వం ఏర్పాటైన మొదట్లోనే కార్పొరేషన్, నామినేటెడ్ పోస్టులు భర్తీ చేస్తే ఇప్పటికి చాలామందికి అవకాశం వచ్చేదని లేఖలో పేర్కొన్నట్లు సమాచారం. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పెద్దలకు కూడా రాష్ట్ర బీజేపీ నేతలు తరచూ లేఖలు రాస్తుంటారు. కాకపోతే బీజేపీ నేతలు రాసే లేఖలు బయటికి రావు. అధ్యక్షుడి ఎంపిక విషయంలో ఒకరి మీద మరొకరు అధిష్టానంకు ఇంటర్నల్‌గా లేఖలు రాసిన సందర్భాలు ఉన్నాయ్. అంతేకాదు ఆయనకు ప్రెసిడెంట్ పోస్ట్ ఇస్తే ఈ నష్టమని..ఈయనకు పదవి కోసం ఆ నష్టమని..అన్నీ లేఖల్లోనే వివరించారట కమలం లీడర్లు. రాజాసింగ్ లాంటి నేతలైతే తాను పార్టీ హైకమాండ్‌కు చెప్పాల్సిన విషయాలను సోషల్ మీడియాలోనే పెడుతున్నారు. మొత్తం మీద తెలంగాణలో అన్ని ప్రధాన పార్టీలలో లేఖాస్త్రం ట్రెండింగ్‌లో ఉంది. అన్ని పార్టీలలో ఇప్పుడు ఇదే ట్రెండ్ నడుస్తుంది.

# రాజీవ్ యువ వికాసం లబ్దిదారులకు జూన్ 2న మంజూరీ పత్రాలు

### -మొదటగా రూ. 50 వేలు, రూ. లక్ష లోపు కేటగిరీల వారికి అందజేత
### -లబ్దిదారులు యూనిట్లు స్థాపించి ఆర్థిక పురోగతి సాధించేలా పర్యవేక్షణ
### -కలెక్టర్లతో వీ.సీలో డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క వెల్లడి





సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, మే 29: యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకం కింద ఎంపికైన లబ్దిదారులకు రాష్ట్ర అవతరణ దినోత్సవమైన జూన్ 2న మంజూరీ పత్రాలు (ప్రొసీడింగ్స్) అందజేయడం జరుగుతుందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావులతో కలిసి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాజీవ్ యువ వికాసం పథకంపై సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కేటగిరీలను కలుపుకుని రాజీవ్ యువ వికాసం పథకానికి 1623764 దరఖాస్తులు వచ్చాయని అన్నారు.ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఎంపిక చేసిన లబ్దిదారులకు జూన్ 02 వ తేదీ నుండి మంజూరీ పత్రాలు అందజేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. జూన్ మాసంలో రూ. 50 వేలు, రూ. లక్ష లోపు సబ్సిడీ రుణ కేటగిరీలలోని సుమారు 85 వేల మంది లబ్దిదారులకు మొదటగా మంజూరీలు తెలుపడం జరుగుతుందని అన్నారు. అన్ని జిల్లాలలో అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా మంజూరీ ప్రత్రాల పంపిణీకి ఏర్పాట్లు చేయాలని కలెక్టర్లకు సూచించారు.మంజూరీలు తెలుపబడిన లబ్దిదారులకు జూన్ 10 నుండి 15వ తేదీ వరకు యూనిట్ల స్థాపన, నిర్వహణ, మార్కెటింగ్, తదితర అంశాలపై శిక్షణ ఉంటుందని తెలిపారు. జూన్ 16 నుండి 20 వ తేదీ వరకు సబ్సిడీ మొత్తాలను విడుదల చేస్తారని, 21 నుండి 30 వ తేదీ వరకు యూనిట్ల గ్రౌండింగ్ జరిగేలా పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఈ షెడ్యూల్ ను అనుసరిస్తూ జులై మాసంలో లక్ష నుండి రెండు లక్షల రూపాయల లోపు కేటగిరీకి చెందిన సుమారు లక్ష మంది లబ్దిదారులకు, ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ మాసాలలో రెండు లక్షల నుండి 4 లక్షల కేటగిరీకి చెందిన మరో మూడు లక్షల పైచిలుకు మంది లబ్దిదారులకు మంజూరీలు తెలుపడం జరుగుతుందని వివరించారు. ఐదు విడతలలో ఐదు లక్షల మంది లబ్దిదారులకు రాజీవ్ యువ వికాసం పథకం కింద ప్రభుత్వం సబ్సిడీ రూపంలో 6260 కోట్ల రూపాయలను, బ్యాంకు లింకేజీ కింద 1667 కోట్ల రూపాయలను కలుపుకుని సుమారు 8 వేల కోట్ల రూపాయలను వెచ్చిస్తోందని తెలిపారు.దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రతి లబ్ధిదారుడు తప్పనిసరిగా యూనిట్లను స్థాపించుకుని ఆర్థిక పురోగతి సాధించేలా పక్కా ప్రణాళికతో వ్యవహరించాలని సూచించారు. స్థానిక పరిస్థితులు, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా లబ్ధిదారులు యూనిట్లు ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించాలని హితవు పలికారు. మంజూరు చేసిన యూనిట్ల స్థాపన అనంతరం వాటి పనితీరు, నిర్వహణ తీరుతెన్నులను పర్యవేక్షించేందుకు జిల్లాలో మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేయాలని అన్నారు. మే 29, 30 తేదీలలో జరిగే ఇంచార్జి మంత్రుల సమావేశాలలో రాజీవ్ యువ వికాసం పై చర్చించి తుది జాబితా ఆమోదం చేయాలని అన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, రాజీవ్ యువ వికాసం పథకం నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని, లబ్దిదారులు ఎవరూ ఆందోళన పడాల్సిన అవసరం లేదని అన్నారు. ప్రస్తుతం ఎంపిక చేసే లబ్దిదారులకు పూర్తి అవగాహన కల్పించిన తర్వాత యూనిట్ గ్రౌండింగ్ పై దృష్టి పెట్టాలని అన్నారు.ప్రభుత్వం వెచ్చించే నిధులు పూర్తి స్థాయిలో సద్వినియోగం కావాలని, ఒక ప్రాంతంలో ఒకే తరహా యూనిట్లు ఎక్కువ సంఖ్యలో స్థాపించినట్లైతే లబ్ధిదారుల మధ్య పోటీ విపరీతంగా నెలకొనే అవకాశం ఉన్నందున వేర్వేరు యూనిట్లు నెలకొల్పేలా చూడాలన్నారు.ఇటుకల తయారీ, సెంట్రింగ్ వంటి వాటికి ముందుకు వచ్చే వారికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టర్ క్రాంతి వల్లూరు అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ , ఎస్సీ కార్పొరేషన్ అధికారి రామాచారి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి అఖిలేష్ రెడ్డి బీసీ సంక్షేమ శాఖ అధికారి జగదీష్, మైనారిటీ సంక్షేమ అధికారి దేవుజా,లీడ్ బ్యాంక్ మేనేజర్ నర్సింగ రావు తదితరులు పాల్గొన్నారు.

# గండికోటను అద్భుత పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతాం: గండికోట పరిశీలనలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని





కడప, భారత శక్తి ప్రతినిధి, మే 29:"గండికోట ను ఒక అద్భుతమైన పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నాం. అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోని గండికోటకు సుమారు 78 కోట్ల పర్యాటక శాఖ నిధులను కేటాయించాం." అని గ్రామీణాభివృద్ధి కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ గారు మాట్లాడారు. జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి గారితో కలిసి పెమ్మసాని గారు గండికోట ప్రాంతాన్ని గురువారం పరిశీలించారు. శిథిలమైన నిర్మాణాలను, అద్భుతమైన శిల్పకళ నైపుణ్యాన్ని పరిశీలించిన ఆయన ఈ ప్రాంతాన్ని మరో గ్రాండ్ కెన్యాన్ గా పర్యాటక అభివృద్ధి దిశగా నడిపించాలని అన్నారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ.."జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి గారికి, జమ్మలమడుగు ప్రాంతీయులకు, గండికోట స్థానికులకు ముందుగా నా కృతజ్ఞతలు. శ్రీకృష్ణదేవరాయలు గారి హయాంలో భారతదేశం మొత్తం పై దండయాత్రలు జరిగినా గండికోటను మాత్రం శత్రువులు చేదించలేకపోయారు. దాదాపు 200 ఏళ్లకు పైగా మనవాళ్లు ఈ కోటను, విజయనగర సామ్రాజ్యాన్ని కాపాడారు. అందులో ప్రధాన పాత్ర పోషించిన చీఫ్ కమాండర్ పెమ్మసాని రామలింగ నాయుడు గారు కవచంలా నిలబడ్డారు. 1350వ సంవత్సరం నుంచి 1550వ సంవత్సరం వరకు అనేకమంది ఈ గండికోటను శత్రు దుర్భేధ్య కోటగా నిర్మించడంతో పాటు పాలించారు. విజయనగర సామ్రాజ్య యుద్ధాలలో మెలకువలు తెలిసిన సైనికులను తయారు చేయడంలోను, సైనిక శిక్షణ ఇవ్వడంలోనూ ఈ ప్రాంతం పేరుగాంచింది. శత్రువు కోట లోపలకు అడుగు పెట్టడానికి వీలు లేకుండా అప్పట్లోనే అద్భుతమైన ఆర్కిటెక్చర్ తో ఈ కట్టడాలు నిర్మించారు. బహుమనీ సుల్తాన్లు సైతం కోటలోకి వచ్చేందుకు రెండు - మూడు నెలలు ప్రయత్నించి చివరకు చేతగాక విషం పెట్టి గండికోట నాయకులను చంపారు. అప్పుడు మాత్రమే ఈ కోటను చేజిక్కించుకోగలిగారు. శ్రీకృష్ణదేవరాయలు అనంతరం ఇక్కడి కట్టడాలు బాగా పాడుబడ్డాయి. ఇంతటి ఘన చరిత్ర, మన భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత అందరిపై ఉంది. నాతోపాటు ఎన్నారై టీడీపీ సీనియర్ నాయకులు కోగంటి జయరాం గారు కూడా ఉన్నారు. మేమిరువురం కలిసి ప్రపంచంలోని ఎన్నో ప్రాంతాలను సందర్శించాము. అమెరికాలోని గ్రాండ్ కెన్యాన్ కూడా ఇలాగే ఉంటుంది. కానీ అక్కడ గ్రాండ్ కెన్యా న్ కి గండికోటలో లాగా నది ప్రవాహం ఉండదు. ప్రకృతి అద్భుత నిర్మితమైనటువంటి కొండలు ఉన్నటువంటి ఈ ప్రాంతాన్ని అద్భుతంగా అభివృద్ధి చేయవచ్చు. ఈ ప్రాంతం మా పూర్వీకుల కు చెందినది కాబట్టి అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోని ఈ ప్రాంత అభివృద్ధి కోసం కృషి చేశాము. కేంద్ర టూరిజం శాఖ మంత్రితో మాట్లాడి సుమారు రూ. 78 కోట్ల నిధులను గండికోట అభివృద్ధి కోసం కేటాయింపు చేసుకున్నాము. కాంట్రాక్ట్ టెండర్లని తుది దశలో ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. ఎమ్మెల్యే గారు కూడా చొరచూపి పనులు త్వరగా పూర్తయ్యేలా చేస్తామని భరోసా ఇచ్చారు. ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు శ్రీకృష్ణదేవరాయలు 100 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని కూడా ప్రకటించారు. కూటమి ప్రభుత్వం రాయలసీమ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ, అభివృద్ధికి సహకరిస్తుంది అనడానికి ఇదే నిదర్శనం. జగన్మోహన్ రెడ్డి గారు ఐదేళ్లు ముఖ్యమంత్రిగా ఉండి ఈ ప్రాంతానికి అసలు ఏం చేశారు? పర్యాటకపరంగా కూడా కనీసం ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయలేకపోయారు. రాయలసీమ ప్రజలు అందరూ ఇది గుర్తుపెట్టుకుని కూటమి ప్రభుత్వానికి అండగా ఉంటారని ఆశిస్తున్నాను." అని మాట్లాడారు. ఈ పరిశీలనలో స్థానిక టిడిపి, బిజెపి, జనసేన నాయకులు కూడా పాల్గొన్నారు.

# పర్యాటక ప్రదేశాలలో యోగాభ్యాసం"

కడప, మే 29(భారత శక్తి) : యోగాంధ్ర 2025లో భాగంగా, "ఒకే భూమి, ఒకే ఆరోగ్యం" అనే నినాదంతో వైఎస్ఆర్ కడప జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రదేశాలలో యోగాభ్యాసం నిర్వహిస్తున్నట్లు జిల్లా పర్యటక శాఖ ఇంచార్జి అధికారి సురేష్ కుమార్ పేర్కొన్నారు.

జూన్ 21వ తేదీన ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని.. కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో నిర్వహిస్తున్న మాసోత్సవాల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్ర -2025 కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యతతో నిర్వహిస్తోందన్నారు. అందులో భాగంగా ఈ కార్యక్రమం ఉదయం 6 గంటల నుండి 8 గంటల వరకు జరుగుతుంది.

కార్యక్రమ వివరాలు క్రింద ఇవ్వబడ్డాయి:

1. మే 30, 2025: ఒంటిమిట్ట దేవాలయ ప్రాంగణంలో, దక్షిణ ద్వారము ఉద్యానవనం
2. జూన్ 5, 2025: సిద్దవటం కోట వద్ద
3. జూన్ 12, 2025: శిల్పారామంలో
4. జూన్ 18, 2025: గండికోట కోట/లోయ వద్ద

ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయవలసిందిగా కోరుతున్నాము.

# టీడీపీ కార్యకర్త కిరణ్ కుమార్ కు అండగా ఉంటాం:జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత



కడప, భారత శక్తి ప్రతినిధి, మే 29: విద్యుద్ఘాతానికి గురైన టీడీపీ కార్యకర్త కిరణ్ కుమార్ రెడ్డిని అన్ని విధాలా ఆదుకుంటామని జిల్లా ఇన్చార్జి మంత్రి, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టంచేశారు. నగరంలోని ఓ ప్రైవేటు సూపర్ స్పెషాల్టీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కిరణ్ కుమార్ ను కమలాపురం ఎమ్మెల్యే చైతన్య రెడ్డితో కలిసి ఇన్చార్జి మంత్రి సవిత గురువారం పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును కిరణ్ కుమార్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. కిరణ్ కుమార్ రెడ్డి ఆరోగ్య పరిస్థితి, అందిస్తున్న వైద్య సేవల గురించి ఆసుపత్రి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. కుమారుడు విద్యుత్ షాక్ కు గురికావడంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న కిరణ్ కుమార్ రెడ్డి తల్లిని మంత్రి సవిత ఓదార్చారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ అన్ని విధాలా అండగా ఉంటారని భరోసా ఇచ్చారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడారు. మూడ్రోజుల కిందట తన ఇంటిపై టీడీపీ జెండా కడుతుండగా, కిరణ్ కుమార్ విద్యుద్ఘాతానికి గురయ్యాడని మంత్రి తెలిపారు. విషయం తెలుసుకున్న వెంటనే మంత్రి నారా లోకేశ్ తీవ్ర ఆవేదనకు గురయ్యారన్నారు. తక్షణమే వెళ్లి కార్యకర్తను పరామర్శించాలని లోకేశ్ ఆదేశించినట్లు మంత్రి సవిత తెలిపారు. విద్యుద్ఘాతం వల్ల కిరణ్ కుమార్ తీవ్రంగా గాయపడ్డారని తెలిపారు. ప్రస్తుతం కిరణ్ కుమార్ కు మెరుగైన వైద్యమందిస్తున్నామన్నారు. ఇంకా అవసరమైతే మరింత వైద్య సేవల కోసం వేరే ఆసుపత్రికి తరలించే ఆలోచన చేస్తున్నామన్నారు. టీడీపీ కార్యకర్త కిరణ్ కుమార్ కుటుంబానికి పార్టీ అధిష్టానం అండగా ఉంటుందని, అన్ని విధాలా ఆదుకుంటామని మంత్రి సవిత భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కమలాపురం ఎమ్మెల్యే చైతన్య రెడ్డి, పలువురు టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# టీజేఎఫ్ రజతోత్సవ సభకు తరలిరండి.

## ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో వాల్ పోస్టర్ ఆవిష్కరణ



వేములవాడ,మే 29, (భారత శక్తి) : తెలంగాణ కోసమే తెలంగాణ జర్నలిస్టులు అనే నినాదంతో ఆవిర్భవించిన తెలంగాణ జర్నలిస్ట్ ఫోరమ్ 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మీడియా అకాడమీ మాజీ చైర్మన్, టీజేఎఫ్ వ్యవస్థాపకులు అల్లం నారాయణ ఆధ్వర్యంలో ఈ నెల 31 శనివారం రోజున హైదరాబాద్ జలవిహార్ లో నిర్వహిస్తున్న రజతోత్సవ సభనకు రాజన్న సిరిసిల్ల జిల్లా నుండి జిల్లా నుంచి జర్నలిస్టులు పెద్ద ఎత్తున తరలిరావాలని టియూడబ్ల్యూజే (హెచ్ 143) జిల్లా అధ్యక్షులు లాయక్ పాషా పిలుపునిచ్చారు. వేములవాడ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు మొహమ్మద్ రఫీక్ తో కలిసి వాల్ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ కోసమే తెలంగాణ జర్నలిస్టులు అనే నినాదంతో ఆనాటి సీనియర్ పాత్రికేయులు అల్లం నారాయణ నాయకత్వంలో తెలంగాణ జర్నలిస్టు ఫోరం ఏర్పాటు చేసుకొని జర్నలిస్టులు తెలంగాణ ఉద్యమంలో కీలక భూమిక పోషించి స్వరాష్ట్రాన్ని సాధించుకున్నామన్నారు. స్వరాష్ట్ర సాధన కోసం ఆనాడు ఏర్పడిన తెలంగాణ జర్నలిస్టుల ఫోరం 25వ వసంతంలోకి అడుగుపెట్టిన సందర్భంగా అల్లం నారాయణ నాయకత్వంలో తెలంగాణ జర్నలిస్టుల ఫోరం రజతోత్సవ సభను హైదరాబాద్ జల విహార్ ఆడిటోరియంలో మే 31, 2025న ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నారని,ఈ సభను విజయవంతం చేయడానికి జిల్లా నుంచిఉ పెద్ద ఎత్తున జర్నలిస్టులు కదలి రావాలని వారు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి ఆయాచితుల జితేందర్, ఉపాధ్యక్షులు సయ్యద్ అలీ, జిల్లా రమేష్, దేవరాజ్, ప్రచార కార్యదర్శి షేక్ రియాజ్, కోడం గంగాధర్, హరీష్, విష్ణు, రాజేందర్, చౌటుపల్లి వెంకటేష్, దెబ్బేటి ప్రవీణ్, ఆసిమొద్దీన్, సంతోష్, అజారుద్దీన్,ఇమ్రాన్, ఫహద్ పాషా, సల్మాన్, శ్యామ్, షోయబ్ లతోపాటు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# పిసిసి ఆదేశాల మేరకు కామారెడ్డి నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం



(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, మే 29: గురువారం పిసిసి ఆదేశాల మేరకు కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాసరావు అధ్యక్షతన కామారెడ్డి నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిలుగా జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, జిల్లా ఇన్చార్జ్ అబ్జర్వేర్ లు, సత్యనారాయణ గౌడ్, వేణుగోపాల్ యాదవ్ లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ,అభివృద్ధి చేయడంలో పోటీపడాలే తప్ప అడ్డుకోవడంలో కాదు కామారెడ్డి అభివృద్ధికి ముందుండి కలిసి రావాలి తప్ప అడ్డు కోవడానికి ముందు కాదు.ఈరోజు రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం కుల గణన నిర్వహించి దేశానికే ఆదర్శంగా నిలిచింది.ప్రజలు మనల్ని నాయకులుగా ఉన్నందుకు ప్రజల సమస్యలు తీర్చడానికే ఎక్కువ సమయం ఇవ్వాలని, అప్పుడే ప్రజా నాయకులం అవుతాం తప్ప పదవుల కోసం పాకులాడితే కుదరదని అన్నారు.ఈరోజు బీజేపీ రాష్టానికి చేసిందేమీ లేదు. ప్రజలను రెచ్చగొట్టి అధికారం లోకి రావాలని చుస్తుంది తప్ప ప్రజలకోసం పనిచేయడం లేదు,పెహల్ గావ్ లో ఉగ్రవాదులు దాడీ చేసి అమాయకులను పొట్టన పెట్టుకుంటే కాంగ్రెస్ పార్టీ పాకిస్తాన్ ఉగ్రవాదంపై ఎలాంటి చర్యతీసుకున్న కేంద్రానికి అండగా ఉంటామని మా అధిష్ఠానం మద్దతు తెలిపిందని అన్నారు.డొనాల్డ్ ట్రంప్ ఫోన్ చేసాడని కాల్పులు విరమించి వెనక్కి తగ్గి మాసైనికుల ఆత్మ స్థైర్యని దెబ్బ తీశారు.1971 అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ పరాయి దేశాలు మా అంతర్గత విషయాల్లో జోక్యం చేసుకోవద్దని ఎవరికి తలొగ్గకుండా యుద్ధం చేసి 95వేల పాక్ సైనికులను బందీ లను చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీది ఇందిరా గాంధీ ది అన్నారు.ఇవన్నీ మనం ప్రజలకు చెప్పాలి.చిన్న చిన్న గొడవలు పక్కన పెట్టీ రాబోయే ఎన్నికల్లో ముందుకు వెళ్ళాలి.ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ,ప్రపంచ దేశాల ముందు భారత్ పరువు తీసిన మోడీ అమెరికా ఆదేశించిందని మన ఆడబిడ్డల సింధూరాన్ని తుడిచిన వారిని ఆపరేషన్ సింధూర్ తో బుద్ధి చెప్పకుండా మధ్యలో నిలిపేశాడు. ప్రజలకు సేవ చేసే విధంగా కాంగ్రెస్ నాయకులు లక్ష్యం పెట్టుకోవాలి.యంత్రాంగంలో జరిగే తప్పులను సరిచేస్తూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలి,చిన్న చిన్న గొడవలకు వివాదాలు చేస్తే పార్టీ నుండి సస్పెండ్ చేస్తాము.కార్యకర్తలు ఐక్యంగా ఉంటే అందరికీ పదవులు ఇచ్చే విధంగా కృషి చేస్తాం,ఇన్ని రోజులు కార్యకర్తలు మన గెలుపు కోసం కష్టపడ్డారు, ఇప్పుడు వారి రుణం తీర్చుకోవడానికి సమయం ఆసన్నమైంది వారికోసం పనిచేసి వారిని గెలిపించి నాయకులుగా తీర్చిదిద్దుతాం.అందరూ పార్టీ సమావేశాలు తప్పకుండా రావాలి,ఏఐసీసీ ఆదేశాలు మేరకు గ్రామ,మండల,బ్లాక్ కమిటీలు ఏర్పాటుకు అందరూ సహకరించాలి.కార్యకర్తలకు బాధ్యతలు,పదవులు ఇవ్వడమే మా లక్ష్యం,భూ భారతీ ద్వారా రైతుల సమస్యలు పరిష్కరిస్తున్నాము.కెసిఆర్ డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పేరుతో కమిషన్లు తిన్నారు.కానీ కాంగ్రెస్ ప్రభుత్వం నియోజకవర్గానికి 3500 ఇళ్లు ఇస్తుంది.ఒక్కొక నియోజకవర్గానికి 10000 ఇల్లు ఇవ్వడానికి ప్రణాళిక సిద్ధంగా ఉందని అన్నారు.మన వాళ్ళు వేరే వాళ్ళు అనే తేడా లేకుండా ప్రతి పేదవాడికి ఇల్లు అందిస్తాం. ఇల్లు నిర్మాణ పనులను బట్టి నిధులు మంజూరు అవుతాయి జై బాపు జై భీం జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమము గ్రామ గ్రామాన తీసుకు వెళ్తున్నారు. ఈ కార్యక్రమాన్ని ఇంకా గట్టిగా ప్రజల్లోకి తీసుకుపోవాలి,పార్టీ లేకుంటే కండువా లేకుంటే మనకు అవకాశం ఇచ్చేది ఎవరు.రాబోయే ఎన్నికల్లో పార్టీ బలంగా నిలబడాలంటే ముందుగా మన ప్రభుత్వం అధికారంలో ఉండాలి.కావున మనలో మనం కలిసి ఉండాలి,పాత కొత్త అనే తేడా ఉండకూడదు. పార్టీని బలోపేతం చేయాల్సిన బాధ్యత మనందరిపైన ఉంది.ఎవరైతే కింది స్థాయిలో పార్టీ జెండా మోసి బలోపేతానికి పనిచేశారో వారిని గుర్తించి వారికి పదవులు ఇస్తాం.క్రమశిక్షణ కలిగిన వారికే పార్టీ పదవులు వస్తాయి.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అనుబంధ సంఘాల ప్రెసిడెంట్లు మండల అధ్యక్షులు గ్రామ అధ్యక్షులు మాజీ జెడ్పిటిసి లు మాజీ ఎంపీటీసీలు సర్పంచులు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేయాలి:డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క




## -జూన్ 3 నుంచి జూన్ 20 వరకు అన్ని మండలాల్లో రెవెన్యూ సదస్సుల నిర్వహణ
## -ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులను పారదర్శకంగా ఎంపిక చేయాలి
## -వానాకాలం పంట సాగుకు ఎరువులు, విత్తనాల కొరత రాకుండా చర్యలు
## -నకిలీ విత్తనాలు అమ్మే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.






ఖమ్మం ప్రతినిది (భారత శక్తి న్యూస్ ), మే 29:ప్రజా సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేయాలని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. గురువారం ఇందిరమ్మ ఇళ్లు, భూ భారతి, ధాన్యం కొనుగోలు, వర్షాకాల ఆరోగ్య కార్యాచరణ ప్రణాళిక, వ్యవసాయ శాఖ ముందస్తు సాగు వంటి పలు అంశాలపై ఖమ్మం జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇంచార్జ్ మంత్రి, రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళీ శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు, రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఖమ్మం ఎంపి రామసహాయం రఘురాం రెడ్డి, ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలోని ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు, జిల్లా కలెక్టర్లతో కలిసి సమీక్షించారు.సమీక్ష లో డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ నకిలీ విత్తనాలు అమ్మే వారి పై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. నకిలీ విత్తనాల కారణంగా రైతులు పెట్టే లక్షల రూపాయల పెట్టుబడి, వారి కష్టం వృధా అవుతుందని అన్నారు. నకిలీ విత్తనాలు అరికట్టేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి అవసరమైన సహకారం తీసుకోవాలని డిప్యూటీ సీఎం తెలిపారు. నకిలీ విత్తనాలు అమ్మే వారికి పుట్టగతులు లేకుండా చేయాలని అన్నారు.ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలో రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు చేసి రైతులకు చెల్లింపులు కూడా పూర్తి చేశామని అన్నారు. 5 లక్షల రూపాయలతో పేదలకు ఇండ్లు కట్టించే పథకం దేశంలో ఎక్కడా లేదని, ఒకేసారి 3 వేల 500 ఇండ్లు మంజూరు చేయడం చాలా సాహసోపేతమైన నిర్ణయమని అన్నారు. 22 వేల 500 కోట్లతో 4 లక్షల 50 వేల ఇండ్లు ప్రభుత్వం మంజూరు చేస్తుందని, లబ్దిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి పారదర్శకంగా జరగాలని అన్నారు.మనిషికి భూమికు ఉన్న అనుబంధం గత ప్రభుత్వం ధరణి పేరుతో చాలా ఇబ్బందులకు గురి చేసిందని అన్నారు. భూ భారతి చట్టంతో ప్రజలకు ఉన్న భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం తెలిపారు. ప్రజలకు భూ భారతి చట్టంపై అవగాహన కల్పిస్తూ మండలాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని అన్నారు. జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించాలని అన్నారు. ప్రభుత్వం ద్వారా ప్రజలకు అందే వివిధ పథకాలు వివరించాలని అన్నారు. ఉదయం జాతీయ పతాకావిష్కరణతో పాటు సాయంత్రం అసెంబ్లీ నియోజకవర్గం హెడ్ క్వార్టర్ లో వేడుకలు నిర్వహణ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు.త్రాగునీటి సరఫరా ఇబ్బందులు రాకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉండాలని అన్నారు. ఆసుపత్రి నిర్వహణ పకడ్బందీ ఉండాలని, అవసరమైన మందుల స్టాక్ పంపుతున్నామని, ప్రతి నెలా ఆరోగ్య శ్రీ, డ్రగ్స్ చెల్లింపులు పూర్తి చేస్తున్నామని అన్నారు.సమీక్ష లో ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇంచార్జ్ మంత్రి, రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖల మంత్రివర్యులు కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూలి నకిలీ విత్తనాల పై తీసుకుంటున్న చర్యలు వెంటనే పత్రికలు, మీడియా ద్వారా ప్రజలకు తెలియజేయాలని అన్నారు. పైలెట్ ప్రాజెక్టు క్రింద మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులను ర్యాండమ్ గా చెక్ చేయాలని, అర్హులకు మాత్రమే ఇందిరమ్మ ఇళు చేరాలని మంత్రి సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల ప్రొసిడింగ్స్ మంజూరు చేయడంతో పాటు నిర్మాణ పనులు పురోగతిని కూడా నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాలు బాగా జరుగుతున్నాయని, ఈ సంఖ్య మరింత పెరగాలని అన్నారు. రుతుపవనాలు ముందుగా వచ్చిన నేపథ్యంలో వానాకాలం పంట సాగుకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందు బాటులో పెట్టాలని అన్నారు. రాష్ట్రంలోని పేదలకు సన్న బియ్యం సరఫరా చేస్తున్నామని, ఆర్థిక వ్యవస్థ బాగు చేస్తూ ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు చేస్తున్నామని అన్నారు. యంగ్ ఇండియా సమీకృత గురుకులాల నిర్మాణం పనులు 200 కోట్లతో ప్రభుత్వం మంజూరు చేసిందని అన్నారు. సమీక్ష లో వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళీ శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ ఎరువుల, విత్తనాల కొరత రాకుండా జిల్లాలో పటిష్టమైన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత కలెక్టర్లపై ఉంటుందని అన్నారు. స్టాక్ వివరాలను రెగ్యులర్ గా మానిటర్ చేస్తూ ప్రతి మండలంలో అవసరమైన అన్ని రకాల విత్తనాలు, ఎరువుల స్టాక్ అందుబాటులో ఉండాలని అన్నారు. సమీక్ష లో లిలిరెవెన్యూ , హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ, అసైన్మెంట్ భూములలో పొజిషన్ లో ఉన్న నిరుపేదలకు పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వం ఆలోచన ఉందని, వీటికి సంబంధించి ప్రతిపాదనలు ఉంటే సమర్పించాలని అన్నారు. సాదా బైనామా సంబంధించి ప్రభుత్వ భూములకు కూడా కొంతమంది దరఖాస్తులు చేసుకున్నారని, వీటిని తక్షణమే తిరస్కరించాలని మంత్రి ఆదేశించారు. హై కోర్టు నుంచి స్టే తొలగిన వెంటనే అర్హత ఉన్న సాదా బైనామాలను పరిష్కరిస్తామని అన్నారు. జూన్ 3 నుంచి జూన్ 20 వరకు అన్ని రెవెన్యూ గ్రామాలలో తహసిల్దార్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి, ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని మంత్రి ఆదేశించారు. దేశంలో ఎక్కడా పేదలకు ఇంటి నిర్మాణానికి 5 లక్షల రూపాయలు ఇవ్వడం లేదని, లబ్దిదారులను పూర్తి పారదర్శకంగా, నిరు పేదలను ఎంపిక చేయాలని అన్నారు. ఒత్తిడులకు లోనై అనర్హులకు ఎక్కడైనా ఇండ్లు మంజూరు చేస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు పెట్టుబడి సొమ్ము లేకపోతే మహిళా సంఘాల ద్వారా రుణాలు మంజూరు చేయాలని మంత్రి తెలిపారు. జూన్ 10 లోపు పైలెట్ ప్రాజెక్టు క్రింద మంజూరు చేసిన ఇండ్లు గ్రౌండింగ్ పూర్తి కావాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు కోసం అవసరమైన ఇసుక లబ్దిదారులకు టోకెన్ ద్వారా ఉచితంగా అందించాలని, ఇందిరమ్మ ఇండ్ల పేరిట అక్రమ ఇసుక రవాణా జరగకుండా జాగ్రత్త వహించాలని అన్నారు. ఇంటి నిర్మాణం పరికరాల ధరల నియంత్రణ కు కలెక్టర్ లు చర్యలు తీసుకోవాలని అన్నారు. సగం దశలో మిగిలిపోయిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను కూడా పూర్తి చేయాలని మంత్రి సూచించారు. నీటి పారుదల శాఖ పరిధిలో పెండింగ్ ఆపరేషన్ అండ్ మేయింటెనెన్స్ పనులు ప్రాధాన్యత క్రమంలో చేపట్టి పూర్తి చేయాలని మంత్రి సూచించారు. పేదల సంతోషం కోసం ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. ఎంపి రామ సహాయం రఘురాం రెడ్డి మాట్లాడుతూ తడిచిన ధాన్యాన్ని రైతుల వద్ద నుంచి కొనుగోలు చేయాలని కోరారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు ఉన్న సందేహాలను మంజూరు పత్రాల పంపిణీ సమయంలో నివృత్తి చేయాలని అన్నారు. ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో ప్రస్తుత యాసంగి సీజన్ లో ఎన్నడూ లేని విధంగా పెద్ద ఎత్తున ధాన్యం కొనుగోలు చేశామని, లక్షా 21 వేల మెట్రిక్ సన్న రకం ధాన్యం, 95 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి బోనస్ తో సహా చెల్లింపులు పూర్తి చేశామని అన్నారు. వరంగల్, హన్మకొండ ప్రాంతాల్లో కూడా రైస్ మిల్లులకు అలాట్మెంట్ చేశామని అన్నారు. సన్న రకం ధాన్యంకు బోనస్ ప్రకటించడంతో ఖమ్మం జిల్లాలో సాగు పెరిగిందని, రాబోయే వానాకాలం పంట దాదాపు 6 లక్షల ఎకరాలకు పైగా సాగు జరుగుతోందని, రైతులకు నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉండేలా పర్యవేక్షిస్తున్నా మని కలెక్టర్ తెలిపారు. ఎక్కడా కల్తీ విత్తనాల విక్రయం జరగకుండా జాగ్రత్త వహిస్తున్నామని అన్నారు. గ్రామంలో ఎక్కడైనా కల్తీ విత్తనాలు విక్రయాలు జరిగితే వెంటనే సమాచారం తెలిసేలా వ్యవస్థ ఏర్పాటు చేసుకున్నామని అన్నారు. ఎరువుల లభ్యతపై రెగ్యులర్ గా సమీక్ష చేసుకుంటూ ఎక్కడా కొరత రాకుండా చూస్తామని అన్నారు. నేలకొండపల్లి, బోనకల్ మండలాల్లో భూ భారతి చట్టం పైలెట్ ప్రాజెక్టు క్రింద రెవెన్యూ సదస్సులు నిర్వహించామని అన్నారు. భూ సమస్యలపై నేలకొండపల్లి మండలంలో ప్రజల నుంచి 3224 దరఖాస్తులు వచ్చాయని, వీటిలో 1791 సాధా బైనామా దరఖాస్తులు ఉన్నాయని, ఫీల్డ్ సర్వే చేసి డాక్యుమెంట్ ఉన్న అర్హులకు సమస్య పరిష్కరించి పట్టాలను పంపిణీ చేస్తామని అన్నారు. మిగిలిన 1433 పైగా దరఖాస్తులో ఎక్కువ శాతం సర్వే నెంబర్ విస్తీర్ణం, సర్వే నెంబర్ పాస్ బుక్ లో ఎక్కలేదని దరఖాస్తులు వచ్చాయని, క్షేత్ర స్థాయి ఎంజాయ్ మెంట్ సర్వే చేసి 299 దరఖాస్తులు ఆమోదించామని, ప్రతి తిరస్కరించిన దరఖాస్తుకు కారణం స్పష్టంగా తెలియ జేస్తున్నామని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం క్రింద జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు మంజూరు చేసిన 800 పైగా ఇండ్లలో 30 ఇండ్లు చివరి దశకు చేరుకున్నాయని అన్నారు. 200 పైగా లబ్ధిదారులకు మహిళా సంఘాల ద్వారా రుణాలు మంజూరు చేసి ఇంటి నిర్మాణం చేపట్టామని అన్నారు. రాబోయే వానాకాలం లోతట్టు ప్రాంతాలలో నీటి నిల్వ ఉండకుండా పెద్ద ఎత్తున ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టామని అన్నారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకున్నామని అన్నారు. కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. నకిలీ విత్తనాలపై పటిష్టమైన విజిలెన్స్ ఏర్పాటు చేశామని అన్నారు. కోర్టు స్టే తొలగిన వెంటనే సుజాత నగర్ పైలెట్ మండలంలో సాధా బైనామా సమస్యలు పరిష్కరిస్తామని అన్నారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లను అర్హులకు పంపిణీ చేయాలని అన్నారు. ఇంటి నిర్మాణ సామాగ్రి తక్కువ ధరకు పేదలకు అందించాలని అన్నారు. జిల్లాలో కొన్ని చోట్ల రైస్ మిల్లుల వద్ద తరుగు పేరుతో ధాన్యం కోత విధిస్తున్నారని , దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కొత్తగూడెం ఆసుపత్రిలో వైద్యుల కొరత ఉందని అన్నారు. వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ లో ధాన్యం కొనుగోలు సజావుగా జరిగిందని, యాసంగి సీజన్ లో కొంత ఇబ్బంది జరిగిందని, వచ్చే సీజన్ లో ఇటువంటి సమస్యలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి మాట్లాడుతూ గత ప్రభుత్వం లో గృహలక్ష్మి క్రింద బేస్మెంట్ స్థాయి వరకు నిర్మించి డబ్బులు రాకుండా నిలుపుదల అయిన వాటికి ఇల్లు పూర్తి చేసే విధంగా డబ్బులు మంజూరు చేయాలని, సత్తుపల్లి నియోజకవర్గ ప్రాంతంలో వైద్యుల కొరత ఉన్నదని, 100 పడకల ఆసుపత్రికి అనుగుణంగా వైద్యులను కేటాయించాలని కోరారు. ఈ సమావేశంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ బి. రోహిత్ రాజ్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర హస్త కళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, డి.ఎఫ్.ఓ. సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, అదనపు కలెక్టర్ లు పి. శ్రీనివాస్ రెడ్డి, వేణుగోపాల్, డిఆర్వో ఏ. పద్మశ్రీ, ఉమ్మడి జిల్లాల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల సమస్యలపై జూన్2న సానుకూల స్పందన

ఉమ్మడి వరంగల్ బ్యూరో(భారత శక్తి)మే 29: ఉద్యోగుల సమస్యలపై వచ్చే నెల 2వ తేదిన సానుకూల స్పందన వస్తుందని ఆశిస్తున్నట్లు తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాస రావు అన్నారు. టి జి వో సీనియర్ నాయకులు, పట్టు పరిశ్రమ శాఖ జాయింట్ డైరెక్టర్, జిల్లా మైనారిటీ ల సంక్షేమ అధికారి దాసరి మురళీధర్ రెడ్డి పదవీ విరమణ అభినందన సభ హనుమకొండ లో ని మయూరి గార్డెన్స్ లో జరిగింది.ముఖ్య అతిధిగా పాల్గొన్న ఏలూరి మాట్లాడుతూ హక్కు ల సాధన కోసం పోరాటానికి సిద్ధంగా వుండాలి అన్నారు. ఉద్యోగులు ఉద్యోగులు గానే ఉండాలని, సంఘాలు ఏ రాజకీయ పార్టీ కి అనుబంధంగా ఉండకుండా పని చేయాలి అన్నారు.మనం సంఘటితంగా పోరాడితే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు.ఆర్థిక, ఆర్థికేతర సమస్య లపై కార్యాచరణ ఉంటుంది అన్నారు. జె ఎ సి ని పునరుద్దరించామన్నారు.మాజీ ఉప ముఖ్యమంత్రి శ్రీహరి మాట్లాడుతూ ఉద్యోగుల పక్షపాతి నని అన్నారు. సమస్యలు ఉన్నప్పుడు సంఘాలు ప్రస్థావించాలని కోరారు. అప్పుడే సభ్యుల సమస్య లు పరిష్కారం అవుతాయని శ్రీహరి అన్నారు.ఉద్యోగానికి న్యాయం చేస్తూ, ఉద్యోగుల సమస్యలపై పని చేయడం అభినందనీయం అని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. టిజీవో రాష్ట్ర కోశాధికారి ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ గెజిటెడ్ అధికారుల సమస్యల పై అహర్నిశలు పనిచేసారని తెలిపారు. ఉద్యోగులకు పదవీ విరమణ పొందడం సహజమని, వారి ఆరోగ్యం బాగుండాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఆకాంక్షించారు. ఉద్యోగుల సమస్యలపై వచ్చే నెల 2వ తేదిన సానుకూల స్పందన టి జి వో నేత ఏలూరి శ్రీనివాస రావు ఉద్యోగుల సమస్యలపై వచ్చే నెల 2వ తేదిన సానుకూల స్పందన వస్తుందని ఆశిస్తున్నట్లు తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాస రావు అన్నారు. టి జి వో సీనియర్ నాయకులు, పట్టు పరిశ్రమ శాఖ జాయింట్ డైరెక్టర్, జిల్లా మైనారిటీ ల సంక్షేమ అధికారి దాసరి మురళీధర్ రెడ్డి పదవీ విరమణ అభినందన సభ హనుమకొండ లో ని మయూరి గార్డెన్స్ లో జరిగింది.ముఖ్య అతిధిగా పాల్గొన్న ఏలూరి మాట్లాడుతూ హక్కు ల సాధన కోసం పోరాటానికి సిద్ధంగా వుండాలి అన్నారు. ఉద్యోగులు ఉద్యోగులు గానే ఉండాలని, సంఘాలు ఏ రాజకీయ పార్టీ కి అనుబంధంగా ఉండకుండా పని చేయాలి అన్నారు.మనం సంఘటితంగా పోరాడితే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు.ఆర్థిక, ఆర్థికేతర సమస్య లపై కార్యాచరణ ఉంటుంది అన్నారు. జె ఎ సి ని పునరుద్దరించామన్నారు.మాజీ ఉప ముఖ్యమంత్రి శ్రీహరి మాట్లాడుతూ ఉద్యోగుల పక్షపాతి నని అన్నారు. సమస్యలు ఉన్నప్పుడు సంఘాలు ప్రస్థావించాలని కోరారు. అప్పుడే సభ్యుల సమస్య లు పరిష్కారం అవుతాయని శ్రీహరి అన్నారు.ఉద్యోగానికి న్యాయం చేస్తూ, ఉద్యోగుల సమస్యలపై పని చేయడం అభినందనీయం అని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. టిజీవో రాష్ట్ర కోశాధికారి ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ గెజిటెడ్ అధికారుల సమస్యల పై అహర్నిశలు పనిచేసారని తెలిపారు. ఉద్యోగులకు పదవీ విరమణ పొందడం సహజమని,



వారి ఆరోగ్యం బాగుండాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఆకాంక్షించారు. కారం రవీందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు సంక్షేమ పథకాలు అందాలి కానీ వారిని అడ్డం పెట్టుకుని రెండు శాతం వున్న ఉద్యోగులను ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. సంఘం ప్రయత్నాలు ఫలించాలని అన్నారు.ఈ సందర్భంగా వరంగల్, హనుమకొండ జిల్లాల అధికారులు ఘనంగా సన్మానించారు.టిజీవో రాష్ట్ర ఉపాధ్యక్షులు అన్నమనేని జగన్మోహన్ రావు అధ్యక్షతన సభ జరిగింది.

సీనియర్ జర్నలిస్ట్ దాసరి కృష్ణా రెడ్డి,టిజీవో నాయకులు ఆకవరం శ్రీనివాస్, టిజీవో వరంగల్ జిల్లా అధ్యక్షుడు రాం రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఫణి కుమార్, కోలా రాజేష్, ఆస్నాల శ్రీనివాస్, కిరణ్ టీఎన్ జీవో హనుమకొండ నాయకులు ఆకుల రాజేందర్, సోమయ్య, ఎంపిడివో ల సంఘం అధ్యక్షులు ఆంజనేయులు, వరంగల్ జిల్లా టీ ఎన్ జి వో అధ్యక్షులు గజ్జెల రాంకిషన్ మాట్లాడారు. టిజీవో ల సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షురాలు వనజా రెడ్డి, సర్వర్ హుస్సేన్, గోపాల్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా వరంగల్, హనుమకొండ జిల్లాల అధికారులు ఘనంగా సన్మానించారు.టిజీవో రాష్ట్ర ఉపాధ్యక్షులు అన్నమనేని జగన్మోహన్ రావు అధ్యక్షతన సభ నిర్వహించారు. దాసరి కృష్ణా రెడ్డి, డి ఆర్ డి వో మేన శ్రీను, టిజీవో వరంగల్ జిల్లా అధ్యక్షుడు రాం రెడ్డి, హనుమకొండ కార్యదర్శి డాక్టర్ ప్రవీణ్ కుమార్, కార్యదర్శి ఫణి కుమార్, కోశాధికారి రాజేష్ కుమార్, ఆకవరం శ్రీనివాస్ కుమార్, కిరణ్ కుమార్, కోలా రాజేష్, ఆస్నాల శ్రీనివాస్, టీఎన్ జీవో హనుమకొండ నాయకులు ఆకుల రాజేందర్, సోమయ్య, సంజీవరెడ్డి, రఘుపతి రెడ్డి, ఎంపిడివో ల సంఘం అధ్యక్షులు ఆంజనేయులు, వరంగల్ జిల్లా టీ ఎన్ జి వో అధ్యక్షులు గజ్జెల రాంకిషన్, దాస్యా నాయక్, ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యవర్గ సభ్యులు, ప్రాథమిక సభ్యులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

# సిఐఎస్ఎఫ్ కాలనీలో పడకేసిన పారిశుధ్యం

## -కంపు కొడుతున్న పరిసరాలు.
## -కాలుష్యం అవుతున్న త్రాగునీరు.

మందమర్రి, మే 29 (భారతశక్తి): మందమర్రి పట్టణం పోస్ట్ ఆఫీస్ ముందర గల పాత సిఐఎస్ఎఫ్ కాలనీలో పారిశుధ్యం పడకేసింది.కాలనీ చేత్తమయంగా మారింది. కాల్వలన్నీ మురుగునీరుతో దుర్గంధం వెదజల్లుతున్నాయని కార్మికులు వాపోతున్నారు. సి ఎస్ ఎఫ్ కాలనీలో ఉన్న మురుగునీరు కాలువలు పూర్తిగా నిండి దుర్వాసనకు కారణమవుతున్నాయి. మురుగునీరు ప్రవహించు కాలువల నుండే తాగునీరు పైపులైన్లు ఉన్నాయి. రానున్న వర్షాకాలం దృష్టిలో పెట్టుకుని అయినా మురుగునీరు కాలువలను శుభ్రం చేయించి పైపులైను దగ్గర్లో మురుగునీరు నిలవకుండా సింగరేణి అధికారుల తగు చర్యలు తీసుకోవాలని కార్మిక కుటుంబాలు అభిప్రాయపడుతున్నాయి.

# ఖమ్మం మహిళా మార్ట్ ను లాభాల బాటలో నడిపేలా మహిళా సంఘాలు నిరంతరం కృషి చేయాలి: జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

## -సీక్వెల్ రోడ్డులోని మహిళా మార్ట్ సందర్శించిన ఉమ్మడి ఖమ్మం జిల్లా కలెక్టర్లు

ఖమ్మం ప్రతినిది (భారత శక్తి న్యూస్ ), మే 29:ఖమ్మం మహిళా మార్ట్ ప్రత్యేకత చాటే విధంగా మార్ట్ నిర్వహణకు మహిళా సంఘాలు బాధ్యత వహించాలని ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ఖాన్ అన్నారు. గురువారం ఖమ్మం, వైరా రోడ్ నందు నూతనంగా ఏర్పాటు చేసిన మహిళా మార్ట్ ను భద్రాద్రి కొత్తగూడెం



జిల్లా కలెక్టర్ జితేష్. వి. పాటిల్, ఖమ్మం పోలీస్ కమీషనర్ సునీల్దత్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్రాజ్, ఖమ్మం జిల్లా అటవీ అధికారి సిద్ధార్థ విక్రమ్ సింగ్లతో కలిసి ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ఖాన్ సందర్శించారు. మహిళామార్ట్ ఏర్పాటుకు దోహదపడిన పలు అంశాలు, మార్ట్ యొక్క ఉద్దేశ్యం, విక్రయించే ఉత్పత్తులు, ఖమ్మం బ్రాండింగ్ విలువ పెంచేందుకు తీసుకున్న చర్యలు వంటి పలు అంశాలను వారికి జిల్లా కలెక్టర్ వివరించారు. మార్ట్లో ఏర్పాటు చేసిన వస్తువులు, ఉత్పత్తులను పరిశీలించి తృణ ధాన్యాలు, పప్పులను మహిళలు ప్యాకింగ్ చేసే విధానాన్ని ఆసక్తిగా వారు తిలకించారు. ధూప్స్టిక్, అగర్ బత్తులు వేటితో తయారు చేశారని మహిళలను అడిగి తెలుసుకున్నారు. ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, సీపీ, ఎస్పీ, డీఎఫ్ఓలు పలు ఉత్పత్తులను మార్ట్లో కొనుగోలు చేశారు. ఖమ్మం మహిళా మార్ట్ బాగుందని కితాబు ఇస్తూ, వ్యాపారం అనుకూలతకు మహిళా నిర్వాకురాలకు పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ఖాన్ మాట్లాడుతూ జిల్లాలోని మహిళలు అనేక రకాల ఉత్పత్తులను తయారు చేస్తున్నట్లు తెలిపారు. మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను విక్రయించే వేదికగా మహిళామార్ట్ను ఏర్పాటు చేశామన్నారు. సమీకృత మార్కెట్లో కూడా ఓ స్టాల్ను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు వివరించారు. వీటితోపాటు ఆన్లైన్లో కూడా మహిళా ఉత్పత్తులను విక్రయించేందుకు ప్రణాళికలు చేస్తున్నట్లు చెప్పారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్. వి. పాటిల్ మాట్లాడుతూ మహిళా ఉత్పత్తుల విక్రయానికి మంచి కేంద్రాన్ని మార్ట్ రూపంలో ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. ఈ మార్ట్లో మహిళల ఉత్పత్తులను పెద్ద మొత్తంలో ఏర్పాటు చేయాలని డీఆర్డీఏ అధికారులకు సూచించారు. అటవీ ఉత్పత్తులను విక్రయించుకునేందుకు మార్ట్లో అవకాశం కల్పించాలని, వాటి ద్వారా మహిళలకు మరింత లాభం వచ్చేందుకు వీలుంటుందని తెలిపారు. అనంతరం మహిళా మార్ట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన టీ స్టాల్ ను సైతం ఉన్నతాధికారులు పరిశీలించి, టీ స్టాల్ లో టీ ని సేవించారు.ఈ కార్యక్రమంలో డిఆర్డీవో సన్యాసయ్య, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఏడాదిలోగా 'సీక్వెంట్, వియాష్' విలీనం

హైదరాబాద్: జంతు ఆరోగ్య ఔషధాల విభాగంలో కార్యకలాపాలు సాగిస్తున్న సీక్వెంట్ సైంటిఫిక్, హైదరాబాద్‌కు చెందిన ఏపీఐ ఔషధాల కంపెనీ వియాష్ లైఫ్ సైన్సెస్ విలీన ప్రక్రియ ఏడాది వ్యవధిలో పూర్తయ్యే అవకాశాలున్నాయి. విలీనానికి సీసీఐ (కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా) అనుమతి లభించింది. తాజాగా బీఎస్ఈ నుంచి 'అబ్జర్వేషన్ లెటర్', ఎన్ఎస్ఈ నుంచి 'నో అబ్జెక్షన్' లెటర్ లభించాయి. తదుపరి ఎన్‌సీఎల్‌టీ (నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్) అనుమతి కోరతారు. ఈ రెండు కంపెనీల విలీనాన్ని 2024 సెప్టెంబరులో ప్రకటిస్తూ, ప్రక్రియ 12- 15 నెలల్లో పూర్తవుతుందని తెలిపారు. ఆ ప్రకారమే సాగుతున్నట్లు సీక్వెంట్ సైంటిఫిక్ యాజమాన్యం తాజాగా స్పష్టం చేసింది.




మెరుగైన ఆర్థిక ఫలితాలు: రెండు కంపెనీలు కలిసి గత ఆర్థిక సంవత్సరానికి, జనవరి-మార్చి త్రైమాసికానికి మెరుగైన ఫలితాలు నమోదు చేశాయి. సీక్వెంట్ సైంటిఫిక్ మార్చి త్రైమాసికంలో రూ.401 కోట్ల ఆదాయం, రూ.10 కోట్ల నికర లాభం ఆర్జించింది. 2024-25 మొత్తానికి ఆదాయం రూ.1551 కోట్లు, పన్ను తర్వాత లాభం రూ.32 కోట్లు నమోదయ్యాయి. వియాష్ లైఫ్ సైన్సెస్ మార్చి త్రైమాసిక ఆదాయం రూ.370 కోట్లు, 2024-25 ఆదాయం రూ.1458 కోట్లుగా ఉన్నాయి. 2024-25 పూర్తి కాలానికి రెండు కంపెనీలు కలిసి రూ.3,009 కోట్ల ఆదాయాన్ని, రూ.172 కోట్ల నికర లాభాన్ని ఆర్జించాయి. 2023-24లో ఆదాయం రూ.2680 కోట్లు, నికర లాభం రూ.59 కోట్లే నమోదయ్యాయి.

రుణభారం తగ్గుతుంది: విలీనం పూర్తయ్యాక, పరిశోధన-అభివృద్ధి, ఉత్పత్తి విభాగాల్లో సత్వర వృద్ధి సాధించేందుకు, రుణ భారాన్ని తగ్గించుకునేందుకు అవకాశాలు ఉన్నట్లు సీక్వెంట్ సైంటిఫిక్ పేర్కొంది. రెండేళ్లలో రెండంకెల వృద్ధి నమోదవుతుందనీ అంచనా వేసింది. పెంపుడు జంతువుల ఆరోగ్య ఉత్పత్తుల విభాగంలో సత్వర వృద్ధి సాధ్యమవుతుందని సీక్వెంట్ సైంటిఫిక్ భావిస్తోంది. ఐరోపా దేశాల్లో కొత్త ఉత్పత్తులు, టీకాలను పెద్దఎత్తున పంపిణీ చేసేందుకు, లాటిన్ అమెరికా దేశాలకు కార్యకలాపాలు విస్తరించేందుకు సన్నాహాలు చేస్తోంది. వియాష్ లైఫ్ సైన్సెస్ ఏపీఐ ఔషధాలు తయారు చేస్తుండగా, 10 పెద్ద జనరిక్ ఔషధ కంపెనీల నుంచి సీడీఎంఓ ప్రాజెక్టులు లభించాయి. ఫార్ములేషన్ల విభాగంలో సంక్లిష్ట ఔషధాలపై (కాంప్లెక్స్ జనరిక్స్) పనిచేయాలని కంపెనీ భావిస్తోంది. న్యూజెర్సీలో ఉన్న ప్లాంట్ ద్వారా అమెరికా ప్రభుత్వ, రక్షణ విభాగాల నుంచి ఔషధాల సరఫరా కాంట్రాక్టులు లభిస్తాయని ఈ సంస్థ అంచనా వేస్తోంది.

# గూగుల్ వెబ్‌సైట్‌లో ఇక పిక్సెల్ ఫోన్లు, వాచ్‌ల విక్రయం

: గూగుల్ కంపెనీ తమ ఉత్పత్తులను భారత్‌లో నేరుగా విక్రయించేందుకు సిద్ధమైంది. అందులోభాగంగానే తన అధికారిక వెబ్‌సైట్‌ను ప్రారంభించింది. ఇప్పటివరకు తన ఉత్పత్తుల విక్రయాల కోసం ఇతర ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లపై ఆధారపడిన కంపెనీ.. ఇకపై స్టోర్‌ల నుంచి నేరుగా డెలివరీ అందించనుంది. దేశంలో తన ఉనికిని బలోపేతం చేసే ప్రక్రియలో భాగంగా ఈ చర్యలు చేపట్టింది.



ఇ-కామర్స్ సంస్థ ఫ్లిప్‌కార్ట్, టాటా గ్రూప్‌నకు చెందిన క్రోమా, రిలయన్స్ డిజిటల్ ద్వారా గూగుల్ ఇప్పటివరకు విక్రయాలను చేపట్టింది. తాజాగా ఆన్‌లైన్ స్టోర్‌ను ప్రారంభించింది. ఇకపై నేరుగా ఇక్కడినుంచే గ్యాడ్జెట్లను కస్టమర్లకు అందించనుంది. ఇప్పటికే గూగుల్ వెబ్‌సైట్ యూజర్లకు అందుబాటులోకి వచ్చింది. అందులోకి వెళ్లి పిక్సెల్ స్మార్ట్‌ఫోన్‌లు, వాచ్‌లు, బడ్స్ నేరుగా గూగుల్ నుంచి కొనుగోలు చేయొచ్చు.

భారత్‌లో నేరుగా విక్రయాలు ప్రారంభించడంపై గూగుల్ ఇండియా డివైజెస్ అండ్ సర్వీసెస్ మేనేజింగ్ డైరెక్టర్ మితుల్ షా ఆనందం వ్యక్తంచేశారు. పిక్సెల్ మొబైల్స్‌కు భారత్ కీలక మార్కెట్‌గా ఉ ఒదన్న ఆయన.. ఏఐ ఆధారిత పరికరాలతో పోర్ట్‌ఫోలియోను విస్తరించనున్నట్లు తెలిపారు. కస్టమర్లకు మెరుగైన సేవలు అందించడంపై సంస్థ దృష్టిసారించిందన్నారు. త్వరలో ఆఫ్‌లైన్ స్టోర్లనూ తెరవనుంది. అయితే, ఎప్పుడు తెరిచేదీ మాత్రం మితుల్ షా వెల్లడించలేదు. ప్రీమియం స్మార్ట్‌ఫోన్ విభాగంలో యాపిల్, గూగుల్, శాంసంగ్ పోటీపడుతున్న సంగతి తెలిసిందే. శాంసంగ్, యాపిల్ భారత్‌లో తయారీ, సొంతంగా రిటైల్ స్టోర్లను ఏర్పాటుచేసుకున్నాయి. తాజాగా గూగుల్ కూడా అదే జాబితాలో చేరింది.

# సూచీలు నష్టపోయినా.. సంపద పెరిగింది

ఎఫ్ఎమ్‌సీజీ దిగ్గజం ఐటీసీ షేరు డీలాపడటంతో, వరుసగా రెండో రోజైన బుధవారమూ దేశీయ సూచీలు నష్టపోయాయి. 2024-25 జీడీపీ గణాంకాలు వెలువడనుండటంతో మదుపర్లు అప్రమత్తత పాటించారు. డాలర్‌తో పోలిస్తే రూపాయి 2 పైసలు పెరిగి 85.38 వద్ద ముగిసింది. బ్యారెల్ ముడిచమురు 0.69% లాభంతో 64.57 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో కొరియా కోస్పి లాభపడగా, నిక్కీ, హాంగ్‌సెంగ్ నష్టపోయాయి. ఐరోపా మార్కెట్లు నష్టాల్లో ట్రేడయ్యాయి.



బీఎస్ఈలోని నమోదిత సంస్థల మొత్తం మార్కెట్ విలువ బుధవారం రూ.12,000 కోట్లు పెరిగి రూ.443.77 లక్షల కోట్లు (5.18 లక్షల కోట్ల డాలర్లు)గా నమోదైంది.

సెన్సెక్స్ ఉదయం 94 పాయింట్ల (క్రితం ముగింపు 81,551.63) నష్టంతో 81,457.61 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. రోజులో ఎక్కువ భాగం నష్టాల్లోనే కదలాడిన సూచీ, ఒకదశలో 81,244.02 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరకు 239.31 పాయింట్ల నష్టంతో 81,312.32 వద్ద ముగిసింది. నిఫ్టీ 73.75 పాయింట్లు కోల్పోయి 24,752.45 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 24,737.05- 24,864.25 పాయింట్ల మధ్య కదలాడింది.

త్రైమాసిక లాభం 38% పెరగడంతో ఎల్ఐసీ షేరు 8.21% పరుగులు తీసి రూ.942.55 దగ్గర స్థిరపడింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.45,223.74 కోట్లు పెరిగి రూ.5.96 లక్షల కోట్లకు చేరింది.

సెన్సెక్స్ 30 షేర్లలో 20 డీలాపడ్డాయి. ఇండస్ఇండ్ బ్యాంక్ 1.99%, నెస్లే 1.78%, అల్ట్రాటెక్ 1.62%, ఎం అండ్ ఎం 1.41%, పవర్‌గ్రిడ్ 1.20%, ఏషియన్ పెయింట్స్ 1.12%, సన్‌ఫార్మా 1.06%, టెక్ మహీంద్రా 0.88% నష్టపోయాయి. బజాజ్ ఫైనాన్స్ 1.07%, భారతీ ఎయిర్‌టెల్ 0.65%, ఐసీఐసీఐ బ్యాంక్ 0.46%, అదానీ పోర్ట్స్ 0.46% లాభపడ్డాయి. రంగాల వారీ సూచీల్లో.. ఎఫ్ఎమ్‌సీజీ 1.33%, లోహ 0.69%, వాహన 0.67%, మన్నికైన వినిమయ వస్తువులు 0.58%, కమొడిటీస్ 0.52% పడ్డాయి. ఆర్థిక సేవలు, పరిశ్రమలు, టెలికాం, బ్యాంకింగ్, యంత్ర పరికరాలు, సేవలు, టెక్ రాణించాయి. బీఎస్ఈలో 2006 షేర్లు నష్టపోగా, 1956 స్క్రిప్‌లు నష్టపోయాయి. 144 షేర్లలో ఎటువంటి మార్పులేదు.

రాణించిన బెల్‌రైజ్ షేరు: బెల్‌రైజ్ ఇండస్ట్రీస్ షేర్లు అరంగేట్రంలో మెరిశాయి. ఇష్యూ ధర రూ.90తో పోలిస్తే బీఎస్ఈలో షేరు 9.44% లాభంతో రూ.98.50 వద్ద ప్రారంభమైంది. ఇంట్రాడేలో రూ.103.20 వద్ద గరిష్ఠాన్ని తాకి, చివరకు 8.18% పెరిగి రూ.97.37 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.8,664.75 కోట్లుగా నమోదైంది.

నవీ ముంబయి ఎయిర్‌పోర్ట్ నుంచి సేవలందిస్తాం: ప్రారంభానికి సిద్ధమవుతున్న నవీ ముంబయి ఎయిర్‌పోర్ట్ నుంచి వాణిజ్య విమాన సేవలకు శ్రీకారం చుట్టే మొదటి సంస్థగా ఇండిగో నిలవనుంది. ఈ విమానాశ్రయం ఆగస్టులో ప్రారంభమయ్యే అవకాశం ఉంది. మొదటి రోజు నుంచే ఇండిగో రోజుకు 18 విమాన సర్వీసులు నిర్వహించనుంది. నవంబరులో కొత్త విమానాశ్రయం నుంచి అంతర్జాతీయ సర్వీసులనూ ఇండిగో ప్రారంభించనుంది.

నేటి బోర్డు సమావేశాలు

బజాజ్ ఆటో, అమర రాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ, కేఎన్ఆర్ కన్‌స్ట్రక్షన్స్, సుజ్లాన్ ఎనర్జీ, ఇంజినీర్స్ ఇండియా, ఎస్‌జేవీఎన్, ఎన్‌బీసీసీ, మజగావ్ డాక్ షిప్‌బిల్డర్స్, సంవర్ధన మదర్సన్ ఇంటర్నేషనల్, ఆల్కెమ్ ల్యాబ్స్, ప్రెస్టీజ్ ఎస్టేట్స్ ప్రాజెక్ట్స్, ఇప్కా ల్యాబ్స్, వోఖార్డ్, ఇక్రా, సెంకో గోల్డ్, ఐటీడీసీ, బజాజ్ హిందుస్థాన్ షుగర్

ఐపీఓ సమాచారం

ఐపీఓ ద్వారా రూ.3,668 కోట్లు సమీకరించేందుకు హీరో మోటోకార్ప్ ఆర్థిక సేవల విభాగం హీరో ఫిన్‌కార్ప్‌కు సెబీ అనుమతి ఇచ్చింది.

లీలా ప్యాలెసెస్ హోటల్స్ అండ్ రిసార్ట్స్‌ను నిర్వహించే స్క్లోస్ బెంగళూరు ఐపీఓ ముగిసేసరికి 4.50 రెట్ల స్పందన లభించింది. ఇష్యూలో భాగంగా 4,66,10,169 షేర్లను జారీ చేయనుండగా, 20,96,73,206 షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. రిటైల్ విభాగంలో 83% స్పందన వచ్చింది.

ప్రోస్టార్మ్ ఇన్ఫో సిస్టమ్స్ ఐపీఓ రెండో రోజుకే 12.65 రెట్ల స్పందన లభించింది. ఇష్యూలో భాగంగా 1,12,00,000 షేర్లను ఆఫర్ చేస్తుండగా, 14,16,94,842 షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి.

స్కోడా ట్యూబ్స్ ఐపీఓ మొదటి రోజే 2.06 రెట్ల స్పందన లభించింది. ఇష్యూలో భాగంగా 1,18,46,169 షేర్లను ఆఫర్ చేయగా, 2,43,53,100 షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. రిటైల్ విభాగంలో 2.08 రెట్ల స్పందన నమోదైంది.

ఏజిస్ లాజిస్టిక్స్ అనుబంధ సంస్థ ఏజిక్ ఓపాక్ టెర్మినల్స్ ఐపీఓ ముగిసేసరికి 2.09 రెట్ల స్పందన నమోదైంది. ఇష్యూలో భాగంగా 6,90,58,296 షేర్లను ఆఫర్ చేయగా, 14,43,70,548 షేర్లకు బిడ్లు వచ్చాయి. రిటైల్ విభాగంలో 77% స్పందన కనిపించింది.

# నాట్కో ఫార్మాకు రికార్డు లాభాలు

హైదరాబాద్: నాట్కో ఫార్మా అత్యంత ఆకర్షణీయ ఫలితాలు నమోదు చేసింది. కంపెనీని స్థాపించిన నాటి నుంచి, ఎన్నడూ లేనంత అధిక వార్షిక ఆదాయాన్ని, నికర లాభాన్ని ఆర్జించింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఏకీకృత ఖాతాల ప్రకారం రూ.4,784 కోట్ల మొత్తం ఆదాయంపై, రూ.1883.4 కోట్ల నికరలాభాన్ని, రూ.105.26 ఈపీఎస్‌ను నమోదు చేసింది. 2023-24తో పోల్చితే మొత్తం ఆదాయం 16%, నికరలాభం 36% పెరిగాయి. ఎన్నో ఏళ్లుగా పటిష్ఠమైన కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగడం వల్లే, రికార్డు స్థాయి ఆదాయాలు, లాభాలు సాధించగలిగినట్లు నాట్కో ఫార్మా వివరించింది.

మార్చి త్రైమాసికానికి మొత్తం ఆదాయం రూ.1287.3 కోట్లు, నికరలాభం రూ.406 కోట్లు, ఈపీఎస్ రూ.22.70గా నమోదయ్యాయి. 2023-24 ఇదేకాలంలో మొత్తం ఆదాయం రూ.1110.3 కోట్లు, నికరలాభం రూ.386.3 కోట్లు, ఈపీఎస్ రూ.21.56గా ఉన్నాయి. సమీక్షా త్రైమాసికంలో పరిశోధన- అభివృద్ధి వ్యయాలు అధికంగా ఉన్నాయి. క్రాప్ హెల్త్ సైన్స్ వ్యాపారంలో 'ఇంపెయిర్‌మెంట్ ఛార్జీ' కింద రూ.50 కోట్లు, అమెరికా అనుబంధ కంపెనీకి 'ఛార్జిబ్యాక్ అడ్జస్ట్‌మెంట్' కింద రూ.25 కోట్లు కేటాయించినా, త్రైమాసిక లాభం అధికంగా నమోదైంది.

రూ.3,000 కోట్లకు పైగా నగదు నిల్వలు: మార్చి చివరకు నాట్కో ఫార్మా చేతిలో రూ.3,000 కోట్లకు పైగా నగదు నిల్వలున్నాయి. కంపెనీ వార్షిక అమ్మకాల్లో అమెరికా వాటా అధికంగా ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అమెరికా సహా ఇతర ప్రాంతాల్లోనూ ఫార్మా పరిశ్రమకు ఇబ్బందులు ఎదురవుతాయని భావిస్తున్నామని.. వాటిని ఎదుర్కోడానికి అన్ని రకాలుగా సన్నద్ధం అవుతున్నట్లు నాట్కో ఫార్మా వివరించింది.

# టాప్-10 హబ్ విమానాశ్రయాల్లో దిల్లీకి పదో స్థానం

దిల్లీ: ఆసియా పసిఫిక్, పశ్చిమాసియాలోని టాప్-10 హబ్ విమానాశ్రయాల్లో దిల్లీకి పదో స్థానం లభించింది. ఎయిర్‌పోర్ట్స్ కౌన్సిల్ ఇంటర్నేషనల్ ఆసియా-పసిఫిక్, పశ్చిమాసియా ఎయిర్ కనెక్టివిటీ ర్యాంకింగ్ 2024 నివేదిక ప్రకారం, ఈ రెండు ప్రాంతాలు 14% వార్షిక వృద్ధి నమోదు చేశాయి. టాప్-10 హబ్ విమానాశ్రయాల్లో దుబాయి అంతర్జాతీయ విమానాశ్రయం తొలి స్థానం దక్కించుకుంది. షాంఘై పుడాంగ్ అంతర్జాతీయ విమానాశ్రయం (చైనా), హమాద్ అంతర్జాతీయ విమానాశ్రయం (ఖతార్), ఇంచియాన్ అంతర్జాతీయ విమానాశ్రయం (దక్షిణ కొరియా) వరుసగా 2, 3, 4 స్థానాల్లో నిలిచాయి. చైనాలోనే ఉన్న గ్వాంగ్‌జో బాయున్ అంతర్జాతీయ విమానాశ్రయం, బీజింగ్ క్యాపిటల్ అంతర్జాతీయ విమానాశ్రయాలు 5, 6 ర్యాంకులు సాధించాయి. థాయ్‌ల్యాండ్‌కు చెందిన బ్యాంకాక్ సువర్ణభూమి విమానాశ్రయం, సింగపూర్‌లోని సింగపూర్ ఛాంగి విమానాశ్రయం, ఇండోనేషియాలోని కౌలాలంపూర్ అంతర్జాతీయ విమానాశ్రయాలు 7, 8, 9 స్థానాల్లో నిలిచాయి.



పదో ర్యాంకు సాధించిన దిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని (ఐజీఐఏ) దిల్లీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ (డయల్) నిర్వహిస్తోంది. ఇక్కడ నుంచి 153 గమ్యస్థానాలకు కనెక్టివిటీ ఉంది.

# వరి పైరు కోసం 2 ఉత్పత్తులు: బీఏఎస్ఎఫ్




హైదరాబాద్: వరి పంట దిగుబడి 25-50% తగ్గేందుకు కారణమవుతున్న పాము పొడ తెగులు, సుడిదోమ సమస్య నివారణకు 2 కొత్త ఉత్పత్తులు.. 'వాలెక్సియో', 'మిబెల్యా'లను బీఏఎస్ఎఫ్ ఇండియా బుధవారం ఇక్కడ ఆవిష్కరించింది. వాలెక్సియాను దేశీయంగా అభివృద్ధి చేసినట్లు సంస్థ బిజినెస్ డైరెక్టర్ గిరిధర్ రానువా తెలిపారు. సుడిదోమ నివారణకు, ఎకరాకు 60 మిల్లీ లీటర్ల వాలెక్సియో సరిపోతుందని, దీని ధర రూ.1755గా వెల్లడించారు. పాము పొడ తెగులు నివారణ కోసం ఎకరాకు 120 ఎంఎల్ వాడాల్సిన మిబెల్యా ధర రూ.1092గా సంస్థ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మార్కో గ్రోజ్డానోవిక్ తెలిపారు.

వ్యవసాయ వ్యాపారం వేరుగా: బీఏఎస్ఎఫ్ ఇండియా నుంచి వ్యవసాయ పరిష్కారాల వ్యాపారాన్ని వేరు చేసి, బీఏఎస్ఎఫ్ అగ్రికల్చర్ సొల్యూషన్స్ ఇండియాగా నమోదు చేసేందుకు కంపెనీ బోర్డు ఆమోదించింది. వచ్చే 18-24 నెలల్లో ఈ ఐపీఓ వచ్చే అవకాశం ఉందని సంస్థ వెల్లడించింది.



# గుజరాత్, ముంబయి టైటిల్ గెలిచే ఛాన్సుందా? చరిత్ర ఏం చెబుతోంది?

: ఐపీఎల్ 2025 సీజన్ తుది దశకు వచ్చేసింది. నేటి (మే 29) నుంచే ప్లే ఆఫ్స్ మొదలుకానున్నాయి. నేడు ముల్లాన్‌పుర్ వేదికగా క్వాలిఫయర్-1 జరగనుంది. పాయింట్ల పట్టికలో టాప్-2లో నిలిచిన పంజాబ్ కింగ్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఈ కీలక పోరులో తలపడనున్నాయి. ఇందులో గెలిచిన జట్టు నేరుగా ఫైనల్‌కు దూసుకెళ్తుంది. ఇక, రేపు (మే 30న) ముల్లాన్‌ఫుర్‌లో గుజరాత్ టైటాన్స్, ముంబయి ఇండియన్స్ )ఎలిమినేటర్ మ్యాచ్ ఆడనున్నాయి. క్వాలిఫయర్-1లో ఓడిన జట్టు, ఎలిమినేటర్ విజేత.. ఫైనల్‌లో చోటు కోసం క్వాలిఫయర్ 2లో పోటీపడతాయి.

14 సీజన్లలో ఒక్కసారే..

ఐపీఎల్‌లో 2011లో ప్లే ఆఫ్స్ వ్యవస్థను ప్రవేశపెట్టారు. అప్పటినుంచి ఇప్పటివరకు 14 సీజన్లు జరిగాయి. అయితే, ఒక్కసారి మాత్రమే ఎలిమినేటర్ మ్యాచ్ ఆడిన జట్టు ఫైనల్ వరకు వెళ్లి టైటిల్ సాధించింది. మిగతా 13 సీజన్లలో టాప్-2లో నిలిచిన జట్లే ఛాంపియన్‌గా నిలిచాయి. 2016లో డేవిడ్ వార్నర్ సారథ్యంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ సంచలనం సృష్టించింది. ఎలిమినేటర్ మ్యాచ్‌లో కోల్‌కతాను మట్టికరిపించిన హైదరాబాద్.. క్వాలిఫయర్-2లో గుజరాత్ లయన్స్‌కూ షాక్ ఇచ్చి ఫైనల్‌కు దూసుకెళ్లింది. టైటిల్ పోరులో బెంగళూరుపై 8 పరుగుల తేడాతో విజయం సాధించి కప్పు ఎగరేసుకుపోయింది.

ముంబయికి కలిసిరాని 3, 4

పాయింట్ల పట్టికలో మూడు, నాలుగు స్థానాల్లో నిలిచి ఫైనల్ వరకు వెళ్లి టైటిల్ సాధించడం అంత ఈజీ కాదు. వరుసగా మూడు మ్యాచ్‌ల్లో (ఎలిమినేటర్, క్వాలిఫయర్ 2, ఫైనల్) విజయం సాధిస్తేనే టైటిల్ దక్కుతుంది. అందువల్ల ముంబయి, గుజరాత్ (%+బయిఖతీఫ్ ఎఱఖఅం%) ఛాంపియన్‌గా నిలవాలంటే సర్వశక్తులూ ధారపోయాల్సిందే. ముంబయి ఇండియన్స్ విషయానికొస్తే 10 సార్లు ప్లే ఆఫ్స్‌కు చేరి ఐదుసార్లు ఛాంపియన్ అయింది. ఒకసారి రన్నరప్‌గా నిలిచింది. కానీ, గత చరిత్రను చూస్తే మాత్రం మూడు, నాలుగు స్థానాలు ముంబయికి అస్సలు కలిసిరావడం లేదు. రెండుసార్లు (2011, 2012) ఇలా క్వాలిఫయర్-2లోకి అడుగుపెట్టినా సరే.. ఫైనల్‌కు వెళ్లలేకపోయింది. ఇక మరో రెండుసార్లు (2014, 2023) ఎలిమినేటర్‌లోనే ఇంటిముఖం పట్టింది. ఇక, ఆడిన తొలి సీజన్ (2022)లోనే ఛాంపియన్‌గా నిలిచి చరిత్ర సృష్టించిన గుజరాత్ టైటాన్స్.. తర్వాత సీజన్‌లో రన్నరప్‌గా నిలిచింది. గతేడాది మాత్రం ఎనిమిదో స్థానంతో సరిపెట్టుకుంది.

కొత్త ఛాంపియన్‌ను చూస్తామా?

ముంబయి, గుజరాత్ జట్లలో ఏదో ఒక టీమ్ క్వాలిఫయర్-2 ఆడుతుంది. క్వాలిఫయర్-1లో ఓడిన జట్టు.. ముంబయి/గుజరాత్‌పై గెలిస్తే ఈసారి కొత్త ఛాంపియన్‌ను చూస్తాం. ఎందుకంటే పంజాబ్ కింగ్స్, ఆర్సీబీ ఒక్కసారి కూడా టైటిల్ గెలవలేదు. బెంగళూరు మూడు సార్లు (2009, 2011, 2016) ఫైనల్‌కు చేరినా టైటిల్‌ను ముద్దాడలేకపోయింది. పంజాబ్ ఈ సీజన్ కంటే ముందు ఒక్కసారే (2014) ఫైనల్‌కు చేరింది. అప్పుడు కోల్‌కతా నైట్‌రైడర్స్ చేతిలో ఓడిపోయి రన్నరప్‌తో సరిపెట్టుకుంది. మళ్లీ ఇన్నాళ్లకు టైటిల్ పోరుకు అర్హత సాధించింది.

# ఐపీఎల్ అభిమానులకు శుభవార్త.. క్వాలిఫయర్- 1 మ్యాచ్‌కు వరుణుడి ఆటంకం లేనట్లే

: ఐపీఎల్ (2025 సీజన్‌లో భాగంగా చండీగఢ్‌లోని ముల్లాన్‌పూర్ వేదికగా పంజాబ్ కింగ్స్ ( రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (క్వాలిఫయర్- 1లో మరికొన్ని గంటల్లో తలపడనున్నాయి. 11 సంవత్సరాల తర్వాత పంజాబ్ కింగ్స్.. శ్రేయస్ అయ్యర్ ( సారథ్యంలో మొదటిసారి ప్లేఆఫ్స్‌లో అడుగుపెట్టింది. ఈ జట్టు ఇంతకు ముందు చివరగా 2014లో ప్లేఆఫ్స్‌నకు చేరుకుంది. మరో వైపు పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో ఉన్న ఆర్సీబీ కూడా బలంగా కనిపిస్తోంది. క్వాలిఫయర్- 1 నేపథ్యంలో అభిమానులందరి కళ్లు వరుణుడి మీదే ఉన్నాయి. ఈ సీజన్‌లో వాన వల్ల పలు మ్యాచ్‌లు ప్రభావితమ్యాయి. కానీ ఈ సారి అలాంటి ముప్పేమీ ఉండబోదని వాతావరణ శాఖ భరోసా ఇస్తోంది.

'ముల్లాన్‌పూర్‌లో వర్షం కురిసే అవకాశాలు దాదాపు లేవు. ఉష్ణోగ్రతలు 26 డిగ్రీలకు అటూఇటుగా నమోదయ్యే అవకాశం ఉంది. మ్యాచ్ సమయంలో గాలి వీచే వేగం గంటకు 20కి.మీ.ల వరకు ఉండనుంది' అని వాతావరణ నివేదిక చెబుతోంది. ఇవేవీ మ్యాచ్‌కు ఆటంకం



కాదు. దీంతో పంజాబ్ కింగ్స్, ఆర్సీబీ మధ్య జరిగే రసవత్తర పోరును వీక్షించాలని అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. క్వాలిఫయర్ - 1 మ్యాచ్‌కు రిజర్వ్ డే లేని నేపథ్యంలో ఇది నిజంగా శుభపరిణామమే.

ఒక వేళ వర్షం కురిసి, మ్యాచ్ రద్దైతే మాత్రం పంజాబ్ కింగ్స్ నేరుగా ఫైనల్‌కు చేరుకుంటుంది. అప్పుడు ఆర్సీబీ.. ముంబయి, గుజరాత్ మధ్య జరగనున్న ఎలిమినేటర్‌లో గెలిచిన జట్టుతో క్వాలిఫయర్- 2లో తలపడాల్సి వస్తుంది. అందులో గెలిస్తేనే ఫైనల్‌లో తలపడే అవకాశాన్ని బెంగళూరు చేజిక్కించుకుంటుంది. క్వాలిఫయర్- 1 మ్యాచ్‌కు వర్ష సూచనలు లేకపోవడం ఒక విధంగా ఆర్సీబీకి కలిసి వచ్చే అంశమే. ఈ అవకాశాన్ని ఆర్సీబీ ఎంతవరకు సద్వినియోగం చేసుకుంటుందో మరి కాసేపట్లోనే తేలనుంది.

# దిగ్వేశ్ రాఠి నోట్‌బుక్ సంబరాలు

%లఖ్‌నవూ: ఈ సీజన్‌లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ పెద్దగా ప్రభావం చూపలేకపోవచ్చు. కెప్టెన్ రిషబ్ పంత్ గొప్పగా రాణించలేకపోవచ్చు. కానీ లఖ్‌నవూ లెగ్ స్పిన్నర్ దిగ్వేశ్ రాఠి మాత్రం ఈ సీజన్‌పై తనదైన ముద్ర వేశాడు. 12 మ్యాచ్‌ల్లో 14 వికెట్లతో రాణించిన దిగ్వేశ్ తీవ్ర చర్చనీయాంశం అయ్యాడు. వికెట్ తీసినప్పుడల్లా నోట్‌బుక్‌లో రాసుకుంటున్నట్లు దిగ్వేశ్ సంబరాలు చేసుకోవడం.. అప్పుడప్పుడూ అవి శ్రుతిమించడమే ఇందుకు కారణం. ఇప్పటి వరకు రూ.9.37 లక్షల జరిమానా కట్టిన దిగ్వేశ్.. సన్‌రైజర్స్ హైదరాబాద్ బ్యాటర్ అభిషేక్‌శర్మతో మాటల యుద్ధం కారణంగా ఒక మ్యాచ్‌లో సస్పెండ్ కూడా అయ్యాడు.




అసలు ఈ నోట్‌బుక్ సంబరాలేంటన్న ప్రశ్నకు గతంలో ఒక అభిమానికి స్వయంగా దిగ్వేశ్ బదులిచ్చిన వీడియో ఒకటి బయటకు వచ్చింది. "ఎప్పుడు టోర్నీ జరిగినా.. నోట్‌బుక్ తీసుకెళ్తా. అందులో అందరి పేర్లు రాసుకుంటా'' అని దిగ్వేశ్ సమాధానమిచ్చాడు. అంటే.. మ్యాచ్‌కు ముందు ప్రత్యర్థి జట్టులోని ఆటగాళ్లందరి పేర్లు దిగ్వేశ్ రాసుకుంటాడు. తన బౌలింగ్‌లో ఔటైన ఆటగాడి పేరుపై గీత గీస్తాడు. తన ప్రదర్శనను భద్రపరుచుకోవడంతో పాటు ఫలానా ఆటగాడిని ఔట్ చేశానని రికార్డు చేసుకోవడమే నోట్‌బుక్ ఉద్దేశం.

# అల్కరాజ్ జోరు

పారిస్ ఫ్రెంచ్ ఓపెన్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ అల్కరాజ్ మూడో రౌండ్‌కు దూసుకెళ్లాడు. ఏడో సీడ్ కాస్పర్ రూడ్ కథ ముగిసింది. మహిళల సింగిల్స్‌లో అయిదో సీడ్ స్వైటెక్ అలవోకగా రెండో రౌండ్‌ను అధిగమించింది. నాలుగో సీడ్ పావోలిని కూడా ముందంజ వేసింది.

రెండో సీడ్ అల్కరాజ్ (స్పెయిన్) ఫ్రెంచ్ ఓపెన్‌లో మూడో రౌండ్లో




ప్రవేశించాడు. బుధవారం రెండో రౌండ్లో అతడు 6-1, 4-6, 6-1, 6-2తో అన్‌సీడెడ్ ఆటగాడు ఫాబియాన్ మరోజ్‌సన్ (హంగేరి)పై విజయం సాధించాడు. తొలి సెట్‌ను అలవోకగా గెలుచుకున్న అల్కరాజ్.. అనూహ్యంగా రెండో సెట్‌ను కోల్పోయాడు. కానీ ఆ తర్వాత బలంగా పుంజుకుని తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించాడు. మ్యాచ్‌లో అల్కరాజ్ అయిదు ఏస్‌లు, 41 విన్నర్లు కొట్టాడు. ఎనిమిదిసార్లు ప్రత్యర్థి సర్వీసును బ్రేక్ చేశాడు. ఎనిమిదో సీడ్ ముసెట్టి (ఇటలీ) కూడా ముందంజ వేశాడు. సీడ్ రూడ్ (నార్వే) రెండో రౌండ్ దాటలేకపోయాడు. బోర్గ్స్ (పోర్చుగల్) 2-6, 6-4, 6-1, 6-0తో రూడ్‌కు షాకిచ్చాడు. బ్రెజిల్ టీనేజర్ ఫోన్సెకా రెండో రౌండ్లో అడుగుపెట్టాడు. 18 ఏళ్ల ఫోన్సెకా మొదటి రౌండ్లో 6-2, 6-4, 6-2తో 30వ సీడ్ హ్యూబర్ట్ హర్కజ్ (పోలెండ్)ను ఓడించాడు.

ఆమె అలవోకగా...: మహిళల సింగిల్స్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ స్వైటెక్ (పోలెండ్) అలవోకగా మూడో రౌండ్లో అడుగుపెట్టింది. ఏకపక్షంగా సాగిన తొలి రౌండ్లో ఆమె 6-1, 6-2తో రదుకాను (బ్రిటన్)ను చిత్తుగా ఓడించింది. తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించిన స్వైటెక్.. మ్యాచ్‌లో 3 ఏస్‌లు, 32 విన్నర్లు కొట్టింది. నాలుగుసార్లు రదుకాను సర్వీసును బ్రేక్ చేసింది. నాలుగో సీడ్ పావోలిని (ఇటలీ), ఎనిమిదో సీడ్ జెంగ్ (చైనా) కూడా ముందంజ వేశారు. రెండో రౌండ్లో పావోలిని 6-3, 6-3తో తొమ్లనోవిచ్ (ఆస్ట్రేలియా)పై, జెంగ్ 6-2, 6-3తో అరాంగో (కొలంబియా) గెలిచారు. ఇతర మ్యాచ్‌ల్లో స్వితోలినా (ఉక్రెయిన్) 7-6 (7-4), 7-5తో బొండార్ (ఫ్రాన్స్)పై, అసినిమోవా (అమెరికా) 6-0, 6-2తో గొలుబిచ్ (స్విట్జర్లాండ్)పై గెలిచింది. టాప్ సీడ్ సబలెంక కూడా మూడో రౌండ్లో అడుగుపెట్టింది..

రెండో రౌండ్లో అతడు 6-4, 6-0, 6-4తో గాలన్ (కొలంబియా)ను ఓడించాడు. ఇతర మ్యాచ్‌ల్లో హేలిస్ (ఫ్రాన్స్) 4-6, 6-3, 7-6 (7-2), 7-5తో కెచ్మనోవిచ్ (సెర్బియా)పై, కచనోవ్ (రష్యా)) 7-5, 3-6, 7-5, 4-6, 6-2తో ఆఫ్నర్ (ఆస్ట్రియా)పై, మెజెదోవిచ్ (సెర్బియా) 6-3, 6-4, 7-5తో సెరెండులో (అర్జెంటీనా)పై విజయం సాధించారు. ఏడో

భారత జోడీల ముందంజ: పురుషుల డబుల్స్‌లో రోహన్ బోపన్న, యుకి బాంబ్రి, బాలాజి.. తమ తమ భాగస్వాములతో రెండో రౌండ్లో అడుగుపెట్టారు. తొలి రౌండ్లో బోపన్న, పవ్లసెచ్ (చెక్) జంట 7-6 (8-6), 5-7, 6-1తో కాష్-ట్రాసీ (అమెరికా) జోడీపై విజయం సాధించింది. యుకి, రాబర్ట్ గాలోవే (అమెరికా) ద్వయం 6-3, 6-7 (8), 6-3తో రాబిన్ హాస్ (నెదర్లాండ్స్), హెండ్రిక్ జెబెన్స్ (జర్మనీ) జోడీపై గెలవగా.. బాలాజి, రేయస్ వరేలా (మెక్సికో) జంట 6-2, 6-1తో బు (చైనా), కార్బెల్లి (అర్జెంటీనా) ద్వయాన్ని ఓడించింది. మరో భారత ఆటగాడు రిత్విక్ బొల్లిపల్లి మాత్రం ముందంజ వేయలేకపోయాడు. తొలి రౌండ్లో రిత్విక్, బారింటోన్ (కొలంబియా) జంట 0-6, 2-6తో డియాలో (కెనడా), జాకబ్ ఫెర్న్లే (బ్రిటన్) ద్వయం చేతిలో ఓడిపోయింది.




# సాత్విక్ జోడీ ముందంజ

సింగపూర్: భారత స్టార్ షట్లర్లు సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి పునరాగమనం అదిరింది. సింగపూర్ ఓపెన్ ప్రపంచ టూర్ సూపర్ 750 టోర్నీలో సాత్విక్- చిరాగ్ జోడీ శుభారంభం చేసింది. బుధవారం పురుషుల డబుల్స్ తొలి రౌండ్లో భారత జంట 21-16, 21-13తో చూంగ్ జియాన్- మహ్మద్ హైకల్ (మలేసియా) జోడీని చిత్తుచేసింది. గాయంతో ఆటకు దూరమై.. సుదీర్ఘ విరామం తర్వాత పునరామనం చేసిన సాత్విక్- చిరాగ్ జంట 40 నిమిషాల్లో ప్రత్యర్థి జంట ఆటకట్టించి ప్రిక్వార్టర్‌ఫైనల్లో అడుగుపెట్టింది. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లో స్టార్ షట్లర్ లక్ష్యసేన్ 21-15, 17-21, 5-13 (రిటైర్డ్)తో లిన్ చున్ (చైనీస్ తైపీ) చేతిలో పరాజయం చవిచూశాడు. వెన్ను నొప్పి కారణంగా లక్ష్యసేన్ మ్యాచ్ నుంచి అర్ధంతరంగా తప్పుకున్నాడు. మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్లో రోహన్ కపూర్- గద్దె రుత్విక శివాని జోడీ 21-16, 21-19తో చెన్ యి- ఫ్రాన్సెస్కా కార్బెట్ (అమెరికా) జంటపై నెగ్గి ప్రిక్వార్టర్స్ చేరుకుంది. మహిళల సింగిల్స్ తొలి రౌండ్లో ఆకర్షి కశ్యప్ 21-17, 13-21, 7-21తో హాన్ యూ (చైనా) చేతిలో, ఉన్నతి హుడా 21-13, 9-21, 15-21తో వాంగ్ జి (చైనా) చేతిలో, అనుపమ ఉపాధ్యాయా 12-21, 16-21తో సుంగ్ యున్ (చైనీస్ తైపీ) చేతిలో ఓడారు.

స్టావంజర్ (నార్వే): నార్వే చెస్‌లో ఫేవరెట్లలో ఒకడైన దొమ్మరాజు గుకేశ్‌కు వరుస పరాజయాలు ఎదురయ్యాయి. ఆరుగురు గ్రాండ్‌మాస్టర్ల మధ్య డబుల్ రౌండ్ రాబిన్ పద్ధతిలో జరుగుతున్న ఈ టోర్నీ రెండో రౌండ్లో తెలుగబ్బాయి అర్జున్ ఇరిగేశి ప్రపంచ ఛాంపియన్‌కు ఓటమి రుచిచూపించాడు. తెల్ల పావులతో ఆడిన అర్జున్ ఆరంభం నుంచి దూకుడు ప్రదర్శించాడు. డిఫెన్స్‌తో ఆకట్టుకున్న గుకేశ్ గేమ్‌ను రసవత్తరంగా మార్చాడు. ఆఖర్లో సమయం మించిపోతుండటంతో ఆట ఉత్కంఠభరితంగా మారింది. కీలక సమయంలో రాణించిన అర్జున్ 62 ఎత్తుల్లో గుకేశ్‌ను ఓడించి.. పాయింట్ల పట్టికలో ఉమ్మడిగా అగ్రస్థానానికి చేరాడు. నకమురు (అమెరికా) 4.5 పాయింట్లతో అతడితో సమానంగా ఉన్నాడు. క్లాసికల్ ఫార్మాట్లో గుకేశ్‌తో జరిగిన ఆరు గేమ్‌ల్లో అర్జున్ విజయం సాధించడం విశేషం.



# 'గద్దర్' అవార్డులు: ఉత్తమ చిత్రం కల్కి.. ఉత్తమ నటుడు అల్లు అర్జున్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందించనున్న గద్దర్ ఫిల్మ్ అవార్డులను జ్యూరీ ఛైర్‌పర్సన్ జయసుధ ప్రకటించారు. ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజుతో కలిసి ఆమె మీడియా సమావేశం నిర్వహించారు. ఈ అవార్డుల కోసం మొత్తం 1248 నామినేషన్లు రాగా వాటిని పరిశీలించిన అనంతరం అవార్డు గ్రహీతల పేర్లను ప్రకటించారు. ఉత్తమ నటుడిగా 'పుష్ప 2' చిత్రానికి గానూ అల్లు అర్జున్ ఎంపికయ్యారు. ఉత్తమ చిత్రాలుగా కల్కితో పాటు మరో రెండు



సినిమాలకు అవార్డులు లభించాయి.

2024 బెస్ట్ ఫిల్మ్స్ ఇవే..

మొదటి ఉత్తమ చిత్రం: కల్కి 2898ఏడీ

రెండో ఉత్తమ చిత్రం: పొట్టేల్

మూడో ఉత్తమ చిత్రం: లక్కీ భాస్కర్

ఉత్తమ బాలల చిత్రం: 35 చిన్న కథ కాదు

హిస్టరీ - హెరిటేజ్ చిత్రం: రజాకార్

ఉత్తమ ప్రజాదరణ పొందిన చిత్రం: ఆయ్

ఉత్తమ పరిచయ దర్శకుడు: యదు వంశీ (కమిటీ కుర్రోళ్ళు)

ఉత్తమ దర్శకుడు: నాగ్ అశ్విన్ (కల్కి)

ఉత్తమ నటుడు: అల్లు అర్జున్ (పుష్ప 2)

ఉత్తమ నటి: నివేదా థామస్ (35 చిన్న కథ కాదు)

ఉత్తమ సహాయ నటుడు: ఎస్‌జే సూర్య (సరిపోదా శనివారం)

ఉత్తమ సహాయ నటి: శరణ్యా ప్రదీప్ (అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్)

ఉత్తమ గేయ రచయిత: చంద్రబోస్ (రాజు యాదవ్)

ఉత్తమ సంగీత దర్శకుడు: భీమ్స్ (రజాకార్)

ఉత్తమ నేపథ్య గాయకుడు: సిద్ శ్రీరామ్ (నిజమే నే చెబుతున్నా - ఊరి పేరు భైరవకోన)

ఉత్తమ నేపథ్య గాయని: శ్రేయా ఘోషల్ (సూసేకి అగ్గిరవ్వ - పుష్ప 2)

ఉత్తమ హాస్యనటుడు: సత్య, వెన్నెల కిశోర్ (మత్తువదలరా 2)

ఉత్తమ బాలనటుడు: మాస్టర్ అరుణ్ దేవ్ పోతుల (35 చిన్న కథ కాదు), బేబీ హారిక (మెర్సీ కిల్లింగ్)

ఉత్తమ కథా రచయిత: శివ పాలడుగు (మ్యూజిక్ షాప్ మూర్తి)

ఉత్తమ స్క్రీన్ ప్లే రచయిత: వెంకీ అట్లూరి (లక్కీ భాస్కర్)

ఉత్తమ సినిమాటోగ్రఫర్: విశ్వనాథ్ రెడ్డి (గామి)

ఉత్తమ ఎడిటర్: నవీన్ నూలి (లక్కీ భాస్కర్)

ఉత్తమ ఆడియోగ్రాఫర్: అరవింద్ మేనన్ (గామి)

ఉత్తమ కొరియోగ్రాఫర్: గణేశ్ ఆచార్య (ఆయుధ పూజ - దేవర)

ఉత్తమ ఆర్ట్ డైరెక్టర్: అద్నితిన్ జిహానీ చౌదరి (కల్కి 2898 ఏడీ)

ఉత్తమ యాక్షన్ కొరియోగ్రాఫర్: కె. చంద్రశేఖర్ రాథోడ్ (గ్యాంగ్‌స్టర్)

ఉత్తమ మేకప్ ఆర్టిస్ట్: నల్ల శ్రీను (రజాకార్)

ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్: అర్చనా రావు, అజయ్ కుమార్ (కల్కి 2898 ఏడీ)

# పవన్ కల్యాణ్ 'ఓజీ'లో నారా రోహిత్‌కు కాబోయే భార్య.. అధికారికంగా చెప్పిన నటుడు

పవన్ కల్యాణ్ ( హీరోగా సుజీత్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'ఓజీ' ఈ సినిమాలో నారా రోహిత్‌కు కాబోయే సతీమణి శిరీషా నటించనున్నట్లు వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. తాజాగా ఈ విషయంపై రోహిత్ క్లారిటీ ఇచ్చారు. 'భైరవం' ప్రచారంలో భాగంగా నిర్వహించిన ఇంటర్వ్యూలో దీని గురించి మాట్లాడారు.

టాలీవుడ్ హీరోలు బెల్లంకొండ సాయి శ్రీనివాస్, నారా రోహిత్, మంచు మనోజ్ నటించిన సినిమా 'భైరవం' ఈ సినిమా ప్రచారంలో భాగంగా టీమ్ అంతా సాయి దుర్గాతేజ్‌తో కలిసి సరదా ఇంటర్వ్యూ చేశారు. 'ఓజీ' అప్‌డేట్ చెప్పాల్సిందిగా నారా రోహిత్‌ను సాయి దుర్గాతేజ్ అడగ్గా.. 'ఇందులో నాకు కాబోయే భార్య శిరీషా నటించింది. 'ఓజీ'లో ఓ కీలక పాత్రలో నటించే అవకాశం తనకు దక్కింది' అని అన్నారు (%దీంతో ఈ ప్రకటన అధికారికమైంది. ఇన్ని రోజులు ఈ విషయాన్ని ఎందుకు చెప్పలేదంటూ రోహిత్‌ను మంచు మనోజ్ ఆట పట్టించారు.

ప్రస్తుతం 'ఓజీ' షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ముగింపు దశలో ఉన్న ఈ సినిమా సెప్టెంబర్ 25న ప్రేక్షకుల




ముందుకురానుంది. పవర్‌ఫుల్ గ్యాంగ్‌స్టర్ యాక్షన్ డ్రామాగా ముస్తాబవుతున్న ఈ చిత్రంలో పవన్ మునుపెన్నడూ చూడని శక్తిమంతమైన పాత్రలో కనువిందు చేయనున్నారు. ఇమ్రాన్ హాష్మీ ప్రతినాయకుడిగా నటిస్తున్నారు. ప్రియాంక అరుల్ మోహన్ కథానాయికగా కనిపించనున్నారు.

# సనాతన ధర్మం గొప్పతనాన్ని చాటే.. వీరమల్లు

%మన సంస్కృతి సంప్రదాయాలకి అద్దం పడుతూ... సనాతన ధర్మం గొప్పతనాన్ని వీర మల్లు పాత్ర చాటుతుందని చెప్పారు దర్శకుడు జ్యోతికృష్ణ. ఆయన క్రిష్ జాగర్లమూడితో కలిసి తెరకెక్కించిన చిత్రం 'హరి హర వీర మల్లు'. పవన్ కల్యా కథానాయకుడు. నిధి అగర్వాల్ కథానాయిక. బాబీ దేవోల్ ముఖ్య భూమిక పోషించారు. మెగా సూర్య ప్రొడక్షన్స్ పతాకంపై ఎ.దయాకర్ రావు నిర్మించారు. ఎ.ఎం.రత్నం సమర్పకులు. జూన్ 12న ఈ చిత్రం ( ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా ఈ చిత్రంలోని 'తార తార...' అంటూ సాగే పాటని బుధవారం చెన్నైలో విడుదల చేశారు. ప్రముఖ సంగీత దర్శకులు ఎం.ఎం.కీరవాణి స్వరపరిచిన ఈ గీతానికి శ్రీహర్ష సాహిత్యం అందించగా, లిప్సిక భాష్యం, ఆదిత్య అయ్యంగార్ ఆలపించారు. పాట విడుదల అనంతరం దర్శకుడు జ్యోతికృష్ణ మాట్లాడుతూ "మొఘల్ సామ్రాజ్యం నేపథ్యంలో సాగే కథ ఇది. అంతర్జాతీయ స్థాయి గ్రాఫిక్స్ కంపెనీలు ఈ సినిమా కోసం పనిచేశాయి. పవన్‌కల్యాణ్ కేవలం నటుడు మాత్రమే కాదు, ఆయనకి ఎన్నో విభాగాల్లో పట్టుంది. ఆరోగ్యం బాగోలేనప్పుడు కూడా ఈ సినిమా



కోసం పనిచేశార"న్నారు. సంగీత దర్శకుడు కీరవాణి మాట్లాడుతూ "పవన్ కల్యాణ్ సినిమా అంటే సంగీతంలోనూ పవర్ కనిపించాలి. అందరూ ఎంతో ప్రేమతో చేసిన ఈ చిత్రం ఘన విజయం సాధించాలని కోరుకుంటున్నా" అన్నారు. ఎ.ఎం.రత్నం మాట్లాడుతూ 'ఐదేళ్ల ఎంతో కష్టపడి ఈ సినిమాని రూపొందించాం. సంగీత దర్శకుడు కీరవాణి, కళా దర్శకుడు తోట తరణి... ఇలా పలువురు ప్రముఖులు ఈ సినిమాకి పనిచేశారు. ఈ సినిమాతో ఐదేళ్ల ప్రయాణం చేసిన నిధి అగర్వాల్‌కి కృతజ్ఞతలు' అన్నారు. ఈ కార్యక్రమంలో సినీ ప్రముఖులు కె.ఎస్.రవికుమార్, నాజర్, సత్యరాజ్ తదితరులు పాల్గొన్నారు. ఈ వేదికపై నిధి డ్యాన్స్ చేసి అలరించింది.

# 48 ఏళ్లుగా పని దొరుకుతూనే ఉంది

"చేస్తున్న పని సంతృప్తినిచ్చిందా లేదా? అని చూశానే తప్ప ఎప్పుడూ డబ్బు గురించి ఆలోచించలేదు. ఇప్పటికీ నా కోసం 'షష్టిపూర్తి' తరహా పాత్రలు రాస్తున్నారంటే అది నా అదృష్టం. మనం పోషించే పాత్రలే ప్రేక్షకులకు గుర్తుండాలనేది నేను నమ్మిన సూత్రం'' అన్నారు ప్రముఖ నటుడు రాజేంద్రప్రసాద్ (%=ఖయివఅఎతీఖ ూతీఖయిఖఎ%). కథానాయకుడిగా కడుపుబ్బా నవ్వించిన ఆయన... ప్రస్తుతం సహ నటుడిగానూ సినిమాలపై గొప్ప ప్రభావం చూపిస్తున్నారు. అటు హాస్యంతోనూ, ఇటు భావోద్వేగాలతోనూ ప్రేక్షకుల్ని అలరిస్తున్నారు. ఆయన ప్రధాన పాత్రధారిగా ఇటీవల 'షష్టిపూర్తి' (%ూష్ణుంష్ట్రఅజూశీశీతీష్ట్రఅ%) చేశారు. రూపేశ్, ఆకాంక్ష సింగ్ జంటగా నటించారు. సీనియర్ నటి అర్చన ముఖ్యభూమిక పోషించారు. మా ఆయి ప్రొడక్షన్స్ పతాకంపై రూపొందిన ఈ చిత్రం ఈ నెల 30న రానుంది. ఈ సందర్భంగా రాజేంద్ర ప్రసాద్ బుధవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు.

''పిల్లలు తల్లిదండ్రుల పెళ్లిని చూడలేరు. కానీ 60వ పెళ్లిని మాత్రం చూడగలరు. అందుకే 'షష్టిపూర్తి'కి అంత ప్రాధాన్యం. తెలుగువారి జీవితాల్ని ప్రతిబింబించే ఈ కథ ప్రతి ఒక్కరికీ కనెక్ట్ అవుతుంది. నటుడిగా నాకెంతో సంతృప్తినిచ్చిన చిత్రమిది. నా పాత్రతో నవ్విస్తాను, ఏడిపిస్తాను. సినిమా చూసి వచ్చాక ప్రతి ఒక్కరూ వాళ్ల తల్లిదండ్రుల దగ్గరకు వెళ్లి ప్రేమగా పలకరిస్తారు. ఇళయరాజా మాతో పోటీపడి అద్భుతమైన పాటలు అందించారు. కీరవాణి మా కోసం పాట రాశారు. చైతన్యప్రసాద్ మంచి సాహిత్యం ఇచ్చారు. ఇదొక గొప్ప చిత్రం అవుతుందని నా గుండె మీద చేయి వేసుకుని చెబుతున్నా".

''నేను చేస్తే పాత్రకి ప్రాధాన్యం లభిస్తుందంటే కచ్చితంగా చేస్తాను. 'సింగిల్' సినిమాలో మూడే సన్నివేశాలైనా నటించానంటే కారణం అదే. అప్పట్లో ఆరోగ్యకరమైన హాస్యంతో అందరినీ నవ్వించా. ఇప్పుడు అలాంటి టైమింగ్, రైటింగ్‌తో కూడిన కామెడీ కరవైంది. మంచి హాస్యానికి దూరం అవుతున్నామనే బాధ ఉంది. రచయితలే అందుకు కారణం. ప్రస్తుతం నా చేతిలో 11 సినిమాలు ఉన్నాయి. ఇంకో నాలుగు సినిమాలు చర్చల దశలో ఉన్నాయి. నేను ఆంగ్లంలో చేసిన 'క్విక్‌గన్ మురుగన్' మూడు భాగాలుగా వస్తుంది. రెండో భాగం త్వరలోనే మొదలు కాబోతోంది. ఏఐ సాంకేతికతో కొన్ని సన్నివేశాల్ని తీస్తారు. చేస్తున్న పని, పోషిస్తున్న పాత్రలే నాకు సంతృప్తినిస్తున్నాయి. 48 ఏళ్లుగా నాకు పని దొరుకుతూనే ఉంది".

"కళ అనేది సముద్రం. మొత్తం సముద్రాన్ని తాగగలమా? ఈదగలమా? కళ కూడా అంతే. ఎప్పటికీ ఆకలి, దాహం తీరదు. నటుడిగా ఇంకెన్నో పాత్రల్ని పోషించాలని ఉంటుంది. ఈ సినిమాలో ఒకొక్కసారి ఒక్కో వయసుతో, మూడు



కోణాల్లో కనిపించే అవకాశం లభించింది. 'లేడీస్ టైలర్' సినిమా మాడ్యులేషన్, గెటప్ కావాలన్నాడు దర్శకుడు. నాదైన యాటిట్యూడ్‌తో ఆ పాత్రని అలవోకగా పోషించా. ఈ సినిమా ప్రయాణం నాకొక సవాల్‌గా అనిపించింది. నేను, అర్చన కలిసి 'లేడీస్ టైలర్' సినిమాలో నటించాం. మళ్లీ ఇన్నేళ్లకి మేం కలిసి 'షష్టిపూర్తి' చేశాం. మా కథానాయకుడు, నిర్మాత రూపేశ్... ప్రముఖ నిర్మాత ఆర్.బి.చౌదరి బంధువు. ఈ సినిమాలో తన నటన, నిర్మాతగా తన అభిరుచి ప్రతి ఒక్కరినీ మెప్పిస్తుంది".

# నా స్క్రీన్‌ప్లేకి కారణం ఉపేంద్ర సినిమాలే


"ఎప్పటికప్పుడు ప్రేక్షకుల్ని ఆశ్చర్య పరచడం ఉపేంద్ర అలవాటు. ఆయన తీసిన 'ఓం', 'ఏ', 'ఉపేంద్ర'... సినిమాలే ఇప్పుడు నా స్క్రీన్‌ప్లే ఇలా ఉండటానికి కారణం" అన్నారు ప్రముఖ దర్శకుడు సుకుమార్. ఆయన, ఉపేంద్ర ముఖ్య అతిథులుగా బుధవారం రాత్రి హైదరాబాద్‌లో 'సీతాపయనం' టీజర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ప్రముఖ నటుడు అర్జున్ సర్జా దర్శకత్వం వహించిన చిత్రమిది. ఆయన కూతురు ఐశ్వర్య అర్జున్ ప్రధాన పాత్రని పోషించారు. శ్రీరామ్ ఫిలిం ఇంటర్నేషనల్ సంస్థ నిర్మిస్తోంది. టీజర్ ఆవిష్కరణ అనంతరం సుకుమార్ మాట్లాడుతూ "నేను సహాయ దర్శకుడిగా ఉన్నప్పుడే




అర్జున్ సర్జాని దగ్గర నుంచి చూశా. ఆయన కూల్‌గా ఉంటారు. ఇప్పటికీ అలాగే ఉన్నారు. అర్జున్, ఉపేంద్రతో కలిసి ఈ వేదికని పంచుకోవడం ఆనందంగా ఉంది" అన్నారు. ఉపేంద్ర మాట్లాడుతూ "అర్జున్ అంటే భారతదేశంలో ఓ బ్రూస్‌లీతో సమానం. కన్నడ, తమిళ, తెలుగు.. ఇలా ఆయన అప్పట్లోనే పాన్ ఇండియా స్టార్" అన్నారు. ఈ కార్యక్రమంలో అర్జున్ సర్జా, చంద్రబోస్, అనూప్ రూబెన్స్, కథానాయకుడు నిరంజన్, ఐశ్వర్య తదితరులు పాల్గొన్నారు.

# హెల్త్ బిట్స్- జ్ఞాపకశక్తి మాత్రలు

జ్ఞాపకశక్తి సమస్యలున్న వృద్ధులు పజిల్స్‌ను పరిష్కరించడం ద్వారా మనుషుల్ని గుర్తించే సామర్థ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చని, మెదడు కుంచించుకుపోకుండా కాపాడుకోవచ్చని అధ్యయనాలు చెబుతున్నాయి. క్రమంతప్పకుండా మూడు నెలలపాటు ప్రహేళికలను పరిష్కరించిన వారిని, అలా చేయని వారితో పోల్చిచూసి పరిశోధకులు ఈ నిర్ధారణకు వచ్చారు. ఈ ఫలితం 'న్యూ ఇంగ్లండ్ జర్నల్ ఆఫ్ మెడిసిన్'లో ప్రచురితమైంది. అధ్యయనంలో పాల్గొన్నవారిలో కొంత మందికి 12 వారాలపాటు మెదడుకు పదును పెట్టే ఆటలు ఆడించారు. అదే సమయంలో మిగిలినవారిని ఖాళీగా ఉంచారు. వీరిలో ఆటల్లో పాల్గొన్నవారి మెదడు, ఆడనివారితో పోలిస్తే చురుగ్గా పనిచేసిందట. క్రాస్‌వర్డ్స్ పూర్తిచేయడం అనేది తీవ్రమైన జ్ఞాపకశక్తి సమస్యలు ఎదుర్కొంటున్న వారికి కూడా ప్రయోజనకరంగా ఉంటుందని పరిశోధకులు కనుగొన్నారు. ఓ మోస్తరు సమస్యలు ఉన్నవారికేమో క్రాస్‌వర్డ్స్, ఆటలు రెండూ ఉపయోగకరంగా ఉంటాయట.



కొవ్వు, చక్కెర అధికంగా ఉండే పాశ్చాత్య రుచులకు, కాలేయ సంబంధ వ్యాధి అయిన నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్ (ఎన్ఏఎఫ్ఎల్‌డీ)కు దగ్గరి సంబంధం ఉందట. ఈ విషయాన్ని మిస్సోరి విశ్వవిద్యాలయానికి చెందిన స్కూల్ ఆఫ్ మెడిసిన్ వెల్లడించింది. దీర్ఘకాలిక కాలేయ వ్యాధులకు మూలకారణం ఎన్ఏఎఫ్ఎల్‌డీ. అనారోగ్యకరమైన ఆహారం పొట్టలోని సూక్ష్మజీవుల మీద దుష్ప్రభావం చూపుతుంది. ఇది కాలేయాన్ని దెబ్బతీసే రోగకారకాల ఉత్పత్తిని ప్రేరేపిస్తుంది. ఈ పరిశోధన ఎలుకల మీద నిర్వహించారు. అధిక కొవ్వు, చక్కెర ఉన్న పదార్థాలను ఎలుకలకు పెట్టినప్పుడు.. వాటి పొట్టలో, కాలేయంలో.. ఇన్‌ఫ్లమేషన్, ఫైబ్రోసిస్ (కాలేయం గట్టిపడటం) వృద్ధి చెందించే బ్లాటియా ప్రొడక్టా అనే బ్యాక్టీరియా పెరగుదలకు కారణమైంది. ఇది ఎలుకల్లో నాన్ ఆల్కహాలిక్ స్టీటోహెపటైటిస్ లేదా ఫ్యాటీ లివర్ డిసీజ్‌కు దారితీసిందట.

తల్లుల సంరక్షణే ప్రధానం

వివిధ కారణాల వల్ల ఒంటరిగా మారిన తల్లులు కుటుంబ పోషణకు ఏదో ఒక పని చేయాల్సిన పరిస్థితులు తలెత్తడం సహజం. అయితే, ఈ పరిణామం కౌమారంలో ఉన్న పిల్లల మీద దుష్ప్రభావం చూపుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి. అంతేకాదు ఒంటరి తల్లులు రోజంతా ఇంటికి దూరంగా ఉండటం అనేది.. పిల్లల మానసిక ఆరోగ్యాన్నీ ప్రభావితం చేస్తుందని తేలింది. లండన్‌లోని కింగ్స్ కాలేజ్ ఈ అధ్యయనం నిర్వహించింది. ఒంటరి తల్లులు ఉద్యోగానికి వెళ్తే, పిల్లల మీదపడే దుష్ప్రభావాలు స్వల్పమైనవే అయినా, ఆ తీవ్రత మాత్రం ఎక్కువేనని పరిశోధకులు వెల్లడించారు.

# ఆహారంలో ఉప్పు, చక్కెర తగ్గాల్సిందే.


ఆహారపు అలవాట్లతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని అందరికీ తెలుసు. కానీ అందుబాటులో ఉన్న టెక్నాలజీ ఆహార అలవాట్లపై పుష్కల సమాచారాన్ని చేతి వేళ్లపై దొరికేలా చేస్తుండటంతో ఎన్నో అపోహలు, ఊహాగానాలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆహార అలవాట్లకు శాస్త్రీయతను జోడించి జాతీయ పోషకాహార సంస్థ (ఎన్ఐఎన్) డైటరీ గైడ్ లైన్స్‌ను రూపొందించింది. 2011 నుంచి అమలు చేస్తున్న 15 మార్గదర్శకాలను 12 ఏండ్ల తర్వాత ఆధునిక జీవన విధానానికి అనుగుణంగా సవరించింది. ఇటీవల కాలంలో హైఫ్యాట్, షుగర్, సాల్ట్ ఆహారాల వినియోగం విపరీతంగా పెరగడంతో ఆహార అలవాట్లలో మార్పులు చేసుకోవాలని సూచించింది. ఈ సూచనలు ప్రస్తుతం ఐసీఎంఆర్ తుది పరిశీలనలో ఉన్నాయి. ఈ ఏడాది సెప్టెంబర్‌లోగా పబ్లిక్ డొమైన్‌లోకి రానున్నాయి.



మహిళలు, పురుషులు, చిన్నపిల్లలు, గర్భిణులు తమ వయసు, స్థితిగతులకు అనుగుణంగా తీసుకోవాల్సిన క్యాలరీలు, పోషక విలువలు, సూక్ష్మపోషకాలను ఎన్ఐఎన్ మార్గదర్శకాల్లో పేర్కొన్నది. సాధారణంగా సగటు మనిషి 2,400 క్యాలరీల శక్తినిచ్చే ఆహారాన్ని తీసుకోవాలి. కార్బొహైడ్రేట్లు, ప్రోటీన్లతోపాటు జీవక్రియలు సజావుగా సాగేందుకు ఐరన్, ఫోలిక్‌యాసిడ్, విటమిన్లు, సూక్ష్మ పోషకాలు తప్పనిసరిగా ఉండాలి. దీనికోసం రోజువారీ ఆహారంలో 396 గ్రాముల చిరుధాన్యాలు, 28 గ్రాముల పప్పులు, 82 గ్రాముల పాలు, పాల పదార్థాలు, 49 గ్రాముల కూరగాయలు, 14 గ్రాముల నూనె/నెయ్యి తీసుకోవాలని ఎన్ఐఎన్ స్పష్టంచేసింది. వీటిలో మాత్రం మార్పులు వచ్చినా శరీర ఎదుగుదల మందగించి అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉన్నదని హెచ్చరించింది.

# రక్తం తగ్గినప్పుడు..

ప్రతి 120 రోజులకు ఒకసారి మన శరీరంలో రక్తకణాలు పుడుతూ ఉంటాయి. సాధారణంగా శరీర వ్యవస్థకు అవసరమైన రక్తాన్ని దేహమే తయారు చేసుకుంటుంది. కానీ పెద్ద పెద్ద శస్త్ర చికిత్సలు, ప్రమాదాల సమయంలో రక్తం ఎక్కువగా పోతుంది. రోగి రక్తహీనతకు గురవుతాడు. ఈ సమయంలో పోషకాహారం ద్వారా వేగంగా కోలుకోవచ్చు. ఇందుకు ఐరన్ అధికంగా ఉండే ఆహార పదార్థాలు తీసుకోవాలి. ఇనుమును శరీరం శోషించుకోవాలంటే విటమిన్-సి అవసరం. అలాగే ప్రొటీన్స్ కూడా హిమోగ్లోబిన్ తయారీకి ఎంతగానో ఉపయోగపడుతాయి.



గాయాలు త్వరగా మానేందుకూ సహకరిస్తాయి. అందుకే బెల్లం, ఎండుద్రాక్ష, ఎండు ఖర్జూర, దానిమ్మలాంటి వాటితో పాటు వివిధ పండ్లను తీసుకోవడం ద్వారా ఐరన్ ఎక్కువగా లభిస్తుంది. విటమిన్-సి కోసం బత్తాయి, దానిమ్మ, నిమ్మరసంలాంటివి తీసుకోవాలి. మాంసాహారులైతే చికెన్, మటన్, లివర్‌లలో ప్రొటీన్ బాగా దొరుకుతుంది. శాకాహారులు ప్రొటీన్ కోసం మొలకెత్తిన గింజలు, పప్పులు, సోయా, పనీర్ తీసుకోవచ్చు. గాయాలుఉన్నప్పుడు పప్పులు తింటే చీము వస్తుందన్నది అపోహ మాత్రమే. పైగా వీటిలోని ప్రొటీన్లు గాయాల్ని త్వరగా మాన్పేందుకు తోడ్పడతాయి.

# మెదడుపై వార్.. బ్రెయిన్ ట్యూమర్!

మనిషి శరీరానికి మెదడు సమన్వయ వ్యవస్థ లాంటిది. నడిపించినా, పరుగెత్తించినా, నవ్వించినా, ఏడిపించినా.. అదంతా మెదడు పనితనమే. కానీ మెదడులో ఏర్పడే గడ్డలు.. శరీరంలోని ఇతర భాగాలతో లంకెను తొలగించేస్తాయి. ఫలితంగా రోగి శారీరక, మానసిక స్థితిలో మార్పులొస్తాయి. ఆ గడ్డలు ఇతర భాగాలకూ విస్తరించవచ్చు. ఇంకొన్నిసార్లు ఇంకెక్కడో మొదలై మెదడు వరకూ చేరుకోవచ్చు. ఈ ప్రాణాంతక స్థితినే వైద్య పరిభాషలో బ్రెయిన్ ట్యూమర్ అంటారు.



వాటి లక్షణాల ఆధారంగా కొన్ని ట్యూమర్లను ప్రారంభంలోనే గుర్తించవచ్చు. కొన్నిసార్లు పూర్తిగా విస్తరించాక కానీ ఉనికి వెల్లడి కాదు. తీరా వైద్యులను సంప్రదించి, రోగ నిర్ధారణ జరిగే సమయానికి ట్యూమర్ పెద్దదై పోతుంది. ఇతర భాగాలతో మెదడు సమన్వయం కోల్పోతుంది. కొన్ని ట్యూమర్లు క్యాన్సర్లుగా పరిణమించవచ్చు. ఒకటే గుడ్డిగుర్తు. మెదడులో ట్యూమర్ వల్ల ప్రభావితమైన ప్రాంతం, మిగిలిన భాగాల కంటే తక్కువ చురుగ్గా ఉంటుంది.

బ్రెయిన్ ట్యూమర్ అంటే..

మెదడు, దాని పరిసరాల్లో కణాల అసాధారణ పెరుగుదలే.. బ్రెయిన్ ట్యూమర్. మెదడు కణ జాలంలో, కణజాలానికి దగ్గరలో.. అంటే నరాలు, పీయూష గ్రంథి, పీనియల్ గ్రంథి, మెదడు ఉపరితలాన్ని కప్పి ఉంచే పొరల్లో కొన్నిసార్లు ట్యూమర్లు తలెత్తుతాయి. మెదడులో ప్రారంభమయ్యే కణుతులు.. ప్రాథమిక బ్రెయిన్ ట్యూమర్లు. కొన్నిసార్లు ఇతర భాగాల నుంచి కూడా వ్యాపిస్తాయి. ఇలాంటి వాటిని 'సెకండరీ' లేదా 'మెటాస్టాటిక్ బ్రెయిన్ ట్యూమర్లు' అని పిలుస్తారు. మళ్లీ.. ప్రాథమిక ట్యూమర్లలో

అనేక రకాలున్నాయి. వీటిలో క్యాన్సర్లు కాని వాటిని 'నాన్ క్యాన్సరస్' లేదా 'బినైన్ బ్రెయిన్ ట్యూమర్లు' అంటారు. ఇవి అభివృద్ధి చెందడానికి కొంత సమయం పడుతుంది. మిగిలిన బ్రెయిన్ ట్యూమర్లు.. అచ్చమైన మెదడు క్యాన్సర్లు. వీటిని 'మాలిగ్నెంట్ ట్యూమర్లు'గా వ్యవహరిస్తారు. మెదడు క్యాన్సర్లు చాలా వేగంగా వృద్ధి చెందుతాయి. మెదడు కణజాలంపై దాడి చేసి, సర్వనాశనం చేస్తాయి.

తొలి సంకేతాలివే..

చిన్న లక్షణాలే కావచ్చు. నిర్లక్ష్యం చేయలేం.

ఏ సంకేతాన్నీ వదలడానికి వీల్లేదు.

తలనొప్పి తీవ్రంగా వేధిస్తుంది. ముఖ్యంగా ఉదయం పూట శిరోభారాన్ని భరించలేం. అందులోనూ, వాంతి తర్వాత తలనొప్పి మరీ ఎక్కువగా ఉంటుంది.

తలపట్టేసినట్టు అనిపిస్తుంది. ఇంతకుముందు ఈ సమస్య లేనివారిని మరింత తీవ్రంగా బాధిస్తుంది.

ఎడతెరపి లేకుండా వికారం, వాంతి.

మసకమసగ్గా కనిపించడం, ఒక దృశ్యం రెండుగా అనిపించడం, దృష్టి కోల్పోవడం.. తదితర నేత్ర సంబంధ సమస్యలు తలెత్తుతాయి.

బలహీనత, తిమ్మిర్లు, చేతులూ కాళ్లలో వణుకు.. వీటిలో ఏదో ఓ లక్షణం ఉండవచ్చు. కొన్నిసార్లు అన్నీ చుట్టుముట్టవచ్చు.

శరీరంలోని వివిధ అవయవాలు సమన్వయం కోల్పోవడం.

మాటల్లో స్పష్టత లోపిస్తుంది. ఎదుటివారి మాటలను అర్థం చేసుకోవడమూ కష్టమే అవుతుంది.

వ్యక్తిత్వంలో తేడాలొస్తాయి. నిన్నమొన్నటి వరకు మహా గంభీరంగా ఉన్న వ్యక్తి.. లొడలొడా వాగేయవచ్చు. లేదంటే, మాటకారి మౌనాన్ని ఆశ్రయించవచ్చు. భావోద్వేగాలు దాచుకోలేరు. ఇట్టే కోపం వచ్చేస్తుంది, అంతలోనే ఏడుపు తన్నుకొస్తుంది. ప్రవర్తనలోనూ అనేక మార్పులు కనిపిస్తాయి. 'ఇతను అతనేనా?' అనిపిస్తుంది.

అనేక కారణాలు..

కొందరికే బ్రెయిన్ ట్యూమర్స్ ఎందుకొస్తాయి? అనే విషయంలోనూ కచ్చితమైన విశ్లేషణ లభించడం లేదు. ప్రాథమికంగా ఇవీ కారణాలు కావచ్చు.

వయసుతోపాటు వచ్చే మార్పులు కూడా కొన్నిసార్లు బ్రెయిన్ ట్యూమర్లకు కారణం అవుతాయి. వృద్ధుల మెదడులో కణుతులు సర్వ సాధారణం. అలా అని, ఈ వ్యాధి వయోధికులకే దాపురిస్తుందనీ చెప్పలేం. కాకపోతే, పెద్దలకు వచ్చే ఆస్కారం ఎక్కువ.

స్త్రీలతో పోలిస్తే పురుషుల్లోనే మెదడులో కణుతులు తలెత్తే ముప్పు ఎక్కువని అనేక అధ్యయనాల్లో వెల్లడైంది.

మనిషి ఆరోగ్యాన్ని జన్యువులు అనేక రకాలుగా ప్రభావితం చేస్తాయి. న్యూరో ఫైబ్రోమాటోసిస్ లాంటి ప్రత్యేక జన్యు సమస్యలు బ్రెయిన్ ట్యూమర్ల రిస్కును పెంచేస్తాయి. తల్లిదండ్రులలో ఎవరో ఒకరు గతంలో బ్రెయిన్ ట్యూమర్ బారిన పడినట్టయితే.. పిల్లలకూ రావచ్చని అధ్యయనాలు చెబుతున్నాయి. వంశ పారంపర్యంగా బ్రెయిన్ ట్యూమర్ల చరిత్ర ఉంటే కూడా ప్రమాదా వకాశాలు ఎక్కువే.

కరోనా సమయంలో రోగ నిరోధక శక్తి గురించి లోతైన చర్చ జరిగింది. జనం కూడా ఇమ్యూనిటీ ప్రాధాన్యాన్ని అర్థం చేసుకుంటున్నారు. హెచ్ఐవీ/ఎయిడ్స్ లాంటి వాటివల్ల రోగ నిరోధక వ్యవస్థ బలహీనపడిన వారు, ఇమ్యునోసప్రెసెంట్ డ్రగ్స్ తీసుకునే వారి మెదడులో కణుతులు అభివృద్ధి చెందే ప్రమాదం అధికం%%%. మెదడులో కణుతులు నివారించడం అనేది అసాధ్యం. కానీ, ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటే కొన్ని రకాలైన బ్రెయిన్ ట్యూమర్లు రాకుండా జాగ్రత్తపడొచ్చు. రోడ్డు ప్రమాదాలు, ఆటల్లో దెబ్బలు, పర్వతారోహణలో అదుపుతప్పి పడిపోవడం.. ఇలా వివిధ సందర్భాలలో తలకు గాయాలు అవుతుంటాయి. అవి మెదడులో ట్యూమర్ల ముప్పును పెంచుతాయి. కాబట్టి, బైకు నడుపుతున్నప్పుడు, సాహస క్రీడల్లో పాల్గొంటున్నప్పుడు హెల్మెట్ తప్పక ధరించాలి. దీనవల్ల గాయాలను నిలువరించవచ్చు, ట్యూమర్ గండాన్నీ తప్పించుకోవచ్చు.

రేడియేషన్ నుంచి రక్షణ

తల, మెడ భాగాలు రేడియేషన్‌కు గురైనప్పుడు సైతం మెదడులో కణుతులు తలెత్తుతాయి. కాబట్టి, అనవసరమైన సీటీ స్కాన్‌లను నివారించాలి. శరీరం రేడియేషన్‌కు గురికాకుండా చూసుకోవాలి. అతినీలలోహిత కిరణాల నుంచి మనల్ని మనం రక్షించుకోవాలి. మధ్యాహ్నం పూట సాధ్యమైనంత వరకూ నీడపట్టున ఉండాలి.

ఆరోగ్యకరమైన జీవితం: వ్యాయామం, సమతులాహారం చాలా ముఖ్యం. ధూమపానం, మద్యపానానికి దూరంగా ఉండాలి.

క్రమం తప్పని వైద్య పరీక్షలు: రెగ్యులర్ మెడికల్ చెకప్స్ వల్ల జన్యుపరమైన ఆరోగ్యం గురించి తెలుస్తుంది. ప్రాథమిక దశలోని రుగ్మతలు బయటపడతాయి. బ్రెయిన్ ట్యూమర్ల కారకాలను గుర్తించవచ్చు. వంశపారంపర్యమైన బ్రెయిన్ ట్యూమర్ల ఉనికిని కనిపెట్టవచ్చు. ఇందుకు జెనెటిక్ కౌన్సెలింగ్ ఎంతో ఉపయోగపడుతుంది.

దీటైన వైద్యంమెదడులో బ్రెయిన్ ట్యూమర్ ఏర్పడినంత మాత్రాన భయపడాల్సిన పన్లేదు. అనేక వైద్య విధానాలు అందుబాటులో ఉన్నాయి. శస్త్రచికిత్స ద్వారా బ్రెయిన్ ట్యూమర్లను తొలగించడం అనేది ఓ ప్రాథమిక చికిత్స. మినిమల్లీ ఇన్వేసివ్ సర్జరీ, అవేక్ బ్రెయిన్ సర్జరీ లాంటి అడ్వాన్స్‌డ్ సర్జికల్ టెక్నిక్స్ ద్వారా కణుతుల దుష్ప్రభావాలను తగ్గించవచ్చు. ఫలితాలను మెరుగుపరచవచ్చు.

# ఫ్రెంచ్ ఫ్రైస్ తింటే ఆందోళన!

ఫ్రెంచ్ ఫ్రైస్ తినేవారు నిరాశ, నిస్పృహ, ఆందోళనకు గురవుతున్నట్టు తాజా అధ్యయనంలో వెల్లడైంది. చైనాకు చెందిన పరిశోధకులు ఈ అధ్యయన ఫలితాన్ని వెలువరించారు. దీన్ని అమెరికాకు చెందిన ప్రొసీడింగ్స్ ఆఫ్ ది నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్స్ (పీఎన్ఏఎస్) జర్నల్‌లో ప్రచురించారు. 1,40,728 మందిపై పదకొండేండ్ల పాటు ఈ పరిశోధన కొనసాగింది.



ఫ్రెంచ్ ఫ్రైస్ తిన్నవారు తినని వారితో పోలిస్తే 12 శాతం అధికంగా ఆందోళనకు గురయ్యే అవకాశం ఉన్నట్టు ఇందులో తేలింది. నిరాశ, నిస్పృహకు 7 శాతం అధికంగా లోనయ్యే ఆస్కారం ఉన్నట్టు వివరించారు. వేయించిన పదార్థాలు తింటున్న వారు మానసిక ఆందోళనకు గురవుతున్నారా లేక మానసిక ఆందోళనకు గురైనవారు వేయించిన పదార్థాలకు ఆకర్షితులవుతున్నారా? అనేది తెలియాల్సి ఉంది.

# దాల్చినచెక్కలో క్యాన్సర్

మసాలా దినుసుగా వంటకాల్లో ఎక్కువగా వాడే దాల్చిన చెక్కలో రోగ నివారణ గుణాలున్నాయని ఆయుర్వేద వైద్యం ఎప్పుడో తేల్చింది. కాగా అల్లోపతి వైద్యంలో కూడా దాల్చిన చెక్క ద్వారా



మొండి రోగాలను నియంత్రించవచ్చని తాజా అధ్యయనాలు తెలుపుతున్నాయి. జాతీయ పోషకాహార సంస్థ (ఎన్ఐఎన్) ఎలుకలపై చేసిన ప్రయోగాల ప్రకారం దాల్చిన చెక్క నుంచి సేకరించిన మిశ్రమంలోని కొన్ని రసాయన సమ్మేళనాలు క్యాన్సర్‌ను నియంత్రిస్తున్నట్టుగా తేలింది. దాల్చిన చెక్కలో క్యాన్సర్ కణాల వృద్ధిని అరికట్టే గుణం ఉన్నట్టు ఎన్ఐఎన్ తెలిపింది. అయితే ఈ ప్రయోగం ఎలుకలపైనే నిర్వహించామని, మనుషులపై చేయడానికి ఇంకా కొంతకాలం పడుతుందని పేర్కొంది.

దాల్చిన చెక్కలో ప్రోసైనిడిన్ బీ2

దాల్చిన చెక నుంచి తీసిన సారంలో క్రియాశీలకంగా ఉండే ప్రోసైనిడిన్ బీ2లో యాంటీ క్యాన్సర్ ప్రభావం ఉన్నట్టు పరిశోధకులు గుర్తించారు. ప్రొస్టేట్ క్యాన్సర్ ఉన్న ఎలుకను శాంపిల్‌గా తీసుకొని ప్రయోగంచేపట్టి కీమోప్రివెంటివ్ ఎఫిషియన్సీని అధ్యయనం చేశారు. దాల్చినచెక, దాని బయోయాక్టివ్ సమ్మేళనాలు ప్రొస్టేట్ క్యాన్సర్ ఉన్న ఎలుక నమూనాలో ప్రొస్టేట్‌లోని కెమికల్ కార్సినోజెన్, టెస్టోస్టిరాన్‌ల కలయికకు విరుద్ధంగా పనిచేయడాన్ని గమనించారు. కీమో-ప్రివెంటివ్ డ్రగ్స్ మాదిరిగానే పనిచేసే గాఢత కలిగిన దాల్చిన చెక బయోయాక్టివ్ సమ్మేళనాలు కణాల విస్తరణను నిరోధించినట్టు తేల్చారు. దీనిపై మరింత లోతుగా విశ్లేషించాల్సి ఉండగా.. జంతువులపై జరిగిన ప్రయోగాల్లో సత్ఫలితాలు వచ్చినట్టు తెలిసింది.

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed at Sri Muktheswara Publications, D.No. 10-1-70/A, Lingojiguda, Opp. H.P Gas Agency, Karmanghat, Saroornagar ,RangaReddy( Dist.), Hyderabad - 500035, Telangana .Published at Plot No.43,Flat No.210,Raja Rjeswari APTS,HUDA Complex,Saroornagar,Ranga Reddy(Dist),Hyderabad.500035, Telangana
Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy